పుస్తక ప్రియులకు ఇదే మా ఆహ్వానం
38వ హైదరాబాద్ జాతీయ పుస్తక ప్రదర్శన
తెలంగాణ కళాభారతి (ఎన్టీఆర్ స్టేడియం), హైదరాబాద్
డిసెంబర్ 19 నుండి 29 వరకు - మ॥ 1 నుండి రా॥ 9 వరకు
నవచేతన బుక్ హౌస్ స్టాల్ నం. 292 - 295
నవచేతన పబ్లిషింగ్ హౌస్ స్టాల్ నం. 339 - 344

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★

బంగ్లాదేశ్ మీడియాది.. తప్పుదోవ పట్టించే ప్రచారం
పార్లమెంటరీ సంప్రదాయాలు తుంగలోకి.. 05
బిజెపి ప్రధాన ఎజెండా.. 'ఒక దేశం, ఒక వ్యాపారవేత్త'

సంపుటి 09, సంచిక: 26 | సోమవారం | 22-12-2025 | మహబూబ్‌నగర్ Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00



ఆదివారం బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఇచ్చిన తేనీటి విందులో పాల్గొన్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మాజీ గవర్నర్ దత్తాత్రేయ, శాసనసభ స్పీకర్ ప్రసాదరావు, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

## 'విబి-జి రామ్ జి'కి రాష్ట్రపతి జై

- ఎంజి నరేగా స్థానంలో తీసుకువచ్చిన బిల్లుపై ద్రౌపది ముర్ము సంతకం
- ఇక ఇరవై ఏళ్లు ఉపాధి హామీ చట్టం కనుమరుగు

**న్యూఢిల్లీ :** మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంను రద్దు చేసి దాని స్థానంలో కొత్త చట్టం తీసుకొచ్చిన 'వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్(గ్రామీణ్' (విబి– జి రామ్ జి) బిల్లుకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోదం తెలిపారు. ఈ విషయాన్ని గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ వెల్లడించింది. దీంతో ఈ బిల్లు చట్టంగా మారింది. గ్రామీణ ప్రాంతాల్లో అవసరమైనవారికి ఏడాదిలో 125 రోజుల పాటు పని కల్పించే ఉద్దేశంతో కేంద్రం ఈ బిల్లును తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. గతంలో 100 రోజుల పని హామీ కల్పించిన మహాత్మాగాంధీ తరువాయి 2లో

## కెసిఆర్ చేయాల్సింది ఉద్యమాలు కాదు

### తెలంగాణ ప్రజలకు ముందు క్షమాపణలు చెప్పాలి



- రీ డిజైన్ల పేరుతో నీటిపారుదల రంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేశారు.
- మాజీ సిఎం చెప్పినవన్నీ పచ్చి అబద్ధాలే
- రూ.లక్షల కోట్లు అప్పుచేసి కాళేశ్వరం కడితే కూలింది
- పాలమూరు – రంగారెడ్డి కింద ఒక్క ఎకరం ఆయకట్టు ఇచ్చారా?
- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నిలదీత

ప్రజాపక్షం/హైదరాబాద్

మాజీ ముఖ్యమంత్రి, బిఆర్‌ఎస్ అధ్యక్షులు కె.చంద్రశేఖరరావు చేయాల్సింది ఉద్యమాలు కాదని, ముందుగా తెలంగాణ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని నీటి పారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. రీడిజైన్ పేరుతో రాష్ట్ర నీటిపారుదల రంగాన్ని కెసిఆర్‌పూర్తిగా నిర్వీర్యం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర సచివాలయంలో ఆదివారం ఉత్తమ్ కుమార్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. సాగు నీటి రంగానికి సంబంధించి మాజీ సిఎం కెసిఆర్ చెప్పినవన్నీ పచ్చి అబద్ధాలేనని ఉత్తమ్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రజల తలలను తాకట్టు పెట్టి లక్ష కోట్లు అప్పు చేసి కాళేశ్వరం నిర్మిస్తే వాళ్ల హయాంలోనే కూలిపోయిందన్నారు... కెసిఆర్ ప్రభుత్వం గత 10 ఏళ్లలో నీటిపారుదల శాఖ 1.81లక్షల కోట్లు ఖర్చు పెట్టి చేసినా ప్రయోజనం మాత్రం గుండు సున్నాయే అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి అక్రమాలు జరిగాయని కేంద్ర విజిలెన్స్, ఎన్‌డిఎస్‌ఎతో తరువాయి 2లో

## కృష్ణపై అన్యాయాన్ని ఎండగడతాం

### ఇవ్వాల్టి వరకు ఒక కథ... రేపటి నుంచి మరో కథ నేనే స్వయంగా రంగంలోకి దిగుతున్న



- పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతలపై గ్రామ గ్రామాన ఉద్యమిస్తాం
- జిల్లాల్లో బహిరంగసభ నిర్వహించి ప్రభుత్వాన్ని నిలదీస్తాం
- మాజీ సిఎం, బిఆర్‌ఎస్ అధినేత కెసిఆర్ ఉద్ఘాటన

ప్రజాపక్షం/హైదరాబాద్

కృష్ణానదీ జలాల విషయంలో తెలంగాణ రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయంపైన కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలను ఎండగడుతామని బిఆర్‌ఎస్ అధ్యక్షుడు కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు అన్నారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్ట్ విషయంలో జరుగుతున్న అన్యాయంపైన గ్రామ,గ్రామాన ఉద్యమిస్తామని, జిల్లాల్లో బహిరంగ సభలను నిర్వహించి ప్రభుత్వాన్ని ఎక్కడికక్కడ నిలదీస్తామని, ఇక తానే స్వయంగా రంగంలోకి దిగుతున్నానని వెల్లడించారు. 'ఇవాల్టి దాకా ఒక కథ.. రేపటి నుంచి వేరే కథ..ఇక తోలు తీస్తాం'' అని ఆయన హెచ్చరించారు. ఇదొక సర్వ భ్రష్ట ప్రభుత్వమని, రియల్ ఎస్టేట్ బ్రోకర్ దందా చేస్తోందని మండిపడ్డారు. పారిశ్రామిక సంస్థల నుంచి పెట్టుబడులు వస్తున్నాయనేది పెద్ద గ్యాస్ అని చెప్పారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తెలంగాణకు ఒక శనిగా మారిందన్నారు. కెసిఆర్ అధ్యక్షతన బిఆర్‌ఎస్ కార్యవర్గ, బిఆర్‌ఎస్‌ఎల్‌పి సంయుక్త సమావేశం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో నీటిపారుదల రంగం, కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరు, పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్ట్ తదితర అంశాలపై దిశానిర్దేశం చేశారు. అనంతరం తరువాయి 2లో

## ముఖాముఖికి రమ్మంటే ముఖం చాటేస్తున్నారు

కెసిఆర్ శాసనసభకు వస్తే కృష్ణా జలాలపై అన్ని విషయాలు చెబుతా : సిఎం రేవంత్‌రెడ్డి

04

## త్వరలో రాష్ట్రంలో సర్




- తెలంగాణ దేశమంతటికీ ఒక జాతీయ ప్రమాణంగా నిలుస్తుంది
- ఓటర్ జాబితా సవరణను అత్యంత జాగ్రత్తగా పకడ్బందీగా నిర్వహించాలి
- బిఎల్‌ఓలకు సిఇసి జ్ఞానేశ్‌కుమార్ సూచన

ప్రజాపక్షం/హైదరాబాద్

ఓటర్ల జాబితా రూపకల్పన, సవరణ ప్రక్రియలో తెలంగాణ రాష్ట్రం త్వరలోనే దేశమంతటికీ ఒక జాతీయ ప్రమాణంగా నిలుస్తుందని భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) జ్ఞానేశ్ కుమార్ అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో త్వరలోనే 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' (ఎస్ఐఆర్) ప్రక్రియను చేపడతామని వెల్లడించారు. హైదరాబాద్ రవీంద్ర భారతిలో ఆదివారం బూత్ లెవెల్ ఆఫీసర్లతో కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ప్రత్యేక సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో చేపట్టబోయే ఈ ఓటరు జాబితా ప్రక్షాళన ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే కాకుండా, జాబితాలోని తప్పులను తొలగించి, పారదర్శకమైన వ్యవస్థను నిర్మిస్తామన్నారు. ఎస్ఐఆర్ బిహార్‌లో విజయవంతంగా నిర్వహించిన 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' తరహాలోనే, తదుపరి ప్రక్రియను తెలంగాణలో చేపట్టబోతున్నట్లు తెలిపారు. ఈ ప్రక్రియను విజయవంతం చేసేందుకు అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

**తెలంగాణ రాష్ట్రం కెనడా దేశం కంటే పెద్దది..**

భౌగోళికంగా, జనాభా పరంగా తెలంగాణ రాష్ట్రం కెనడా దేశం కంటే పెద్దదని జ్ఞానేశ్ కుమార్ తెలిపారు. ఇక్కడ ఓటరు జాబితా సవరణను అత్యంత జాగ్రత్తగా, పకడ్బందీగా తరువాయి 2లో

## నక్సలిజం ముసుగులో గిరిజనుల హత్య

- అంతర్గత భద్రత ముసుగులో మారణహోమాన్ని సమర్థించుకుంటున్న కేంద్రం
- సంస్థాగత వేధింపులు తక్షణమే ఆపాలి
- కేంద్రం ఆదేశాలు పాటిస్తున్న ఎన్నికల సంఘం
- సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా



**పాట్నా:** నక్సలిజంపై పోరు నెపంతో గిరిజనులను చంపేస్తున్నారని సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా విమర్శించారు. యాంటీ నక్సల్ ఆపరేషన్ల పేరిట ఆదివాసీలపై హింసను పాలకులు సమర్థించుకుంటున్నారని దుయ్యబట్టారు. బూటకపు ఎన్‌కౌంటర్ల ద్వారా అమాయక గిరిజనులను హతమారుస్తున్నారని, అంతర్గత భద్రత ముసుగులో మారణహోమాన్ని సమర్థించుకుంటున్నారని వ్యాఖ్యానించారు. బిహార్ రాజధాని పట్నాలో రెండు రోజుల పాటు జరిగిన పార్టీ సమావేశాల్లో భాగంగా దేశ భద్రతా విధానాలతో పాటు ఎన్నికల కమిషన్ పనితీరును డి.రాజా విమర్శించారు. నక్సలిజం అంతమే లక్ష్యమని తరువాయి 2లో



## సామాజిక ఉద్యమకారుడు ఇన్నయ్య అరెస్టు

14 రోజుల రిమాండ్ విధించిన కోర్టు

ప్రజాపక్షం/జాఫర్‌గఢ్

సామాజిక ఉద్యమకారుడు గాదె ఇన్నయ్యను ఎన్ఐఎ (జాతీయ దర్యాప్తు సంస్థ) అధికారులు అరెస్టు చేశారు. అనంతరం నాంపల్లి ఎన్ఐఎ న్యాయస్థానంలో హాజరుపరిచారు. కోర్టు ఆయనకు 14 రోజుల రిమాండ్ విధించింది. జనగామ జిల్లాలోని జాఫర్‌గఢ్ మండల కేంద్రంలో ఆయన నిర్వహిస్తున్న అనాథాశ్రమానికి 4 వాహనాల్లో వచ్చిన ఎన్ఐఎ తరువాయి 12లో



## ఫోన్ ట్యాపింగ్ కేసులో ఛార్జిషీట్

- సజ్జనార్ ఆదేశం
- రాజకీయ నేతలు, అధికారులు ఎవరినీ వదలొద్దని సూచన

ప్రజాపక్షం/హైదరాబాద్

సిట్ అధికారులతో హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్ వేదికగా సిపి సజ్జనార్ సమావేశం అయ్యారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో పూర్తి ఛార్జిషీటుకు ఆయన ఆదేశించారు. ఫోన్ ట్యాపింగ్ కేసుతో సంబంధం తరువాయి 2లో

## 'మహాలక్ష్మి'తో లాభాల్లోకి ఆర్‌టిసి



- ప్రభుత్వ సహకారంతో పాటు స్వతహాగా ఆదాయ మార్గాలు అన్వేషించాలి
- అధికారులకు ఉప ఉఖ్యమంత్రి భట్టి విక్రమార్క దిశానిర్దేశం
- సంస్థ బలోపేతానికి కార్మికులను ఆదుకునేందుకు చర్య తీసుకుంటున్నామని వెల్లడి

ప్రజాపక్షం/హైదరాబాద్

మహాలక్ష్మి పథకంలో భాగంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఆర్‌టిసి బస్సుల్లో మహిళ ఉచిత ప్రయాణంతో నష్టాల్లో కూరుకుపోయిన ఆర్‌టిసి లాభాల బాట పట్టిందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో పాటుగా సంస్థ స్వతహాగా నూతనంగా ఆదాయా మార్గాలను అన్వేషించాలని ఉప ముఖ్యమంత్రి అధికారులకు దిశా నిర్దేశనం చేశారు. ఆదివారం ప్రజాభవన్ లో ఆర్‌టిసి, బిసి సంక్షేమ శాఖ అధికారులతో ఉప ముఖ్యమంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రితో పాటుగా మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ప్రత్యేక ముఖ్య కార్యదర్శి వికాస్ రాజ్, ఆర్‌టిసి ఎండి నాగిరెడ్డి, తరువాయి 2లో

## పెద్దాసుపత్రిలో దివ్యాంగ నకిలీ ధృవపత్రాలు

- ఒక్కోదానికి రూ. 40వేల నుంచి రూ. 50వేలు వసూళ్లు
- అంగవైకల్యం లేకున్నా 60 శాతం ధృవీకరణ పత్రం
- జిల్లా వ్యాప్తంగా వసూళ్ల దందా

ప్రజాపక్షం/ ఖమ్మం

దివ్యాంగులకు నెల నెల రూ. 4,000 పింఛన్ ఇస్తుండడంతో దళారుల చూపు ఆ వైపు మళ్లింది. 'మీకు దివ్యాంగులకు ఇచ్చే ధృవీకరణ పత్రం ఇస్తాం నెలకు నాలుగు వేలు పింఛన్ వస్తుంది. మీకు వైకల్యం ఉన్నా లేకున్నా మాకు డబ్బులు ఇస్తే చాలు' అంటూ ప్రచారం మొదలుపెట్టారు. ముందు వరుసలో రూ. 40వేల నుంచి రూ.50వేలు ముట్టజెప్పిన వారికి దివ్యాంగ ధృవీకరణ పత్రంతో పాటు పింఛన్ కూడా వస్తుండడంతో దళారుల పంట పండింది. పెద్ద సంఖ్యలో వైకల్యం లేనివారు దివ్యాంగ ధృవీకరణ కోసం దళారులకు నగదు ముట్టజెప్పారు. వీరిలో చాలా మందికి ధృవీకరణ పత్రాలు రావడంతో ఈ ముఠా కార్యకలాపాలు జిల్లా వ్యాప్తమయ్యాయి.



ఖమ్మం జిల్లాలోని నకిలీ ధృవపత్రాల జారీ ఖమ్మం పెద్దాసుపత్రి కేంద్రంగానే జరిగింది. గ్రామాల్లో ధృవపత్రాల కోసం డబ్బులు సేకరించడం, వైరాలోని ఒక ఫోటో స్టూడియోలో అంగ వైకల్యం కనపడే రీతిలో ఫోటోలు తీయించి దరఖాస్తు చేయించారు. అసలు వైకల్యం గల వారు సదరం కేంద్రాలకు వచ్చి ధృవీకరణ పత్రం కోసం రోజుల తరబడి తరువాయి 12లో

## రైల్వే టికెట్ ధరల పెంపు

- 26 నుంచి అమల్లోకి...
- నాన్‌ఎసిలో 500 కి.మీలకు రూ. 10 అదనపు వడ్డింపు
- రూ.600 కోట్ల మేర అదనపు ఆదాయం సమకూరుతుందని రైల్వే శాఖ అంచనా

**న్యూఢిల్లీ :** టికెట్ ధరలను భారతీయ రైల్వే శాఖ పెంచింది. కొత్త ధరలు డిసెంబర్ 26 నుంచి అమల్లోకి వస్తాయని పేర్కొంది. అయితే తాజాగా పెంపుతో రైల్వేశాఖకు రూ.600 కోట్ల మేర అదనపు ఆదాయం సమకూరుతుందని తరువాయి 2లో



# ప్రపంచం
WORLD NEWS

## అంధకారంలో శాన్‌ఫ్రాన్సిస్కో

**శాన్‌ఫ్రాన్సిస్కో:** శాన్ ఫ్రాన్సిస్కో అంధకారమైంది. 1,30,000 గృహాలు, వ్యాపారాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఈమేరకు పసిఫిక్ గ్యాస్ అండ్ ఎలక్ట్రిక్ కో తెలిపింది. రిచ్మండ్, ప్రెసిడియో పరిసరాలు, గోల్డెన్ గేట్ పార్క్ చుట్టూ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. బ్లాక్‌అవుట్ కారణాలపై అధికారులు స్పందించలేదు. యుటిలిటీ కంపెనీ కస్టమర్లలో మూడింట ఒక వంతు మంది విద్యుత్ అంతరాయంతో ఇబ్బంది పడ్డారు. రెస్టారెంట్లు, దుకాణాలను మూతబడ్డాయి. వీధులు చీకటయ్యాయి. ఈ పరిస్థితిపై శాన్‌ఫ్రాన్సిస్కో డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎమర్జెన్సీ మేనేజ్‌మెంట్ ఎక్స్ వేదికగా స్పందించింది. రవాణా అంతరాయాలు ఏర్పడ్డాయని, అనవసమైతేనే ప్రయాణాలు చేయాలని సూచించింది. విద్యుత్ లేక కొన్ని బస్సు, రైలు సేవలకు అంతరాయం కలిగినట్లు వెల్లడించింది.ఓ సబ్‌స్టేషన్‌లో అగ్నిప్రమాదం జరగడంతో కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఆగినట్లు వెల్లడించారు.



## దక్షిణాఫ్రికాలో కాల్పులు.. 9 మంది మృతి

**జొహన్నెస్‌బర్గ్ :** దక్షిణాఫ్రికాలో ఓ సాయుధుడు రెచ్చిపోయాడు. విచక్షణారహితంగా కాల్పులు జరిపాడు. ఈ ఘటనలో ముగ్గురు చిన్నారులు సహా తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 12 మంది గాయపడ్డారు. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉంది. రాజధాని జొహన్నెస్‌బర్గ్ శివార్లలోని బెకర్స్‌డాల్ టౌన్‌షిప్‌లో ఈ దారుణం ఆదివారం జరిగింది. కాల్పుల శబ్దాలకు ప్రజలు భయంతో పరుగులు తీశారు. ఈ దాడికి కారణం తెలియలేదని పోలీసులు తెలిపారు. దర్యాప్తు ప్రారంభించినట్లు వెల్లడించారు. ఆ ప్రాంతంలో భద్రతను కట్టుదిట్టం చేశారు. ఈనెల 6న ప్రిటోరియా సమీంలో కూడా కాల్పులు చోటు చేసుకొన్నాయి. మూడేళ్ల చిన్నారితో సహా అనేక మంది ప్రాణాలు కోల్పోయారు.

## హదీని బంగ్లాదేశ్ మరువదు : యూనస్

**ఢాకా :** బంగ్లాదేశ్ రగిలిపోతోంది. ఇంక్విలాబ్ మంచో నాయకుడు షరీఫ్ ఉస్మాన్ హదీ హత్య ఆ దేశంలో ఉద్రిక్తతలను మళ్లీ పెంచింది. ఇదే క్రమంలో భారత హై కమిషన్ వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. వీసా దరఖాస్తులను తాత్కాలికంగా నిలిపివేశారు. చిత్తాగాంగ్‌లోని అసిస్టెంట్ హై కమిషన్ ఆఫ్ ఇండియా వద్ద అల్లర్ల క్రమంలో ఈ మేరకు నిర్ణయించినట్లు అధికారులు తెలిపారు. హదీ అంత్యక్రియలకు వేలాది మంది హాజరయ్యారు. ఇందుకోసం భారీస్థాయిలో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆపద్ధర్మ ప్రభుత్వాధినేత యూనస్ కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల గుండెల్లో హదీ పదిలమన్నారు. ఆయన ఆదర్శాలను ముందుకు తీసుకెళతామని చెప్పారు.

**తుది వీడ్కోలు పలికేందుకు రాలేదు ...**

బంగ్లాదేశ్ ఉన్నంత వరకు ఇక్కడి ప్రజల గుండెల్లో మీరు (హదీ) ఉంటారు. మీ మాట నెరవేరుస్తామని హామీనిస్తున్నా. బంగ్లాదేశ్ ప్రజలు మీ ఆదర్శాలను కొనసాగిస్తారు' అని యూనస్ తెలిపారు. ప్రపంచం ఎదుట బంగ్లాదేశ్ తలవంచదని తేల్చిచెప్పారు. షేక్ హసీనా ప్రభుత్వం గతేడాది విద్యార్థుల ఆందోళనతో కుప్పకూలింది. ఈ



ఆందోళనల్లో హదీ కీలకపాత్ర పోషించాడు. అయితే ఈనెల ఆరంభంలో గుర్తు తెలియని వ్యక్తులు ఆయనపై దాడి చేశారు.

చికిత్స పొందుతూ హదీ మరణించారు. దీంతో ఆయన మద్దతుదారులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. ఇది ఉద్రిక్తతకు దారితీసింది. శనివారం కట్టుదిట్టమైన భద్రత నడుమ హదీ అంత్యక్రియలు జరిగాయి. కాగా, అల్లర్లలో భాగంగా ఓ ఇంటికి నిప్పు పెట్టగా ఏడేళ్ల చిన్నారి సజీవ దహనమైంది. అలాగే మూక హత్యకు గురైన హిందూ కుర్రాడి వ్యవహారంలో ఇప్పటివరకు 10 మంది అరెస్టయ్యారు. వీరిలో ఏడుగురిని రాపిడ్ యాక్షన్ బెటాలియన్ అదుపులోకి తీసుకోగా, మిగతా ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా యూనస్ ఒక ప్రకటన చేశారు. అనేక చోట్ల తనిఖీలు జరిపి 1946 మధ్య వయస్సు ఉన్న 10 మందిని అరెస్టు చేసినట్లు తెలిపారు.

## భూమిపైకి దూసుకొస్తున్న స్టార్‌లింక్ శాటిలైట్



**వాషింగ్టన్ :** ఎలాన్ మస్క్‌కు చెందిన స్టార్‌లింక్ ప్రాజెక్టులోని శాటిలైట్స్‌లో ఒకటి ఇటీవల అంతరిక్షం నుంచి అదుపుతప్పి భూమివైపు వస్తోంది. ఈ నెల 17న శాటిలైట్ 35956 భూమి నుంచి 418 కిలోమీటర్ల ఎత్తులో ఉంది. అది హఠాత్తుగా అక్కడి నుంచి కూలిపోవడం మొదలైంది. దానిపై నియంత్రణను స్పేస్‌ఎక్స్ కోల్పోయింది. ఆ తర్వాత ఆ సంస్థ దీనిపై వివరణ ఇచ్చింది. ''హఠాత్తుగా ఉపగ్రహంలో సాంకేతిక లోపం తలెత్తి ప్రొపెల్షన్ ట్యాంక్‌లో గ్యాస్ అత్యంత శక్తిమంతంగా బయటకు వెలువడింది. దీంతో ఒక్కసారిగా అది నాలుగు కిలోమీటర్ల కిందకు దూసుకొచ్చింది. ఆ తర్వాత కొన్ని భాగాలు విడిపోయి మెల్లగా కదలడం మొదలుపెట్టాయి. వారం రోజుల్లోగా భూవాతావరణంలోకి వచ్చి కూలిపోవచ్చు'' అని ఎక్స్‌లో పోస్టు చేసింది. శనివారం ఈ ఉపగ్రహ శకలాలు అమెరికాలోని అలాస్కా సమీపంలో గగనతలంలో ప్రయాణిస్తుండగా.. వెంటోర్‌టెక్ సంస్థకు చెందిన వరల్డ్‌వ్యూ3 అనే ఉపగ్రహం 241 కిలోమీటర్ల దూరం నుంచి హైరిజల్యూషన్ చిత్రాలను తీసింది. ఈ ఉపగ్రహం నుంచి అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి లేదా భూమికి ఎటువంటి ముప్పు లేదని స్పేస్‌ఎక్స్ చెబుతోంది. ప్రస్తుతం అది ఐఎస్‌ఎస్ కంటే కిందే ఉందని వెల్లడించింది. అది లోయర్ ఎర్త్ ఆర్బిట్‌లో ఉండటంతో... భూగురుత్వాకర్షణ శక్తి దానిని సులువుగా లాగేస్తుందని వెల్లడించింది. ఇవి వాతావరణ ఘర్షణతో కాలిపోయే అవకాశం ఉన్నట్లు తెలిసింది. ప్రస్తుతం స్టార్‌లింక్ ప్రాజెక్టు కింద 9,000 ఉపగ్రహాలను స్పేస్‌ఎక్స్ అంతరిక్షంలోకి పంపింది. దీంతో భూమిపై మారుమూల ప్రాంతాలకు ఇంటర్నెట్‌ను సరఫరా చేయగలుగుతోంది. అమెరికాలోని నాసా, యూఎస్ స్పేస్‌ఫోర్స్‌తో సమన్వయం చేసుకొంటూ పనిచేస్తోంది.

# 16 ఎప్‌స్టీన్ ఫైళ్లు మాయం!

**న్యూయార్క్:** రాజకీయ నాయకులు సహా అనేక మంది ప్రముఖుల గుట్టు బయట పెట్టిన ఎప్‌స్టీన్ ఫైళ్లు అమెరికాను కుదిపివేస్తున్నాయి. వీటిని న్యాయ శాఖ ఇటీవల విడుదల చేసింది. అయితే 16 ఫైళ్లు గుట్టుచప్పుడు కాకుండా మాయమైనట్లు తెలుస్తోంది. ఇదే అంశమై డెమొక్రాట్లు ఆరోపణలు చేశారు. మాయమైన ఫైళ్లలో అధ్యక్షుడు ట్రంప్ ఫోటోలు ఉన్నట్లు పేర్కొన్నారు. ఓ అమ్మాయితో ట్రంప్ ఉన్న ఆ ఫోటోకు సంబంధించిన 468 అనే నంబరుగల ఫైలు అదృశ్యమైనట్లు తెలిపారు. ఇలా 16 ఫైళ్లు న్యాయశాఖ వెబ్ పేజీ నుంచి ఎటువంటి వివరణ లేకుండా కనుమరుగయ్యాయని హౌస్ ఓవర్‌సైట్ కమిటీలోని డెమొక్రాట్లు ఎక్స్‌లో పేర్కొన్నారు. 'ఎప్‌స్టీన్ ఫైళ్లలో డొనాల్డ్ ట్రంప్ ఫోటో ఉన్న 468 నంబరు ఫైలు న్యాయశాఖ విడుదల చేసిన తాజా ఫైళ్లలో లేదు. దీనిని ఉద్దేశపూర్వకంగా తొలగించారు' అని డెమొక్రాట్లు ఆరోపించారు. ఇదే అంశమై అటార్నీ జనరల్‌ను ఓవర్‌సైట్ కమిటీ ప్రశ్నించింది. (అటార్నీ జనరల్ పామ్ బాండి) ఇది నిజమేనా? ఇంకా ఏయే విషయాలు దాచిపెట్టారు? అమెరికా ప్రజలకు, మాకు పారదర్శకత అవసరం'అని పేర్కొంది. న్యాయశాఖ తాజా ఫైళ్లలో ఫోటోలు, మెయిల్స్, ఆడియో రికార్డింగ్‌లు, అనేక సంవత్సరాల పరిశీలనలో సేకరించిన దర్యాప్తు సామగ్రి ఉన్నాయి. ఆన్‌లైన్‌లో పెట్టిన 24 గంటల్లోనే 16 ఫైళ్లు మాయమయ్యాయి. ఇందులో ట్రంప్, ఆయన భార్య మెలానియా, ఎప్‌స్టీన్, అతడి సన్నిహితులు గిస్లైన్ మాక్స్‌వెల్‌తో దిగిన ఫోటో ఉంది. అలాగే, మాజీ అధ్యక్షుడు బిల్ క్లింటన్, వాణిజ్య శాఖ మాజీ మంత్రి ల్యారీ సమ్మర్స్, ఆరోగ్య మంత్రి రాబర్ట్ ఎఫ్ కెన్నడీ జూనియర్, అమెరికాలో బ్రిటన్ మాజీ రాయబారి పీటర్ మాండెల్సన్, ఇజ్రాయిల్ మాజీ ప్రధాని ఎహుద్ బరార్, న్యూ మెక్సికో గవర్నర్ బిల్ రిచర్డ్‌సన్, అమెరికా సెనేట్ నేత జార్జ్ మిచెల్, కుబేరులు ఎలాన్ మస్క్, బిల్ గేట్స్, రైడ్ హాఫ్‌మన్, పీటర్ థెయిల్ తదితరులున్నారు.

## లాభాల్లోకి ఆర్‌టిసి
**(మొదటి పేజీ తరువాయి)**

ఇతర జాయింట్ ట్రాన్స్ పోర్ట్ అధికారులు, ఎంజెపి కార్యదర్శి సైదులు, బీసీ సంక్షేమ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఆర్‌టిసి బలోపేతం చేసేందుకు, కార్మికులను ఆదుకునేందుకు ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటినుంచికీలకమైన చర్యలను తీసుకుంటోందని అన్నారు. ముఖ్యంగా ఆడబిడ్డలకు బస్సులోఉచితంగా ప్రయాణించేందుకు తీసుకువచ్చిన మహాలక్ష్మి పథకం వల్ల ఆర్‌టిసి లాభాల్లోకి వచ్చిందని అన్నారు. అంతేగాక మహిళా సంఘాల నుంచి రుణాలు తీసుకోవడంతో పాటుగా, ప్రభుత్వం అందించిన సహకారంతో సంస్థకు కొత్త బస్సులు అందుబాటులోకి వచ్చాయని చెప్పారు. అంతేకాక బస్ డిపోల ఏర్పాటు, బస్ స్టేషన్‌ల అభివృద్ధికి ప్రజాప్రభుత్వం సహకారం అందిస్తోందని ఉప ముఖ్యమంత్రి చెప్పారు. ఆర్‌టిసిలో మహాలక్ష్మి పథకం కింద ఇప్పటి వరకు రూ.255 కోట్ల ఉచిత ప్రయాణాలు జరగాయని, ఈ పథకం వల్ల మహిళా సాధికారత దిశగా అడుగులు పడుతున్నట్లు ఆయన తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఆర్‌టిసి పిఎఫ్ బకాయిలు రూ. 1400 కోట్లు ఉండగా.. ప్రజాప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లలో రూ.660 కోట్లకు తగ్గించినట్లు ఆయన చెప్పారు. అలాగే సిసిఎస్ బకాయిలు గతంలో రూ.600 కోట్లు ఉండగా ప్రజాప్రభుత్వం వచ్చాక.. రూ.373 కోట్లకు తగ్గించినట్లు తెలిపారు. ఆర్‌టిసిలో మహాలక్ష్మి పథకం కింద ఉచిత బస్సు ప్రయాణం కోసం సెంట్రల్ ఫర్ గుడ్ గవర్నెస్ తో ఒప్పందం చేసుకొని ప్రత్యేక కార్డులు పంపిణీ చేయాలని అధికారులను బట్టి విక్రమార్క ఆదేశించారు.

ఈ కార్డులు తెలంగాణలోని ప్రతి మహిళకు చేరాలని అధికారులకు ఆయన సూచించారు.ఆర్‌టిసిలో పిఎం ఈ డ్రైవ్ కింద హైదరాబాద్ లో 2800 ఎలక్ట్రిక్ బస్సులు వస్తున్నాయని వీటికి చార్జింగ్ స్టేషన్లు మౌలిక సదుపాయాలు కల్పించాలని తెలిపారు. పిఎం ఈ డ్రైవ్ కింద నిజామాబాద్ వరంగల్ పట్టణాలకు 100 ఎలక్ట్రిక్ బస్సులు రానున్నాయని పేర్కొన్నారు.

**పాఠశాల ప్రారంభం రోజే విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫామ్స్ :**

ప్రతి సంవత్సరం పాఠశాలల ప్రారంభం రోజే విద్యార్థులకు యూనిఫామ్స్, బుక్స్, షూస్ పంపిణీ చేయాలని అందుకు సంబధించిన నిధులు విషయంలో ఇబ్బందులు లేకుండా చూడాలని ఫైనాన్స్ సెక్రటరీ సందీప్ సుల్తానియా ను డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క ఆదేశించారు. అదే విధంగా ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సంక్షేమ హాస్టళ్లలోని నిరుపేద విద్యార్థులకు కాస్మోటిక్, మెస్ ఛార్జీలను 200 శాతం పెంచామని చెప్పారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి కాస్మోటిక్, మెస్ చార్జీల బిల్లులను చెల్లిస్తున్నట్లు స్పష్టం చేశారు.

**అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ పోస్టుల భర్తీకి అనుమతులు ఇవ్వండి : మంత్రి పొన్నం ప్రభాకర్**

అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ పోస్టుల భర్తీకి ఆర్థిక శాఖ నుంచి అనుమతి ఇవ్వాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను రవాణామంత్రి పొన్నం ప్రభాకర్ ఈ కోరారు. అదేవిధంగా మార్చ్ 2026 వరకు 3233 కండక్టర్ పోస్టులు అవసరం కాగా తాత్కాలికంగా నియామకాలు జరపడంతో పాటు 50 శాతం రెగ్యులర్ నియామకాలకు అనుమతి ఇవ్వాలని కోరారు. వాటితో పాటు చీఫ్ అకౌంట్ ఆఫీసర్ పోస్టులకు అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.. అంతేకాక డ్రైవింగ్ లైసెన్స్ ల జారీలో ఉన్న ఇబ్బందులు తేలెత్తకుండా యూజర్ ఛార్జీలకు అనుమతి ఇవ్వాలన్నారు. రవాణా శాఖ లో ఎన్‌ఫోర్స్‌మెంట్ పెంచడానికి కొత్త వాహనాలకు అనుమతి ఇవ్వాలని ,టాక్స్ కలెక్షన్ కోసం ట్యాబ్ లు మంజూరు చేయాలని కోరారు.

## గిరిజనుల హత్య
**(మొదటి పేజీ తరువాయి)**

చెప్పుకుంటూ గిరిజనులపై దురాగతాలను సర్కారు సాగిస్తోందన్నారు. సంస్థాగత వేధింపులు తక్షణమే ఆపాలని డిమాండ్ చేశారు. అధికారంలో ఉన్న వారి చెప్పుచేతుల్లోకి ఎన్నికల సంఘం వెళ్లిందని దుయ్యబట్టారు. 12 రాష్ట్రాల్లో ఎస్‌ఐఆర్‌ను నిర్వహించినప్పుడు... అసోంలో ఎందుకు చేపట్టలేదని డి.రాజా ప్రశ్నించారు. రాజకీయ ప్రయోజనాల కోసం ఎంపిక చేసిన ప్రాంతాల్లో ఎస్‌ఐఆర్ జరుగుతోందని వ్యాఖ్యానించారు. కేంద్రప్రభుత్వ ఆదేశాల మేరకు ఎన్నికల సంఘం నడుచుకుంటోందని, అధికారంలో ఉన్న వారు ఆడించినట్లు ఆడే కీలుబొమ్మగా రాజ్యాంగబద్ధ వ్యవస్థ మారిందని అన్నారు. ప్రజా వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలతో రాజకీయ లబ్ధికే అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ, రైతులు, కార్మికుల ప్రయోజనాలను పణంగా పెట్టేస్తున్న ప్రభుత్వాలను గద్దె దించాలని రాజా పిలుపునిచ్చారు. సిపిఐ కార్యదర్శులు గిరీశ్ చంద్ర శర్మ, రామకృష్ణ పాండా, అనీరాజా కూడా ప్రసంగించారు. ఈనెల 26న బీహార్‌లో సీపీఐ శతాబ్ది వేడుక ఘనంగా నిర్వహించబోతున్నట్లు ప్రకటించారు.

ఈ సమావేశంలో భాగంగా 11 మందితో నూతన రాష్ట్ర కార్యదర్శివర్గం, 31 మందితో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. బీహార్‌లో పార్టీని మరింతగా బలోపేతం చేసుకోవడమే కాకుండా, క్షేత్రస్థాయి నుంచి రాజకీయ పోరాటాలను తీవ్రతరం చేసేందుకు పునర్వ్యవస్థీకరణ అవసరమని సీపీఐ నాయకులు వెల్లడించారు.

## ధరల పెంపు
**(మొదటి పేజీ తరువాయి)**

రైల్వే శాఖ అంచనా వేస్తోంది. అయితే పెరిగిన ఖర్చులకు అనుగుణంగా, ఎక్కువ మంది ప్రయాణికులకు రైల్వే సేవలను చేరువ చేయాలనే ఉద్దేశంతో ఈ చర్యలు తీసుకున్నట్లు వెల్లడించింది. రైల్వే శాఖ చేసిన కొత్త మార్పులు ప్రకారం... ఆర్డినరీ క్లాస్‌లో 215 కి.మీ. కంటే తక్కువ దూరం ప్రయాణాలకు ఛార్జీలను పెంచలేదు. అలాగే లోకల్, స్వల్ప దూర ప్రయాణాల టికెట్ ధరల్లో కూడా ఎలాంటి మార్పు లేదు. జనరల్ క్లాస్‌లో 215 కి.మీల కంటే ఎక్కువ దూరం ప్రయాణిస్తే ప్రతి కిలోమీటరకు 1 పైసా అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. అదే మెయిల్/ఎ క్స్‌ప్రెస్ లోని నాన్ ఎసి, ఎసి క్లాస్‌లో ప్రయాణిస్తే 2 పైసలు చొప్పున ఛార్జీలు పెంచింది. ఇక నాన్ ఎసి క్లాస్‌లో 500 కి.మీల ప్రయాణించేవారు, ప్రస్తుతం ఉన్న ఛార్జీలకు అదనంగా మరో రూ.10 చెల్లించాల్సి ఉంటుంది. అయితే, మధ్యతరగతి కుటుంబాలపై భారం పడకుండా ఉండేందుకు సబ్‌అర్బన్ ట్రైన్ టికెట్ల ధరలను పెంచడం లేదని రైల్వే ప్రకటించింది. ఫలితంగా హైదరాబాద్, కోల్‌కతా, ముంబయి, ఢిల్లీలోని లోకల్ ట్రైన్స్‌లో ప్రయణించే వారిపై ఈసారి భారం పడలేదు. గత దశాబ్ద కాలంలో రైల్వే నెట్‌వర్క్, కార్యకలాపాలు గణనీయంగా విస్తరించాయని రైల్వే శాఖ అధికారి తెలిపారు. అలాగే సిబ్బందిని కూడా పెంచినట్లు తెలిపారు. '2024–2025 మొత్తం కార్యకలాపాల వ్యయం రూ.2,63,000 కోట్లకు పెరిగింది. ఇందులో మానవ వనరుల కోసం రూ.1,15,000 కోట్లు ఖర్చులు అయ్యింది. మరో రూ.60వేలు కోట్లు పెన్షన్ కింది ఖర్చు అయ్యింది. ఈ క్రమంలో ఏటా పెరుగుతున్న ఖర్చులను తట్టుకునే విధంగా కార్గో, ప్యాసింజర్ టికెట్ ధరలపై దృష్టిసారించింది' అని చెప్పారు.

**ఏడాదిలో రెండోసారి :** ఈ ఏడాదిలో రైల్వే శాఖ టికెట్ ధరలను పెంచడం ఇది రెండోసారి. జులైలో మెయిల్/ఎక్స్‌ప్రెస్ రైళ్లల్లోని నాన్‌ఎసి టికెట్ ధరలను కిలోమీటరుకు 1 పైసా, ఎసి క్లాస్ టికెట్ ధరలను కిలోమీటరుకు 2 పైసలు పెంచింది. అంతకుముందు, 2020 జనవరి 1న ట్రైన్ టికెట్ ధరలను రైల్వే శాఖ సవరించింది. నాన్ ఎసి మెయిల్/ఎక్స్‌ప్రెస్ ట్రైన్ టికెట్ ధర కిలోమీటర్‌కు 1 పైసా, ఎసి తరగతి టికెట్ ధర కిలోమీటరుకు 2 పైసలు చొప్పున పెంచింది. సబర్బన్ టికెట్ ధరలు, 500 కిలోమీటర్ల వరకు సెకండ్ క్లాస్ ప్రయాణానికి ఎలాంటి మార్పుల చేయలేదు. 500 కిలోమీటర్లు దాటితే కిలోమీటరుకు ఒక పైసా చొప్పున పెంచింది. ఇక అంతకు ముందు 2020 జనవరి 1న టికెట్ ధరలను రైల్వే శాఖ సవరించింది.

## రాష్ట్రపతి జై (మొదటి పేజీ తరువాయి)

నేషనల్ రూరల్ ఎంప్లాయిమెంట్ గ్యారంటీ చట్టం (ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ) స్థానంలో దీనిని తీసుకొచ్చారు. ఇటీవల జరిగిన శీతాకాల సమావేశాల్లో విపక్షాల నిరసనల మధ్యే ఈ బిల్లు ఉభయసభల ఆమోదం పొందింది. తగినంత సమయం ఇవ్వకుండా హడావుడిగా బిల్లులకు ఆమోదం తెలపడం అప్రజాస్వామికమంటూ విపక్షాలు ఉభయసభల్లోనూ నిరసన తెలిపాయి. రెండు దశాబ్దాలుగా అమల్లో ఉన్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజినరేగా) చట్టాన్ని రద్దుచేయడం సరికాదంటూ ఆందోళన చేపట్టాయి. లోక్‌సభలో స్పీకర్ స్థానం వద్దకు వెళ్లి బిల్లు ప్రతులను చించి విసిరేశాయి. రూ.1011 లక్షల కోట్లను కేవలం కూలీలకిచ్చే వేతనాలపై ఖర్చుపెట్టడం కాకుండా శాశ్వత ఆస్తుల్ని సమకూర్చాలనే ఉద్దేశంతో, ఎంతో లోతుగా చర్చించాకే బిల్లు తయారుచేశామని కేంద్ర మంత్రి చౌహాన్ పేర్కొన్నారు.

## రాష్ట్రంలో సర్ (మొదటి పేజీ తరువాయి)

నిర్వహించాలని బిఎల్‌ఓలకు సూచించారు. దేశంలో ఎన్నికల నిర్వహణ కోసం 1.80 కోట్ల మంది సిబ్బంది పనిచేస్తున్నారని, ఇది ప్రపంచంలోనే అతి పెద్ద ఎన్నికల యంత్రాంగమని చెప్పారు. బీహార్‌లో ఎన్నికలను 7 దేశాల నుంచి వచ్చిన 20 మంది ప్రతినిధులు పరిశీలించారని, ఎస్‌ఐఆర్ విజయవంతంగా పూర్తి చేసిన తర్వాత 7.5 కోట్ల ఓటర్లతో జాబితా విడుదల చేశామన్నారు. ఈ ప్రక్రియపై ఒక్క ఫిర్యాదు కూడా రాలేదన్నారు. ఎన్నికల అనంతరం రికౌంటింగ్ విషయంలో కూడా సున్నా ఫిర్యాదులే వచ్చాయని తెలిపారు. దానికి కారణం బిఎల్‌ఓల సమర్థ పనితీరేనని ప్రశంసించారు. ప్రజాస్వామ్యంలో రాజ్యాంగానికి అతిపెద్ద సైనికులు బూత్ లెవల్ ఆఫీసర్లేనని అన్నారు. తెలంగాణలో సగటున ప్రతి బిఎల్‌ఓ పరిధిలోకి 930 మంది ఓటర్లు వస్తారని, వారి వివరాలను క్షేత్రస్థాయిలో నిశితంగా పరిశీలించాలన్నారు. ప్రస్తుతం దేశంలోని 12 రాష్ట్రాల్లో ఎస్‌ఐఆర్ ప్రక్రియ కొనసాగుతోందని, మిగిలిన రాష్ట్రాల్లోనూ దశలవారీగా దీనిని పూర్తి చేస్తామన్నారు. భారత ఎన్నికల సంఘం (ఈసిఐ) నేడు ప్రపంచానికే మార్గనిర్దేశం చేసే స్థాయికి చేరుకుందని ప్రకటించారు. 'ఇంటర్నేషనల్ ఐడియా' అనే అంతర్జాతీయ సంస్థకు ఏడాది పాటు భారత సిఈసి నాయకత్వం వహించనున్నట్లు తెలిపారు.

**పట్టణ ఓటర్ల నిరాసక్తతపై ఆందోళన..** ఓటింగ్ శాతంపై జరిగిన చర్చలో జ్ఞానేశ్ కుమార్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పట్టణ ప్రాంతాల్లో పోలింగ్ శాతం తక్కువగా ఉండటానికి ఓటర్ల నిరాసక్తతే ప్రధాన కారణమన్నారు. మరోవైపు, గ్రామీణ ప్రాంత ఓటర్లు ఎంతో ఉత్సాహంగా క్యూలలో నిలబడి ఓటు వేస్తూ దేశానికి దిశానిర్దేశం చేస్తున్నారని ప్రశంసించారు. దేశ చట్టాలకు లోబడే ఎన్నికలు జరుగుతాయని, ప్రతి ఒక్కరూ ఈ చట్టాలను గౌరవించాల్సిందేనని స్పష్టం చేశారు.

**అంతర్జాతీయ స్థాయిలో భారత్ గుర్తింపు..** ప్రపంచ దేశాలన్ని భారత ఎన్నికల ప్రక్రియను ఎంతో ఆసక్తిగా గమనిస్తున్నాయనిజ్ఞానేశ్ కుమార్ తెలిపారు. 1995లో సభ్యదేశంగా చేరిన 'ఇంటర్నేషనల్ ఐడియా' సంస్థకు దాదాపు మూడు దశాబ్దాల తర్వాత భారత్‌కు ఛైర్మన్‌షిప్ లభించిందని వెల్లడించారు. ఇది భారత ఎన్నికల సంఘం విశ్వసనీయతకు, వినూత్న పనితీరుకు నిదర్శనమని గర్వంగా ప్రకటించారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 28 రాష్ట్రాలు, 8 కేంద్ర పాలిత ప్రాంతాల్లో కలిపి 90 కోట్లకు పైగా ఓటర్లు ఉన్నారని ఆయన గణాంకాలను వివరించారు. తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి, అదనపు సిఈఓ వాసం వెంకటేశ్వర రెడ్డి, జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి పాల్గొన్నారు.

## ఛార్జిషీట్ (మొదటి పేజీ తరువాయి)

ఉన్న అందరినీ విచారించాలని చెప్పారు. రాజకీయ నేతలు, అధికారులు ఎవరినీ వదలొద్దని అన్నారు. మరోవైపు ఇప్పటికే ఈ కేసులో తాజాగా ఏర్పాటైన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) దూకుడు పెంచింది. ప్రస్తుతం ప్రధాన నిందితుడు ప్రభాకర్‌రావును ప్రశ్నిస్తోంది. ఫోన్ ట్యాపింగ్ ఆపరేషన్ వెనుక అసలు కుట్ర సూత్రధారి ఎవరు? ప్రభాకర్రావుకు ఎవరి నుంచి ఆదేశాలు వచ్చాయి? అనే కోణంలో సిట్ లోతుగా విచారణ చేస్తోంది. ఇదిలా ఉంటే.. ప్రభాకర్రావును సిపి సజ్జనార్ స్వయంగా విచారించడానికి సిద్ధమయ్యారు. సోమవారం ఆయన సిట్ కార్యాలయానికి వెళ్లి విచారించనున్నట్లు సమాచారం. ఈ కేసులో ఇప్పటివరకు నిందితులను ఎసిపి, డిసిపి, జాయింట్ సిపి స్థాయి అధికారులు మాత్రమే విచారించారు. కమిషనర్ స్థాయిలో స్వయంగా నిందితుడిని విచారించటం ఇదే తొలిసారి కానుంది.

## ఎండగడతాం
**(మొదటి పేజీ తరువాయి)**




మీడియా సమావేశంలో కెసిఆర్ మాట్లాడుతూ పాలమూరు వెనుకబాటుకు 'సమైక్య' పాలకులే కారణమని ఆరోపించారు. పాలమూరు ప్రజలు వలసలకు వెళ్లారని, ఈ జిల్లాలను ఎవ్వరూ పట్టించుకోలేదని, ఎండాకాలంలో కమ్యూనిస్టు పార్టీలే గంజి కేంద్రాలను ఏర్పాటు చేశాయని కెసిఆర్ గుర్తు చేశారు. రంగారెడ్డి, మహబూబ్‌నగర్ కృష్ణా బేసినేనని, నల్లగొండ జిల్లాలో కూడా ప్రతీ వర్షం చుక్క కృష్ణాబేసిన్‌కే పోతుందని, ఈ మూడు జిల్లాలు కూడా వంద శాతం కృష్ణాబేసిన్‌లోనే ఉన్నాయని వివరించారు. పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి 170 టిఎంసిలు తీసుకోవాలన్నదే గత బిఆర్‌ఎస్ ప్రభుత్వ లక్ష్యంగా పెట్టుకున్నదన్నారు. రాజకీయాల్లో గెలుపులు, ఓటములు సహజమని, ఎవరు అధికారంలోనికి వచ్చినా ఒక ప్రాజెక్ట్ అంటే రాష్ట్ర ప్రయోజనం కదా..?అని అన్నారు. తమ ప్రభుత్వం పోయిన తర్వాత పాలమూరు ఎత్తిపోతల పథకంలో కనీసం ఒక తట్టెడు మట్టి కూడా తీయలేదని, దీనికి ఎందుకు వదలిపెట్టారో తెలియదన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రతి దానిని కేంద్ర ప్రభుత్వం వ్యతిరేకిస్తోందని, ఎన్‌డిఎలో చేరిన . చంద్రబాబు మాటలు పట్టుకుని ప్రతీ దానిని అడ్డంగా వ్యతిరేకిస్తోందని విమర్శించారు.

**డిపిఆర్ వెనక్కి పంపిస్తే భూమి ఆకాశం ఒక్కటే చేయాలె కదా..?**

తమ అధికారాన్ని నిలబెట్టుకునేందుకు ఎంపిల అవసరాన్ని దృష్టిలో పెట్టుకుని బిజెపి ఎంతకైనా దిగజారిందని, అందుకే చంద్రబాబు మాటలు విని కేంద్ర ప్రభుత్వం పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల డిపిఆర్‌ను వెనక్కి పంపించిందని కెసిఆర్ ఆరోపించారు. డిపిఆర్ వాపస్ వస్తే రాష్ట్రప్రభుత్వం భూమి, ఆకాశాన్ని ఒకటి చేయాలని, ఎంత లొల్లి చేయాల్సిందని, అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకపోవాలి కదా? అని అన్నారు. ఎస్‌ఆర్‌సి చట్టం ప్రకారం నీటి కేటాయింపులు ఉంటాయని, ఈ చట్టాన్ని కేంద్రం బుల్‌డోజ్ చేసిందన్నారు . మరో వైపు రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి 45 టిఎంసిలు చాలని కేంద్రానికి లేఖ రాయడం రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టడమేనని అన్నారు.

50 ఏళ్లు పరిపాలించిన కాంగ్రెస్, 20 ఏళ్లు పాలించిన టిడిపి ప్రభుత్వాలు పాలమూరు జిల్లాకు తీరని ద్రోహం చేశాయన్నారు. హైదరాబాద్ జంటనగరాల్లో పట్టపగలే హత్యలు జరుగుతున్నా అడిగే దిక్కు లేదని, ఎన్‌సిఆర్‌బి నివేదిక ప్రకారమే తెలంగాణలో 20 శాతం క్రైమ్ రేట్ పెరిగిందన్నారు.

**నీతొక్కల సిటీ ఎవరికి కావాలె?**

ఫ్యూచర్ సిటీ, తొక్కలో సిటీ ఎవరికి కావాలని, 'హైదరాబాద్‌ను నువ్వేమైనా' పెంచావా అని కెసిఆర్ సిఎం రేవంత్ రెడ్డిని ఉద్దేశించి ప్రశ్నించారు. హైదరాబాద్‌కు 400 ఏండ్ల చరిత్ర ఉన్నదని, ఇలా అన్ని రాష్ట్రాలకు పెద్ద సిటీలు తయారుకాబోవన్నారు. హైదరాబాద్ మహానగరాన్ని దృష్టిలో పెట్టుకుని తాము ఫార్మా సిటీని తీసుకొచ్చామని, రాష్ట్ర ప్రభుత్వం ఫ్యూచర్ సిటీ.. తొక్కలో సిటీ అంటూ దిక్కుమాలిన పాలసీలు తీసుకొస్తూ రియల్ ఎస్టేట్ బ్రోకర్ దందా చేస్తున్నదని ఆరోపించారు. ప్రభుత్వ చర్యలతో కాంగ్రెస్ ప్రభుత్వ పట్ల ప్రజల్లో నమ్మకం కోల్పోయిందన్నారు. ఫార్మా సిటీ నిర్మాణానికి 14 వేల ఎకరాలను సమీకరిస్తే, దీనికి ఎన్విరాన్‌మెంట్ క్లియరెన్స్ కూడా వచ్చిందని వివరించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఈ భూములను అమ్ముకోవాలని చూస్తోందన్నారు.

**ప్రజలు టెమ్ట్ అయి ఓట్లు వేశారు...**

ప్రజలకు ఇచ్చిన హామీలపైన ప్రభుత్వం ప్రజలకు'శఠగోపం' పెట్టిందని కెసిఆర్ ఎద్దేవా చేశారు. బిఆర్‌ఎస్‌కు ఓటు వేయాల్సిన ప్రజలు కాంగ్రెస్ మాటలు విని టెమ్ట్ అయి ఓట్లు వే శారని, ఇప్పుడు ఆ ప్రజలే తలలు పట్టుకుంటున్నారని అన్నారు. అభివృద్ధిని వదిలేసి పాలకులు కేవలం వసూళ్లు, కమిషన్ల పైనే దృష్టి పెట్టారని కెసిఆర్ ఆరోపించారు.

## ఉద్యమాలు కాదు
**(మొదటి పేజీ తరువాయి)**

పాటు న్యాయ విచారణ కమిషన్ స్వయంగా స్పష్టం చేసిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గుర్తు చేశారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు రూ.27 వేల కోట్లు ఖర్చు పెట్టామని చెబుతున్న కెసిఆర్ ఒక ఎకరం ఆయకట్టు ఇచ్చారా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం ఇచ్చిన జిఓ ప్రకారమే 45 టిఎంసిలు, కృష్ణా జలాలు, మరో 45 టిఎంసిలు గోదావరి నీటిని కేటాయించేలా నీటి పారుదల శాఖ మంత్రిగా తను స్వయంగా కేంద్రానికి లేఖ రాశానని ఉత్తమ్ కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. కృష్ణా, గోదావరి జలాల వాటాలో ఒక నీటి బొట్టును కూడ తమ ప్రభుత్వ వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. ఇందుకు అనుగుణంగా ఇప్పటికే ట్రిబునల్‌లో తమ వాదనలను స్పష్టం వినిపిస్తున్నామని చెప్పారు. అదే కెసిఆర్ ముఖ్యమంత్రి హోదాలో గత 10 ఏళ్ల కాలంలో కృష్ణా జలాలకు సంబంధించి 298 టిఎంసిలు సరిపోతాయని కృష్ణా రివర్ బోర్డు ముందు ఒప్పుకున్నారా లేదా చెప్పాలన్నారు. పాలమూరు ప్రాజెక్టు డిపిఆర్‌ను కేంద్రం తిరిగి పంపించినపుడు ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రి ఎవరూ.. నీటిపారుదల శాఖ మంత్రి ఎవరూ ఉన్నారని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ప్రశ్నించారు.. కేంద్ర నిధులతో నిర్మిస్తున్న దేవాదుల ప్రాజెక్టును 10 ఏళ్లు అధికారంలో ఉన్న కెసిఆర్ చేయలేదని ప్రశ్నించారు.

**తెలంగాణ ఏర్పడిన 10 కాలంలో ఎపికి 1442 టిఎంసిలను నీటి తరలింపు :**

ఎపి ముఖ్యమంత్రిగా ఉన్న జగన్‌మోహన్ రెడ్డి హాయంలో రాయలసీమ ప్రాజెక్టు పేరుతో పొతిరెడ్డి పాడు నుంచి రోజు 3 టిఎంసిల నీటిని తరలించుకు పోతే కాంగ్రెస్ అధికారం చేపట్టిన తర్వాత దానిని అడ్డుకున్నామన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో శ్రీశైలం బ్యాక్ వాటర్ నుంచి 722 టిఎంసిల నీటిని రలించుపోగా, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గత 10 ఏళ్లలో ఎపి ఏకంగా 1442 టిఎంసిలు నీటిని తరలించుకుని పోయిందని ఇది ఎవరి అసమర్థతో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కెసిఆర్‌కు ఉన్నంత తెలివి తేటలు తమకు లేకపోవచ్చు గాని తెలంగాణను సస్యసమలం చేసేందుకు చిత్తశుద్ధితో కట్టుబడి ఉన్నామని ఉత్తమ్‌కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

**పాలమూరు ప్రజలు ఇప్పుడు గుర్తుకు వచ్చారా ?**

మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్‌కు పాలమూరు, రంగారెడ్డి ప్రజలు ఇప్పుడు గుర్తుకు వచ్చినట్లు ఉన్నారని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఎద్దేవా చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రూ.38 కోట్ల అంచనా వ్యయం ప్రాణహిత చెవెళ్ల ప్రాజెక్టు చేపట్టి రూ.10 వేల కోట్లును సైతం ఖర్చు చేసిందని మరీ అధికారం చేపట్టిన తర్వాత కెసిఆర్ ఈ ప్రాజెక్టును ఎందుకు నిర్మించలేదని ప్రశ్నించారు. ఈ ప్రాజెక్టును పూర్తి చేసి ఉంటే నిర్దేశించిన ఆయకట్టుకు నీరు అందడమే కాకుండా రాష్ట్రంలోని పెండింగ్ ప్రాజెక్టులన్ని దాదాపుగా పూర్తి అయ్యేవని చెప్పారు..

**ఉమ్మడి మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాలకు కెసిఆర్ దగా :**

కెసిఆర్ చేసిన దగా మోసం కారణంగా ఉమ్మడి మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాలకు మాజీ సిఎం దగా చేశారని మంత్రి ఉత్తమ కుమార్ రెడ్డి అన్నారు. కాళేశ్వర ప్రాజెక్టు స్థానంలో ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును పూర్తి చేసి ఉంటే మిగిలిన డబ్బులతో ఉమ్మడి నల్లగొండ మహబూబ్ నగర్ జిల్లాలోని ప్రాజెక్టులన్ని పూరై 18 లక్షల ఆయకట్టు నీరు అందేదన్నారు. ఈ జిల్లాల ప్రజలను ఇంత మోసం చేసిన కెసిఆర్ ఇప్పుడు ఉద్యమాలు చేపడుతామనిప్రకటించడంవిడ్డూరంగా ఉందని పేర్కొన్నా. గత ప్రభుత్వ చేసిన అప్పులకు ప్రతి సంవత్సరం రూ.16వేల కోట్లు చెల్లిస్తున్నామని చెప్పారు. ఉమ్మడి నల్గొండ, మహబూబ్ నగర్ జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టును రానున్న రెండేళ్లలోపు కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేస్తుందని నల్లగొండ జిల్లా బిడ్డగా చెబుతున్నన్నారు.

# జనరల్
STATE & REGIONAL NEWS

## ఘనంగా మెడిటేషన్ దినోత్సవం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** నార్సింగిలోని తెలంగాణ పోలీసు అకాడమీలో ఆదివారం 'ప్రపంచ రెండవ మెడిటేషన్ దినోత్సవాన్ని' ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు అకాడమీలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ ప్రతినిధుల ఆధ్వర్యంలో శిక్షణార్థులకు ధ్యాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రతినిధి శ్రీనివాసన్ మాట్లాడుతూ.. ధ్యానం మనిషి శారీరక, మానసిక ఆరోగ్యానికి ఎంతో దోహదపడడమేకాకుండా ప్రపంచ శాంతి సాధనకు సమర్థవంతమైన మార్గమని తెలిపారు. ముఖ్యంగా పోలీస్ వృత్తిలో నిరంతర ఒత్తిడితో పనిచేసే అధికారులు ధ్యానాన్ని నిత్యజీవితంలో భాగంగా చేసుకుంటే, వృత్తిపరంగా మరింత సమర్థవంతంగా, సమతుల్యంగా విధులు నిర్వహించగలరని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్ అవుట్‌డోర్ అసిస్టెంట్ డైరెక్టర్లు భరత్, రమణ, ఇండోర్ డిఎస్‌పిలు ఆదూరి శ్రీనివాసరావు, టి.శ్రీనివాసరావు, రిజర్వ్ ఇన్స్‌పెక్టర్లు మహేష్, ఫణి, క్వార్టర్ మాస్టర్ శ్రీనివాసరావు, ఆర్‌ఎస్‌ఐలు పాల్గొన్నారు. మొత్తం 112 మంది ప్రొబేషనరీ డిఎస్‌పిలు పాల్గొన్నారు. అకాడమీ తరపున ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రతినిధులు శ్రీనివాసన్, శ్రావణ్, స్రవంతిలకు మెమంటోలు ప్రదానం చేయడం జరిగింది.

# బుక్‌ఫెయిర్‌లో సందడే సందడి

- కిటకిటలాడుతున్న బుక్ ఫెయిర్
- అన్ని వయస్సుల వారిని ఆకట్టుకుంటున్న పుస్తక ప్రదర్శన
- సకుటుంబ సమేతంగా తరలి వస్తున్న పుస్తక ప్రియులు
- పుస్తక ప్రేమికులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు






**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రజా కవి అందెశ్రీ పేరుతో హైదరాబాద్‌లోని ఎన్‌టిఆర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన 38వ హైదరాబాద్ బుక్‌ఫెయిర్ ప్రాంగణం పాఠకులు, విద్యార్థులు, మేధావులతో కిటకిటలాడుతోంది. వివిధ భాషలకు చెందిన లక్షలాది పుస్తకాలు ఒకేచోట లభ్యమవుతుండటంతో పుస్తకాభిమానులను అలరిస్తోంది. తెలుగు, ఇంగ్లీష్, హిందీ, ఉర్దూ సహా అనేక భాషల్లో సాహిత్యం, నవలలు, కథాసంపుటాలు, కవిత్వం, చరిత్ర, విజ్ఞాన శాస్త్రం, పోటీ పరీక్షల పుస్తకాలు, బాలల సాహిత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ప్రముఖ ప్రచురణ సంస్థలు ఏర్పాటు చేసిన స్టాళ్లలో తాజా పుస్తకాలతో పాటు అరుదైన గ్రంథాలు కూడా లభ్యమవుతున్నాయి. పుస్తకాలపై ప్రత్యేక రాయితీలు ఉండటంతో విద్యార్థులు, యువత ఆసక్తిగా కొనుగోళ్లు చేస్తున్నారు. పిల్లల కోసం ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయడంతో తల్లిదండ్రులు తమ పిల్లలతో కలిసి ప్రదర్శనను సందర్శిస్తున్నారు. పుస్తక పరిచయ కార్యక్రమాలు, రచయితలతో ముఖాముఖి చర్చలు, సంతకాల కార్యక్రమాలు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. సాంస్కృతిక కార్యక్రమాలు, సాహిత్య సమావేశాలు ప్రదర్శనకు మరింత వన్నె తీసుకొస్తున్నాయి. జ్ఞానానికి పునాది అయిన పుస్తకాల పట్ల యువతలో చదువుపై ఆసక్తి పెంచేలా ఈ పుస్తక ప్రదర్శన దోహదపడుతుందని నిర్వాహకులు తెలిపారు. నిర్దిష్ట తేదీ వరకు కొనసాగనున్న ఈ ప్రదర్శనను పుస్తక ప్రేమికులు తప్పక సందర్శించాలని వారు కోరారు.

### పుస్తకం నన్ను ఈ స్థాయికి తెచ్చింది.. కవి డా. యాకూబ్ (హైదరాబాద్ బుక్ ఫెయిర్ అధ్యక్షులు)

ప్రస్తుతం టెక్నాలజీ వాడకం చాలా బాగా పెరిగింది. చిన్నారులు మొదలుకొని వయోవృద్ధుల వరకు సెల్‌ఫోన్‌తో కాలక్షేపం చేస్తున్నారు. కానీ, సెల్‌ఫోన్ తల దించేలా చేస్తే.. పుస్తకం తల ఎత్తుకునేలా చేస్తుంది. ప్రతి ఒక్కరు పుస్తకాలను చదవడం అలవాటు చేసుకోవాలి. పుస్తక విలువలను ప్రజలకు తెలియజేయడం కోసమే ప్రతి సంవత్సవం హైదరాబాద్ బుక్ ఫెయిర్ సొసైటీ తరపున పుస్తక ప్రదర్శనను ఏర్పాటు చేస్తున్నాం. నేను చాలా పేదరికంలో పెరిగాను. పుస్తకాలు కొనుక్కోవడానికి కూడా డబ్బులు లేని పరిస్థితి. స్కూల్ ఫీజు చెల్లించడం కోసం కిరాణాదుకాణంలో పనిచేశాను, ఐస్‌క్రీంలు విక్రయించాను. కొండాపల్లి దుర్గాదేవి, కెవిల్ నరసింహారావు నన్ను చాలా ప్రోత్సహించారు. వారి సహాకరంతో ఎమ్‌ఫిల్ వరకు చదువుకోగలిగాను. పుస్తక పఠనం ద్వారానే ఈ రోజు ఈ స్థాయికి చేరుకున్నాను.

### ఏఐ యుగంలోనూ పుస్తకాలకు ఆదరణ తగ్గలేదు.. బాల్‌రెడ్డి (హైదరాబాద్ బుక్ ఫెయిర్ ఉపాధ్యక్షులు)

నేటి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) యుగంలోనూ పుస్తకాలకు ఆదరణ తగ్గలేదు. ప్రతి రోజు వేలాది మంది సందర్శకులు బుక్ ఫెయిర్‌ను సందర్శిస్తున్నారు. పాఠకుల అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశాం. ఈ సంవత్సరం పిల్లల కోసం ఏర్పాటు చేసిన బాలోత్సవ కార్యక్రమం, రచయితలతో నచ్చిన పుస్తకంపై ప్రసంగం తదితర కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ప్రజలందరూ సకుటుంబ సమేతంగా బుక్‌ఫెయిర్‌కు విచ్చేసి, పుస్తకాలను కొనుగోలు చేయాలి. ప్రతి ఇల్లు ఒక గ్రంథాలయంగా మారినప్పుడే సమాజంలో విలువలు పెరుగుతాయి.

### పుస్తకమే నా ప్రపంచం.. యం.సరళ (బి.టెక్ విద్యార్థిని)

పుస్తకమే నా ప్రపంచం. పుస్తకాలు చదవడం నాకు చాలా ఇష్టం. స్నేహితులతో కంటే పుస్తకాలతో ఎక్కువ కాలక్షేపం చేస్తాను. గత 5 సంవత్సరాల నుంచి బుక్ ఫెయిర్‌కు క్రమం తప్పకుండా వస్తున్నాను. ప్రతి స్టాల్‌ను సందర్శించి నచ్చిన పుస్తకాలను కొనుగోలు చేస్తాను. మా ఇంట్లో సుమారు 500 వరకు పుస్తకాలు ఉన్నాయి. నాతో పాటు నా స్నేహితులకు పుస్తకాలను చదవాలని ప్రోత్సహిస్తున్నాను.

### డాక్టర్ వాసిరెడ్డి రమేష్‌బాబు (ఖమ్మం జిల్లా కొత్తగూడెం)

ప్రతి సంవత్సరం తప్పకుండా బుక్‌ఫెయిర్‌ను సందర్శించి నచ్చిన పుస్తకాలను కొనుగోలు చేస్తాను. పుస్తకం చదివితే వచ్చే మనశ్శాంతి ఎక్కడ లభించదు. నా మనువళ్లు, మనవరాళ్ళను పుస్తకాలు చదవమని ప్రోత్సహిస్తాను. వైద్య వృత్తిలో కొనసాగుతున్నా కూడా ప్రతిరోజు ఖచ్చితంగా పుస్తక పఠనం చేస్తాను. ఎక్కువగా కథలు, నవలలు చదువుతాను. మా ప్రాంతంలో సుమారు 25 సంవత్సరాల క్రితం నేను ప్రారంభించిన బాలోత్సవం నేడు రెండు తెలుగు రాష్ట్రాల్లో విజయవంతంగా కొనసాగుతుంది. పుస్తకాలు కేవలం ర్యాంకులు, ఉద్యోగాల కోసం కాకుండా, ఇష్టంగా చదివినప్పుడే సమాజం చైతన్యవంతంగా, మానవత విలువలతో వెలుగొందుతుంది.

### హైదరాబాద్ బుక్ ఫెయిర్ నేపథ్యం..

పుస్తకాలతో మమేకమయ్యే వేదికగా, విజ్ఞానానికి చిరునామాగా నిలిచిన హైదరాబాద్ బుక్ ఫెయిర్‌కు సుదీర్ఘమైన ఘనమైన చరిత్ర ఉంది. తెలుగు పుస్తక ప్రచురణ రంగాన్ని కొత్త మలుపు తిప్పిన ఈ పుస్తక ప్రదర్శన, పాఠకులు, రచయితలు, ప్రచురణకర్తలను ఒకే వేదికపైకి తీసుకొచ్చే అరుదైన కార్యక్రమంగా గుర్తింపు పొందింది. తెలుగు భాషా సాంస్కృతిక వికాసమే లక్ష్యంగా కేశవ మెమోరియల్ స్కూల్ మైదానంలో 1986లో హైదరాబాద్ బుక్ ఫెయిర్‌ను మొదటిసారి ఏర్పాటు చేశారు. ఆ తరువాత నిజాం కళాశాల మైదానం, ఆర్‌టిసి క్రాస్‌రోడ్స్, చిక్కడపల్లి సెంట్రల్ లైబ్రరీ, నెక్లెస్ రోడ్డు తదితర ప్రాంతాల్లో ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. అప్పట్లో పుస్తకాల విక్రయాలతో పాటు పఠనాసక్తిని పెంపొందించాలనే ఉద్దేశంతో కొద్దిమంది సాహితీప్రేమికులు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కాలక్రమేణా ఇది రాష్ట్ర స్థాయి నుంచి జాతీయ స్థాయి పుస్తక ప్రదర్శనగా ఎదిగింది.

### నారాయణ రెడ్డి (నవచేతన బుక్ హౌస్)



పుస్తక ప్రేమికులతో బుక్ ఫెయిర్ ప్రాంగణం కిటకిటలాడుతుంది. గతంలో రచయితలు, వయో వృద్ధులు ఎక్కువగా వచ్చేవారు. కానీ, ప్రస్తుతం యువతరం తండోపతండాలుగా తరలి వచ్చి తమకు నచ్చిన పుస్తకాలను కొనుగోలు చేస్తున్నారు. డిజిటల్ యుగంలోనూ పుస్తకం విలువ తగ్గలేదని చెప్పడానికి బుక్ ఫెయిర్ ఒక ఉదాహరణ. జనరల్ నాలెడ్జ్, పర్సనల్ డెవలప్‌మెంట్, స్టోరీ బుక్స్, ఎడ్యుకేషన్, చిల్డ్రన్స్ ఇలా అనేక పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. పుస్తక ప్రియులు తమకు నచ్చిన పుస్తకాలు కొనుగోలు చేయడానికి హైదరాబాద్ బుక్ ఫెయిర్ గమ్యస్థానం.



## రాష్ట్రపతి నిలయంలో ఎట్ హోం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆధ్వర్యంలో సికింద్రాబాద్ బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో 'ఎట్ హోం' కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మతో కలిసి సిఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. వారితో పాటు డిప్యూటీ ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, దనసరి అనసూయ సీతక్క, కోమటిరెడ్డి వెంకట్రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అతిథులతో ఆత్మీయంగా మాట్లాడారు. కార్యక్రమం స్నేహపూర్వక వాతావరణంలో సాగింది.

## విదేశీ స్కాలర్‌షిప్‌కు దరఖాస్తుల ఆహ్వానం

- జిల్లా మైనారిటీల సంక్షేమ అధికారి ఇలియాస్ అహ్మద్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** యుఎస్‌ఎ, యుకె, ఆస్ట్రేలియా, కెనడా, సింగపూర్, జర్మనీ, దక్షిణ కొరియా, జపాన్, ఫ్రాన్స్, న్యూజిలాండ్ తదితర దేశాలలోని వివిధ విశ్వవిద్యాలయాలలో పోస్ట్ గ్రాడ్యుయేట్ లేదా డాక్టరేట్ కోర్సులను అభ్యసించడానికిగాను ముఖ్యమంత్రి ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లకు అర్హతగల మైనారిటీ విద్యార్థుల నుండి ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానించనున్నట్లు జిల్లా మైనారిటీల సంక్షేమ అధికారి ఇలియాస్ అహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. విదేశీ విశ్వవిద్యాలయాలలో పోస్ట్ గ్రాడ్యుయేట్, డాక్టరేట్ కోర్సులలో గత జూలై 1, నుండి ఈ నెల 31వ తేదీ వరకు వరకు ప్రవేశం పొందిన విద్యార్థులు https://telanganaepass.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా నేటి నుండి 19 జనవరి 2026 సాయంత్రం 5.00 గంటల లోపు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఎంపికైన అభ్యర్థులకు రూ.20 లక్షల వరకు స్కాలర్‌షిప్ పాటు ఒక టికెట్ ఛార్జీ లేదా వాస్తవ రుసుము, ఏది తక్కువైతే అది మంజూరు చేయబడుతుందని తెలిపారు. మరిన్ని వివరాలకు https://telanganaepass.cgg.gov.in నేరుగా కాని హైదరాబాద్‌లోని హజ్ హౌస్ భవనంలోని జిల్లా మైనారిటీల సంక్షేమ కార్యాలయం నేరుగా కాని, ఫోన్ నెం.04023240134 ద్వారా కాని సంప్రదించవచ్చని తెలిపారు.

# అణచివేతను, అన్యాయాన్ని, దోపిడీని ప్రతిఘటిద్దాం





ప్రజలకు భరోసా ఎర్రజెండా : సిపిఐ ఎంపి సందోశ్‌కుమార్

**జగ్దల్‌పూర్:** అణచివేతను ప్రతిఘటిద్దాం... దోపిడీని అడ్డుకుందాం. అన్యాయాన్ని ఎదిరిద్దాం అంటూ చత్తీస్‌గఢ్ వేదికగా సిపిఐ పిలుపునిచ్చింది. ఎప్పుడు ఎక్కడ అన్యాయం జరిగినా ఎర్ర జెండా అండగా నిలుస్తుందని వక్తలు నొక్కిచెప్పారు. ప్రజల సమస్యల పరిష్కారానికి, వారి హక్కుల పరిరక్షణకు సిపిఐ ఎల్లప్పుడు కట్టుబడి ఉంటుందని, నిబద్ధతతో ముందుకు సాగుతోందని వక్కాణించారు. సిపిఐ శతాబ్ది ఉత్సవంలో భాగంగా చత్తీస్‌గఢ్‌లోని జగ్దల్‌పూర్ అరుణశోభను సంతరించుకుంది. ఎర్ర జెండాలతో భారీ ర్యాలీ, అనంతరం బహిరంగ సభ జరిగాయి. సిపిఐ కార్యదర్శి, ఎంపీ పి.సందోశ్ కుమార్, చత్తీస్‌గఢ్ రాష్ట్ర కార్యదర్శి కె.సజీతో పాటు అనేక మంది అగ్రస్థాయి నాయకులు ప్రసంగించారు. నక్సలిజంపై పోరు నెపంతో అమాయక గిరిజనులను లక్ష్యం చేసుకుంటున్నారని, ఆపరేషన్ కగార్ పేరిట మారణహోమం సాగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామిక హక్కులు, జీవనోపాధులు, గౌరవ జీవితానికి ఉన్న హామీని అణచివేస్తుండటంపై రాజీ లేని పోరాటం చేస్తామని ప్రకటించారు. భారత కమ్యూనిస్టు పార్టీ శతాబ్ది ఉత్సావాన్ని పురస్కారించుకొని జగ్దల్‌పూర్‌లో అరుణ పతకాలతో సిపిఐ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించారు. గిరిజనులు, గిరిజనయేతరులు భుజం భుజం కలిపి ముందుకు సాగారు. ఎర్ర జెండాలు చేబూని కదం తొక్కారు. కేంద్రంతో పాటు రాష్ట్రంలోని బీజేపీ ప్రభుత్వాలకు సవాల్ విసిరారు. జల్, జంగిల్, జమీన్‌ను కార్పొరేట్లకు దారాదత్తం చేస్తున్న చత్తీస్‌గఢ్ ప్రభుత్వాన్ని నిలదీశారు. ర్యాలీ సందర్భంగా పాలకులపై తమ ఆగ్రహాన్ని, భవిష్యత్‌పై తమ ఆశలు ఆకాంక్షలను రాష్ట్ర ప్రజలు వ్యక్తం చేశారు. కాగా, ప్రజల పక్షాన అనేక పోరాటాలు, ఉద్యమాలు, త్యాగాలతో సీపీఐ 100 ఏళ్లు గడిపింది. భవిష్యత్తులోనూ ప్రజా హక్కుల కోసం పోరాటాన్ని కొనసాగిస్తుందని సిపిఐ నాయకులు ఉద్ఘాటించారు. పార్టీకి గణనీయమైన సేవలు అందించిన సీనియర్లను ఈ సందర్భంగా సన్మానించారు.

## మోదీ వద్ద మార్కుల కోసమే కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పాట్లు

- ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి




**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ అభివృద్ధి, ఆరు గ్యారెంటీలు, ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి విజన్ డాక్యుమెంట్‌పై సోనియా గాంధీకి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి లేఖ రాయడాన్ని భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి ఆక్షేపించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వద్ద మంచి పేరు తెచ్చుకోవడం కోసమే కిషన్ రెడ్డి ఇలాంటి జిమ్మిక్కులు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గాంధీభవన్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో బిజెపి పరిస్థితి దిగజారడానికి కిషన్ రెడ్డే కారణమని ప్రధాని మోదీ గమనించారని, అందుకే తన ఉనికిని కాపాడుకోవడానికి, ప్రధానిని ప్రసన్నం చేసుకోవడానికే ఇప్పుడు లేఖల డ్రామా ఆడుతున్నారని ఎద్దేవా చేశారు. 'బీఆర్‌ఎస్ 10 ఏళ్ల పాలనలో తెలంగాణ సొమ్మును దోచుకుంటే, కాళేశ్వరంలో భారీ అవినీతి జరిగితే కిషన్‌రెడ్డి అప్పుడు ఎందుకు లేఖలు రాయలేదు?' అని ఎంపీ ప్రశ్నించారు. ఐటి, సిబిఐ, ఈడీ వంటి కేంద్ర సంస్థలను ఉపయోగించి కల్వకుంట్ల కుటుంబం దోపిడీని ఎందుకు అడ్డుకోలేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బిజెపికి తెలంగాణపై నిజమైన ప్రేమ ఉంటే, మిగులు బడ్జెట్ ఉన్న రాష్ట్రాన్ని అప్పుల పాలు చేస్తున్నప్పుడు కిషన్ రెడ్డి ఎందుకు మౌనంగా ఉన్నారని నిలదీశారు. 'రాష్ట్రం నుంచి గెలుపొందిన 8 మంది బిజెపిఎంపిలు మెట్రో ఫేజ్2, మూసీ పునరుజ్జీవం, రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్) వంటి ప్రాజెక్టులకు కేంద్రం నుంచి ఒక్క రూపాయి అయినా నిధులు తెచ్చారా?' అని నిలదీశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలను బాధ్యతగా అమలు చేస్తుందని ఎంపీ స్పష్టం చేశారు. కిషన్ రెడ్డి లేఖలు రాయడం మానుకుని, కేంద్రమంత్రిగా రాష్ట్రానికి రావాల్సిన నిధులను తీసుకురావాలని, కేంద్రంపై ఒత్తిడి తేవాలని హితవు పలికారు.

# క్రీడలు మానసికోల్లాసానికి మేలు




- ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షాన్‌వాజ్ ఖాసీం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఎక్సైజ్ ఉద్యోగంలో భాగంగా ఉండే పని ఒత్తిడి నుంచి ఉద్యోగులు ఉపశమనం పొందాలంటే క్రీడలు తమ జీవితంలో ఒక భాగంగా ఉండాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షాన్‌వాజ్ ఖాసీం అన్నారు. రైల్వే స్టోర్స్ క్లబ్‌లోని ఇండోర్ స్టేడియంలో ఆదివారం రెండు రోజుల పాటు తెలంగాణ ఎక్సైజ్ అధికారుల సంఘం అధ్వర్యంలో ఉద్యోగులకు క్రీడలు నిర్వహించారు. ఎక్సైజ్ క్రీడలను ప్రొహిబిహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ సి.హరికిరణ్ శనివారం ప్రారంభించిన విషయం తెలిసిందే. చెస్, బాల్ బాడ్మింటిన్ టెబుల్ టెన్నీస్, క్యారం క్రీడలను నిర్వహించారు. రెండు రోజుల పాటు జరిగిన క్రీడల్లో గెలుపొందిన ఎక్సైజ్ ఉద్యోగుల క్రీడాకారులకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షాన్‌వాజ్ ఖాసీం చేతుల మీదుగా బహుమతులను ఆదివారం అందించారు. ఎక్సైజ్ ఉద్యోగులకు ఇండోర్ గ్రేమ్‌తోపాటు అవుట్‌డోర్ గ్రేమ్‌లుగా ఉన్న వాలీబాల్, పుట్‌బాల్‌తోపాటు ఇతర క్రీడల పోటీలు పెట్టాలని డైరెక్టర్ సూచించారు. చెస్ పోటీల్లో గెలుపొందిన శశిధర్‌రెడ్డి, జుల్ ఫికర్ ఆహ్మద్, చంద్రశేఖర్‌లకు, బాల్ బ్యాట్‌మెంటిన్ పోటీ ల్లో జ్యోతి కిరణ్, శ్రీనివాసరెడ్డి, జీవన్ కిరణ్, చాణక్యలకు ఉమెన్ విభాగంలో సౌజన్యశ్రీ, నీలోఫర్ అజ్మీ, నివేదిత, సౌమ్యశ్రీ, సుచిత్రలకు, టెబుల్ టెన్నీస్‌లో విజయ కుమార్, సయ్యద్ యాసిన్ ఖురేషి, డబుల్‌లో నవీన్ చంద్ర, ఖరేషి, సాయిరాం, హర్ష, క్యారమ్స్‌లో జుల్ ఫికర్ ఆహ్మమద్, పవన్‌రెడ్డి, సాయిరాంలకు గెలుపొందారు. వీరందరికి డైరెక్టర్ చేతుల మీదుగా అవార్డులను ప్రధానం చేశారు. ఈ క్రీడలను తెలంగాణ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ గెజిటెడ్ అఫిసర్ల అసోసియేషన్ అధ్యక్షులు జె.హరికిషన్, అర్గనైజింగ్ కార్యదర్శి జివన్ కిరణ్‌లు నిర్వహణలో జరిగాయి.


















# జనరల్

STATE & REGIONAL NEWS

## చేతివృత్తులు అంతరించకుండా ఇండియా క్రాఫ్ట్ మేళా అండగా నిలవాలి

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భారతీయ కళా నైపుణ్యం గల చేతి వృత్తులు అంతరించకుండా ఇండియా క్రాఫ్ట్ మేళా అండగా నిలవాలని వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత,జౌళి శాఖతుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం హైదరాబాద్ లోని శిల్పారామం ప్రాంగణంలో ఆల్ ఇండియా క్రాఫ్ట్ మేళాను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ భారతీయ కళా నైపుణ్యం సంస్కృతి సాంప్రదాయాలు ప్రతిబింబించేలా క్రాఫ్ట్ మేళా ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. దేశవ్యాప్తంగా హ్యాండ్లూమ్ అవార్డు గ్రహీతలు, హ్యాండ్లూమ్ కంపెనీలకు, సహకార సంఘాలకు సంబంధించిన 100 కి పైగా స్టాల్స్ ఏర్పాటు చేసిన ఈ మేళా 2026 జనవరి 5వ తేదీ వరకు కొనసాగుతోందన్నారు.



## ‘హైదరాబాద్ తూఫాన్స్ హాకీ జట్టు’కు టూరిజం శాఖ స్పాన్సర్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హాకీ ఇండియా లీగ్ 202526లో పాల్గొంటున్న ‘హైదరాబాద్ తూఫాన్స్’ హాకీ జట్టు తెలంగాణ రాష్ట్రానికి పర్యాటక, సాంస్కృతిక రాయబారులుగా నిలవాలని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జ్యూపల్లి కృష్ణారావు అన్నారు. ఆదివారం మారియట్ హోటల్‌లో జరిగిన ‘మీట్ అండ్ గ్రీట్’ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, తెలంగాణ పర్యాటక శాఖ ఈ జట్టుకు స్పాన్సర్‌గా ఉండటం గర్వకారణమన్నారు. క్రీడలు కేవలం వినోదం మాత్రమే కాదని, అవి పర్యాటక రంగాన్ని, స్థానిక ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే సాధనాలని ఆయన వివరించారు. హాకీ మన దేశ సంస్కృతిలో భాగమని తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ తుఫాన్ హాకీ జట్టు తెలంగాణ రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్రీడలపై ప్రత్యేక దృష్టి సారించారని, గ్రామీణ ప్రాంతాల నుంచి క్రీడాకారులను ప్రోత్సహించాలని స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్, తెలంగాణ హాకీ అసోసియేషన్ కార్యదర్శి భీమ్‌సింగ్‌లు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ పార్టీలో చేరిన కంసాన్‌పల్లి-బి సర్పంచ్ శాంతప్ప

పార్టీలోకి ఆహ్వానించిన ఎంఎల్‌ఎ మనోహర్‌రెడ్డి

**ప్రజాపక్షం/తాండూరు :** బషీరాబాద్ మండల కంసాన్‌పల్లి బి గ్రామ పంచాయతీ సర్పంచ్ శాంతప్ప కాంగ్రెస్ పార్టీలో చేశారు. ఆదివారం సర్పంచ్ శాంతప్పతో పాటు ఉపసర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, మరో వార్డు మెంబర్‌తో కలసి తాండూరు ఎంఎల్‌ఎ బుయ్యని మనోహర్‌రెడ్డి ఆధ్వర్యాన కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో విజయం సాదించిన గ్రామం సర్పంచ్‌గా విజయం సాదించిన విషయం తెలిసిందే. కాంగ్రెస్ పార్టీలో చేరిన కంసాన్‌పల్లి బి గ్రామ పంచాయతీ సర్పంచ్ శాంతప్పకు ఎంఎల్‌ఎ మనోహర్‌రెడ్డి పార్టీ కండవ కప్పి కాంగ్రెస్ పార్టీలో ఆహ్వానించారు. ఈ సందర్బంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి తనవంతుగా సహకారం అందజేస్తానని తెలిపారు. నూతనంగా ఎన్నుకోబడిన సర్పంచ్‌లు ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సేవలో పాలుపంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ చైర్మన్ వెంకట్రాంరెడ్డి, మార్కెట్ కమిటి చైర్మన్ మధుసుధన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, గ్రామ వార్డు సభ్యులు, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

# ముఖాముఖికి రమ్మంటే ముఖం చాటేస్తున్నారు

కెసిఆర్ శాసనభకు వస్తే కృష్ణా జలాలపై అన్ని విషయాలు చెబుతా

ఎపికి 64, తెలంగాణకు 36 శాతం కృష్ణా జలాలు చాలు అని సంతకం పెట్టిన ద్రోహి

ఆర్థిక ఉగ్రవాది మాజీ సిఎం

జర్నలిస్టులతో ఇష్టాగోష్టిలో ముఖ్యమంత్రి ధ్వజం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కృష్ణా, గోదావరి నది జలాలపైన ముఖాముఖి చర్చలకు రమ్మంటే కెసిఆర్ ముఖం చాటేస్తున్నారని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. కెసిఆర్ శాసనసభకు వస్తే కృష్ణా జలాలపై అన్నీ చెబుతానన్నారు. కృష్ణా జలాల్లో ఎపికి 64 శాతం, తెలంగాణకు 36 శాతం చాలని సంతకం పెట్టిన ద్రోహి కెసిఆర్ అని, ఆయన ఆర్థిక ఉగ్రవాది అని, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను కుప్పకూల్చారని, నాలుగు రకాలుగా రూ.8లక్షల కోట్ల అప్పులు చేశారని సిఎం చెప్పారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతలను నిర్మించవద్దన్న హర్షవర్ధన్ రెడ్డికే కెసిఆర్ ఎన్నికలలో బి ఫామ్ ఇచ్చారన్నారు. జనవరి 2వ తేదీ నుంచి శాసనసభ సమావేశాలను నిర్వహించనున్నామని, జలాలు వాస్తవాలపైన అసెంబ్లీలో చర్చిద్దాం ‘రండి’ అని సిఎం మరోసారి కెసిఆర్‌ను ఆహ్వానించారు. జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో సిఎం రేవంత్ రెడ్డి ఆదివారంనాడు జర్నలిస్టులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రానికి కెసిఆర్ చేసిన ద్రోహం ఏ నాయకుడూ చేయలేదని ఆరోపించారు. చంద్రబాబు శిష్యుడే కెసిఆర్ అని, పట్టిసీమను అభినందిస్తున్నానని అన్నదే నాడు కెసిఆర్ అనిచెప్పారు. కెసిఆర్ మాట్లాడిన భాష ఆయన వయసుకు తగినది కాదన్నారు. రాష్ట్రాన్ని అతలాకుకుతలం చేసి దివాళా తీయించిందే కెసిఆర్ అని, పదేళ్ల కాలంలో కృష్ణానదిపైన కెసిఆర్ ఒక్క ప్రాజెక్టు కూడా కట్టలేదని, కాంట్రాక్టర్లకు అమ్ముడుపోయి, వేలకోట్ల కమీషన్లు దండుకున్నారని ఆరోపించారు. పదేళ్ల కాలంలో కృష్ణా నదిపై రూ. 2లక్షల కోట్లు ఖర్చుపెట్టి రూ. 1.80 కోట్ల బిల్లులు చెల్లించారని, ఎపి జలదోపిడికి దోహదం చేసిందే కెసిఆర్ అని రేవంత్ రెడ్డి అన్నారు. జూరాల వద్ద ఓడిసి పట్టుకోవాల్సిన కృష్ణ జిల్లాలను శ్రీశైలం నుండి ఇచ్చి ఎపికి రాసిచ్చారని, 811 టిఎంసిలలో 512 టిఎంసిలు ఎపికి, తెలంగాణ మాత్రం 299 టిఎంసిలతో తెలంగాణ ప్రజలకు మరణ శాసనం రాశారని మండిపడ్డారు. స్థానిక సంస్థల ఎన్నికలపై నిజనిర్ధారణ కమిటీ వేద్దామని అన్నారు. .



**కెసిఆర్‌వి అన్నీ అబద్దాలే..** రెండేళ్ల తర్వాత కలుగులో నుంచి కెసిఆర్ బయటకు వచ్చారని, ఒటమితో కెసిఆర్ మారతారని ఆశించానని, కానీ మళ్లీ అబద్ధాలే చెప్పారని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. యూరియా పంపిణీలో టెక్నాలజీ వద్దా? యాప్ పెడితే నష్టమేంటి అని ప్రశ్నించారు. కృష్ణా బేసిన్ దెబ్బతినడానికి, రైతులు నష్టపోవడానికి కారణమే కెసిఆర్ అని, కెసిఆర్ ప్రభుత్వ హయాంలో పాలమూరు రంగారెడ్డి డిపిఆర్ కూడా సరిగా సమర్పించ లేదని ఎద్దేవా చేశారు. గోదావరిలో 71 శాతం వాటా కోసం తాము పోరాటం చేస్తున్మాన్నారు. కాళేశ్వరంపై విచారణకు చేపట్టేందుకు సిబిఐకి, ఐఎఎస్ అధికారి అరవింద్ కుమార్ పై విచారణకు చేపట్టేందుకు డిఓపిటి నుంచి ఎందుకు అనుమతులు రావడం లేదని సిఎం ప్రశ్నించారు.

**కెసిఆర్ ఆనవాళ్లు లేకుండా చేయాలనుకుంటన్నదే కెటిఆర్,హరీశ్ రావు**

కొడుకు(కెటిఆర్), అల్లుడు(హరీశ్‌రావు) కొట్టుకుంటున్నారనే కెసిఆర్ బయటకు వచ్చారని, కుర్చీ కోసం వారు కెసిఆర్ చావును కోరుకుంటున్నారని, తాము కెసిఆర్ ఆరోగ్యంగా ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. కెసిఆర్‌కు బయటి వారితో ప్రమాదం లేదని,ఆయన కుటుంబ సభ్యులతోనే ఆయనకు ప్రమాదం పొంచి ఉన్నదని వ్యాఖ్యానించారు. కెసిఆర్ ఆనవాళ్లు లేకుండా చేయాలనుకుంటున్నదే కెటిఆర్, హరీశ్‌రావు అని అన్నారు. సిఎంగా ప్రమాణస్వీకారం కోసం కెటిఆర్ కొత్త బట్టలు కుట్టించుకున్నారని, కెసిఆర్ పోయిన తర్వాత తన దారి తనదేనని హరీష్ రావు చెప్పకనే చెప్పారని, కెటిఆర్ ఐరన్ లెగ్ అని తేలిపోయిందని ఎద్దేవా చేశారు. పార్టీ పగ్గాలు హరీష్ రావుకు అప్పగించాలనే వాదనలు బిఆర్‌ఎస్‌లో మొదలయ్యాయన్నారు. పార్టీని హస్తగతం చేసుకుంటే రూ. 5300 కోట్ల పార్టీ ఆస్తులు తనకు దక్కుతాయని హరీష్ రావు చూస్తున్నారని సిఎం ఆరోపించారు.

**కెసిఆర్ హయాంలోనే అత్యధిక జలదోపిడీ :** కెసిఆర్ హయాంలోనే అత్యధిక జలదోపిడి జరిగిందని సిఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. మూడు జిల్లాలకు మరణ శాసనం రాసిందే కెసిఆర్ అని, పాలమూరు రంగారెడ్డికి జూరాల నుంచి నీటిని తీసుకుంటే రాష్ట్ర హక్కులు తెలంగాణకే ఉండేవని వివరించారు. కాంట్రాక్టర్లకు అమ్ముడుపోయే కెసిఆర్ ఎత్తిపోతలను నిర్మించారని, ప్రతిపక్ష నేతగా కెసిఆర్ ఇప్పటికైనా బయటికి రావడాన్ని స్వాగతిస్తున్నానని రేవంత్ రెడ్డి అన్నారు.


## మాడుగుల నాగఫణి శర్మ తెలుగు భాషకు దక్కిన వరం

డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ద్విశతావధానం, సహస్రావధానం చేసి కేంద్ర ప్రభుత్వం చేత పద్మశ్రీ అవార్డు పొంది, దేశం నలుమూలల అవధాన ప్రక్రియను ఏర్పాటు చేసి పరిచయం చేసిన మాడుగుల నాగఫణి శర్మ తెలుగు భాషకు దక్కిన వరం అని డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. రవీంద్రభారతిలో ఆదివారం ఏర్పాటు చేసిన మాడుగుల నాగఫణి శర్మ సన్మాన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. అవధాన ప్రక్రియ సజీవంగా కొనసాగాలి అంటే విద్యార్థులకు బాల్యం నుంచే అవధాన ప్రక్రియను నేర్పించాలని, తద్వారా విద్యార్థులకు ధారణ శక్తి, జ్ఞాపకశక్తి మెండుగా అలవడుతాయని అన్నారు. తెలుగు, సంస్కృత భాషల్లో మాత్రమే ఉన్న ఒక ప్రత్యేక ప్రక్రియ అవధానం, ఇది తెలుగు వారందరికీ గర్వకారణమన్నారు. సంక్లిష్ట అవగాహన ప్రక్రియను నాగఫణి శర్మ సాధారణ ప్రజలకు సైతం పరిచయం చేశారని, అవధానం చేయాలంటే కేవలం పాండిత్యమే చాలదు ప్రజ్ఞ, ఏకాగ్రత, సమయస్ఫూర్తి వీటితోపాటు సమకాలిన అంశాలపై స్పష్టమైన అవగాహన ఉండాలని అన్నారు. క్రికెట్‌పై ఒకరు ప్రశ్నిస్తే నాగఫణి శర్మ ఇచ్చిన సమాధానం అందరి మన్ననలు పొందింది, వారిని సన్మానించుకోవడం రాష్ట్ర ప్రభుత్వం గర్వంగా భావిస్తుందని తెలిపారు. స్వర్గీయ మాజీ ప్రధాని పివి నరసింహారావు నాగఫణి శర్మతో అవధానంలో పాల్గొని ప్రశ్నలు వేస్తే శర్మ సమాధానాలు ఇచ్చిన తీరు తనకు ఇంకా గుర్తుందని తెలిపారు. నాగఫణి శర్మ జీవితం నల్లేరుపై బండి నడక కాదు, వారు ఒక చిన్న గ్రామం నుంచి లాంతరు దీపాన్ని ఆసరా చేసుకుని తిరుపతిలో నల్లాన్ చక్రవర్తుల నరసింహచార్యులు, గౌరీ పెద్ది రామ శర్మ వంటి వారి వద్ద ఒక తపస్సుల అవధానాన్ని అధ్యయనం చేయడంతోనే వారు ద్వి శతావధానం, సహస్రావధానం పూర్తి చేయగలిగాలన్నారు. నాగ ఫణి శర్మ హైదరాబాదులో ప్రత్యేక పీఠం ఏర్పాటు చేసి భవిష్యత్తు తరాలకు అవధాన ప్రక్రియను నేర్పిస్తున్నారు, ఈ ప్రక్రియ ద్వారా రాష్ట్ర వైభవాన్ని పరిపరి విధాలుగా వివరించడానికి అవసరమవుతుందని డిప్యూటి సిఎం తెలిపారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్రమంత్రి శ్రీధర్‌బాబు, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.




## కేంద్ర మాజీ మంత్రి అశోక గజపతిరాజుకు సిపిఐ నారాయణ అభినందన



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కేంద్రమాజీ మంత్రి అశోక గజపతిరాజుకు సిపిఐ తరఫున అభినందనలు తెలియజేస్తున్నామని సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ అన్నారు. అశోక్ గజపతిరాజు రాజకీయాల్లో ఉంటూ కూడా ఆదాయాన్ని సమకూర్చుకోకపోగా, తనకున్న సొంత ఆస్తి నుండి రూ.1000 కోట్ల విలువైన భూమిని ప్రభుత్వానికి ఉచితంగా ఇచ్చారన్నారు. ఆ భూమిలో ఏవియేషన్‌కు సంబంధించినవి ఏర్పాటు చేయమన్నారని తెలిపారు. రాజకీయాల్లో రూపాయి పెట్టుబడి పెట్టి రూ.100 కోట్లు సంపాదించే పరిస్థితి ఉండగా, అశోక గజపతిరాజు రూ.1000 కోట్ల విలువైన తన సొంత భూమిని ఇవ్వటం ద్వారా రాజకీయాల్లో ఆదర్శంగా నిలిచారని అభినందించారు. నేడు సమాజంలో విలువలు దిగజారి పోతున్నాయని, అవినీతిని పరాకాష్టకు చేరిందని, ఈ పరిస్థితుల్లో అవినీతి, అక్రమాలకు పాల్పడే రాజకీయ నాయకులు ఆయన సేవలను చూసి సిగ్గుతో తలదించుకోవాలన్నారు. సమాజం అశోక గజపతి రాజును అభినందించాలని నారాయణ కోరారు.

# నేడు రాష్ట్రవ్యాప్త విపత్తు నిర్వహణపై ‘మాక్ డ్రిల్’

ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వం సూచన

విపత్తుల నిర్వహణ వ్యవస్థల సామర్థ్యం

శాఖల మధ్య సమన్వయన పరిశీలన

ప్రభుత్వం-ఎన్‌డిఎంఎ సంయుక్త నిర్వహణ

విపత్తులను ఎదుర్కునేందుకు సర్కార్ కీలక అడుగు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** విపత్తుల సమయంలో ప్రాణ, ఆస్తి నష్టాలను కనిష్ఠ స్థాయికి తగ్గించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగు వేసింది. జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ (ఎన్‌డిఎంఎ) సహకారంతో ఈనెల 22న రాష్ట్రంలోని పలు జిల్లాల్లో భారీ ఎత్తున మాక్ ఎక్సర్‌సైజ్ నిర్వహించనున్నారు. వరదలు, పారిశ్రామిక ప్రమాదాలు సంభవించినప్పుడు అధికార యంత్రాంగం స్పందించే తీరును పరీక్షించేందుకు ఈ కార్యక్రమం చేపట్టారు. రాష్ట్రంలోని ఎంపిక చేసిన జిల్లాల్లో జిల్లా కలెక్టర్లు, అన్ని సంబంధిత లైన్ డిపార్ట్‌మెంట్‌ల, అధికారులు, రాష్ట్ర ప్రధాన కార్యాలయం నుంచి వచ్చిన సీనియర్ అధికారుల మార్గదర్శకత్వంలో ఈ మాక్ డ్రిల్ జరగనుంది.

అన్ని శాఖల సమన్వయంతో ఒకే సమయంలో నిర్వహించడం ద్వారా వ్యవస్థల సామర్థ్యం, ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం పరిశీలించనున్నారు.

**రెండు విభాగాలుగా మాక్ ఎక్సర్‌సైజ్..**

ఈ విన్యాసాలను రెండు ప్రధాన సన్నివేశాల ఆధారంగా నిర్వహించనున్నారు. పగటి సమయం (ఉదయం 9:00 మధ్యాహ్నం 1:00): భారీ వరదలపై మాక్ డ్రిల్. రాత్రి సమయం (సాయంత్రం 5:30 రాత్రి 9:00): పారిశ్రామిక ప్రమాదాలపై మాక్ డ్రిల్.

**వరదల విన్యాసాలు జరిగే ప్రాంతాలు..**

రాష్ట్రవ్యాప్తంగా వరద ముప్పు ఉన్న 12 జిల్లాలను ఇందుకోసం ఎంపిక చేశారు. ఖమ్మం (మున్నేరు), భద్రాచలం (గోదావరి), హైదరాబాద్ (నెక్లెస్ రోడ్, వరంగల్, నిజామాబాద్ వంటి ప్రాంతాల్లోని చెరువులు, నదీ తీరాల్లో ఈ విన్యాసాలు జరుగుతాయి. ఖమ్మం బొక్కలగడ్డ, భద్రాచలం గోదావరి తీరం, హైదరాబాద్ నెక్లెస్ రోడ్ వ్యూ పాయింట్, మహబూబ్‌నగర్ కృష్ణసాగర్, నిర్మల్ లోని చిత్యాల వాగు వంటి ప్రదేశాల్లో సహాయక చర్యలను ప్రయోగాత్మకంగా అమలు చేస్తారు.నేడు రాష్ట్రవ్యాప్త విపత్తు నిర్వహణపై ‘మాక్ డ్రిల్’ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వం సూచన

## జాతీయ గ్రామీణ ఉపాధి చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్న ప్రధాని

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జాతీయ గ్రామీణ ఉపాధి చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేయడాన్ని నిరసిస్తూ వామపక్షాల ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా జరిగే నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి సిపిఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ పిలుపునిచ్చారు. మోదీ ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన 11 ఏళ్ల కాలంలో అత్యంత దుర్మార్గమైన గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని బిల్లును తీసుకొచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర వాటాలను 40 శాతానికి పెంచారని తెలిపారు. ఇప్పటికే నిధుల కొరతతో ఇబ్బంది పడుతున్న రాష్ట్ర ప్రభుత్వాలు రాబోయే రోజుల్లో గ్రామీణ ఉపాధి హామీ పథకానికి నిధులు కేటాయించే పరిస్థితి ఉండబోదని రామకృష్ణ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రత్యేకంగా, పరోక్షంగా గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యంచేస్తోందని మండిపడ్డారు.

## జీనోమ్ వ్యాలీ పోలీస్‌స్టేషన్‌లో నాకబంది

పేట్ బషీరాబాద్ ఎసిపి బాలగంగిరెడ్డి

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** వాహాదారులు పెండింగ్‌లో ఉన్న చలనాలను వెంటనే చెల్లించి ట్రాఫిక్ అధికారులకు, ప్రభుత్వానికి సహకరించాలని పేట్ బషీరాబాద్ ఎసిపి బాలగంగిరెడ్డి అన్నారు. శనివారం రాత్రి తుర్కపల్లి జినోమ్ వ్యాలీ పోలీస్‌స్టేషన్ పరిదిలోని డిఎస్‌ఎ సెంటర్ వద్ద జీనోమ్ వ్యాలీ ఇన్స్‌పెక్టర్ గురువయ్య, శామీర్‌పేట ఇన్స్‌పెక్టర్ శ్రీనాద్‌లతో కలిసి నాకబంది నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్‌లు నాకబందిలో బాగంగా సుమారు 304 వాహనాలను చెక్ చేశారు. వాహనాదారుల నుంచి పెండింగ్‌లో ఉన్న చలనాలు రూ. 15,700 చెల్లించారు. ఏలాంటి పత్రాలు లేని 16 వాహనాలను సీజ్ చేశామని చెప్పారు. అదే విదంగా డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించి 3 కేసులు బుక్ చేశామని చెప్పారు. అనంతరం ఎసిపి బాలగంగిరెడ్డి మాట్లాడుతూ ప్రతి వాహనాదారుడు తమ వాహనాలను రోడ్డు ట్రాఫిక్ నిబంధనలను పాటించి నడుపాలన్నారు. వాహనాలకు సంబందించిన పత్రాలను వెంట పెట్టుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో శామీర్‌పేట డిఐ రాజు, పోలీసులు పాల్గొన్నారు.

## అనూషను అతి దారుణంగా హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

మహిళా సంఘాలు, ప్రజా సంఘాల డిమాండ్



**ప్రజాపక్షం/తాండూరు :** తాండూరు పట్టణ పరిధి సాయిపూర్‌లో గత మూడు రోజుల క్రితం భార్య అనూషను అతి కీరతకంగా కొట్టి చంపిన పరమేష్‌ను, వరకట్నం కోసం వేదించిన వారి కుటుంబ సభ్యులను కఠినంగా శిక్షించాలని మహిళా సంఘాలు, ప్రజా సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. ప్రేమించి పెళ్ళి చేసుకని నమ్మించి మోసం చేసి వరకట్నం కోసం అనూషను భర్త పరమేష్, వారి కుటుంబ సభ్యులైన అత్తమామ, తమ్ముడు రమేష్, బాబాయ్ శ్రీనివాస్, అడపడుచులు అందరు అనూషపై క్రరలతో దాడి చేయడం హేయమైన చర్యని తీవ్రం ప్రజా సంఘాల నేతలు తీవ్రంగా ఖండించారు. ఆదివారం ప్రజా సంఘాల, మహిళా సంఘాల ప్రతినిధులు అనూష కుటుంబ సభ్యులను కలసి పరమార్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ అనూష కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. తాండూరు ప్రాంతంలో డ్రగ్స్, మద్యం ఏరులైన పారుతుందని, మద్యం మత్తులో మహిళలపై దాడులు రోజు రోజుకు పెరిగిపోతున్నాయని వారు అసహనం వ్యక్తం చేశారు. మద్యం, డ్రగ్స్‌ను ప్రభుత్వం అరికట్టాలని డిమాండ్ చేశారు. భవిష్యత్‌లో ఇంలాంటి ఘటనలు జరగకుండా ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. అతి కీరాతకంగా దాడి చేసి చంపిన పరమేష్, వారి కుటుంబ సభ్యులను కఠినంగా శిక్షించాలని ప్రజా సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. లేని యెడల ప్రజా సంఘాలు, మహిళా సంఘాల, విద్యార్థి సంఘాల ఆద్వార్యాన పెద్దఎత్తున్న ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో కేఎన్‌పిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చంద్రప్ప,, సిపిఐ జిల్లా కార్యదర్శి, మహిళ సంఘం ప్రతినిధి విజయలక్ష్మి పండిత్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, తెలంగాణ మైనార్టీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు అబ్దుల్ వాహబ్, చైతన్య మహిళ సంఘం జిల్లా కార్యదర్శి అలివేళు, కేవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఉప్పలి మల్కయ్య,పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్, తెలంగాణ మైనార్టీ హక్కుల పోరాట సమితి తాండూరు నియోజక వర్గ ఇంచార్జీ సాదిక్ , దళిత సంఘాల ప్రతినిధులు పాల్గోన్నారు.

## ప్రభుత్వ అసుపత్రులలో...

# పారిశుద్ధ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

పారిశుధ్యం పర్యవేక్షణకు ‘ఇంటిగ్రేటెడ్ హాస్పిటల్ ఫెసిలిటీ మేనేజ్‌మెంట్’ విధానం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో రోగులకు సురక్షితమైన, స్వస్థత చేకూర్చే ‘పవిత్ర నిలయాలు’గా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ్మ అదేశాల మేరకు అన్ని ప్రభుత్వ అసుపత్రులలో పారిశుధ్యం, భద్రత, ముఖ్యంగా ఎలుకలు, కీటకాల నియంత్రణ కోసం ’ఇంటిగ్రేటెడ్ హాస్పిటల్ ఫెసిలిటీ మేనేజ్‌మెంట్ సిస్టమ్’ (ఐహెచ్‌ఎఫ్‌ఎంఎస్) విధానాన్ని మరింత పటిష్టం చేస్తూ వైద్య విద్య డైరెక్టర్ (డిఎంఇ) డా.నరేంద్రకుమార్ తాజగా మార్గదర్శకాలను జారీ చేశారు. ఆసుపత్రి ప్రాంగణాల్లో ఎలుకల సమస్యను పూర్తిగా అరికట్టేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు.

**కారణాలు అన్వేషణ :** ప్రభుత్వ ఆసుపత్రులలో ఎలుకలు సమస్యకు తలెత్తడానికి మూలాన్ని అధికారులు గుర్తించారు.. ఇందుకుప్రధాన కారణం నిర్దేశించిన ప్రదేశాల్లో కాకుండా వార్డుల వద్దే ఆహారం వండటం, నిల్వ చేయడం, భుజించడమేనని అధికారులు గుర్తించారు. రోగుల సహాయకులు మిగిలిపోయిన ఆహారాన్ని బహిరంగ ప్రదేశాల్లో పారవేయడం, తెరిచి ఉన్న మురుగు కాలువలు ఎలుకల పెరుగుదలకు కారణమవుతున్నాయని గుర్తించారు. దీంతో అసుపత్రులలో పారిశుధ్యం పై ప్రభుత్వం పలు కఠిన నిబంధనలను అమలులోకి తీసుకువచ్చింది.



**చేపట్టనున్న చర్యలు :** పకడ్బందీగా సీలింగ్: ఆసుపత్రి భవనాల పగుళ్లు, రంధ్రాలను పటిష్టమైన మెటీరియల్‌తో మూసివేయాలని ఆదేశించారు. ఆపరేషన్ థియేటర్లు (ఓటిలు), ఐసీయూలు (ఐసియూలు), లేబర్ రూమ్‌లలో ఎలాంటి ఖాళీలు లేకుండా చర్యలను చేపట్టాలని సూచించారు.

**ఇనుప జాలీల ఏర్పాటు :** కిటికీలు, వెంటిలేటర్లు, డ్రైనేజీ పైపులు, సర్వీస్ డక్ట్‌లకు నాణ్యమైన ఇనుప జాలీలను అమర్చాలని అసుపత్రుల బాధ్యులను సూచనలు జారీ చేశారు. వార్డుల్లో భోజనం నిషిద్ధం: వార్డుల్లో రోగుల సహాయకులు ఆహారం వండుకోవడాన్ని, తినడాన్ని కఠినంగా నిషేధిస్తూ భోజనాలను కేవలం నిర్దేశించిన ప్రదేశాలలో పరిమితం చేయాలని నిబందనలను కఠిన తరం చేశారు.

**వ్యర్థాల నిర్వహణ :** అన్ని వార్డులలో మూత ఉన్న చెత్త డబ్బాలను ఏర్పాటు చేసి, ఎప్పటికప్పుడు వ్యర్థాలను తొలగించాలని డి ఎమ్ ఈ ఆదేశించారు.

అవగాహన కార్యక్రమాలు: ఆసుపత్రిలో పారిశుధ్యం పాటించేలా బహుభాషా సూచికలు, మైకుల ద్వారా రోగులకు, వారి సహాయకులకు నిరంతరం అవగాహన కల్పించాలని సూచించారు.

**ఎరలు, బోన్లు :** లైసెన్స్ పొందిన ఏజెన్సీల ద్వారా నిర్ణీత కాలవ్యవధులలో ఎరలు వేయడం, బోన్లు ఏర్పాటు చేయడం వంటి చర్యలు నిరంతరం కొనసాగాలని సూచించారు.

**నిరంతర పర్యవేక్షణ – జవాబుదారీతనం**

ప్రతి ఆసుపత్రిలో ’హాస్పిటల్ ఇన్ఫెక్షన్ కంట్రోల్ కమిటీ’ (హెచ్‌ఐసిసి) చర్యలను పర్యవేక్షిస్తూ ’పెస్ట్ కంట్రోల్ లాగ్ బుక్’ను నిర్వహించాలన్నారు. పారిశుధ్య సిబ్బంది ఎలుకల ఉనికిని గుర్తిస్తూ అధికారులకు ఎప్పటికప్పుడు నివేదిస్తారు. అత్యంత కీలక విభాగాలైన ఐసీయూలు, ల్యాబ్‌లు, వంటశాలల బాధ్యతను ఆయా యూనిట్ హెడ్లు, సూపరింటెండెంట్లు వ్యక్తిగతంగా పర్యవేక్షించాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ప్రతి నెలా నిర్వహించే హాస్పిటల్ మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశాల్లో పారిశుధ్యం పై పురోగతి సమీక్షాలని నిర్ధేశించారు.రోగుల ఆరోగ్య భద్రత విషయంలో ఎటువంటి నిర్లక్ష్యాన్ని సహించేది లేదని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తప్పవని మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశాల మేరకు ఈ చర్యలు చేపడుతున్నామని వైద్య విద్య డైరెక్టర్ డా. నరేంద్ర కుమార్ చర్యలు వెల్లడించారు.



# జాతీయం

NATIONAL & GENERAL NEWS

## ఉగ్రవాదుల కోసం ముమ్మర గాలింపు

**జమ్ము :** జమ్ముకశ్మీర్‌లో ఉగ్రవాదుల కోసం భద్రతా దళాలు ముమ్మరంగా కూంబింగ్ నిర్వహిస్తున్నాయి. ఉధంపూర్ జిల్లాలోని ఒక గ్రామంలో ఉగ్రవాదులు ఒక ఇంటి నుంచి ఆహారం తీసుకుని సమీపంలోని అటవీ ప్రాంతంలోకి పారిపోయినట్లు సమాచారం అందడంతో భద్రతా బలగాలు గాలింపు చర్యలు ప్రారంభించాయని అధికారులు ఆదివారం తెలిపారు. పోలీసులు, పారామిలిటరీ బలగాల సంయుక్త గాలింపు చర్యలు మజల్తా ప్రాంతంలోని చోర్ మోటు, దాని సమీప అటవీ గ్రామాలలో జరుగుతున్నాయని, ఇది గతంలో ఒక పోలీసు అధికారి మరణించిన ఎన్‌కౌంటర్ జరిగిన ప్రదేశానికి పశ్చిమాన సుమారు 5 కిలోమీటర్ల దూరంలో ఉందని అధికారులు తెలిపారు. శనివారం రాత్రి ఇద్దరు గుర్తు తెలియని ఉగ్రవాదులు చోర్ మోటు గ్రామంలోని మంగ్తు రామ్ ఇంటికి రాత్రి 6.30 గంటల ప్రాంతంలో వచ్చి ఆహారం తీసుకున్నారని నిఘా వర్గాల నుంచి సమాచారం అందిందని వారు చెప్పారు. వెంటనే పోలీసులు, పారామిలిటరీ బలగాలను మోహరించినప్పటికీ, ఉగ్రవాదులు కనిపించలేదని వారు తెలిపారు.

## కల్పితం, రాజకీయ ప్రేరేపితం

❑ నేషనల్ హెరాల్డ్ కేసుపై చిదంబరం



**చెన్నై:**నేషనల్ హెరాల్డ్ కేసును కల్పితం, రాజకీయ ప్రేరేపిత కేసు అని కాంగ్రెస్ ఎంపీ, కేంద్ర మాజీ ఆర్థిక మంత్రి పి. చిదంబరం ఆదివారం అభివర్ణించారు. చెన్నై సత్యమూర్తి భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) చట్టవిరుద్ధ చర్యలకు పాల్పడిందని చిదంబరం విమర్శించారు. డబ్బు జాడ లేనప్పుడు లావాదేవీ చట్టబద్ధమైనదా లేదా చట్టవిరుద్ధమా అని ఎవరైనా ఎలా నిర్ణయించగలరని ఆయన ప్రశ్నించారు. 'ఇది కల్పితం, రాజకీయ ప్రేరేపిత కేసు... ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తీవ్రమైన తప్పు చేసింది. వాస్తవానికి, అది చట్టవిరుద్ధ చర్యలకు పాల్పడింది... డబ్బు లావాదేవీ లేనప్పుడు అది చట్టబద్ధమైనదా లేదా చట్టవిరుద్ధమైనదా అని ఎవరైనా ఎలా క్లెయిమ్ చేయగలరు?. ప్రభుత్వం ఇంకా అభ్యర్థన దాఖలు చేసినట్లు సమాచారం లేదు. వారు అభ్యర్థన ముందుకు సాగితే, అది వివేకం లేకపోవడాన్ని మాత్రమే చూపిస్తుంది' అని చిదంబరం తెలిపారు.

## పార్లమెంటరీ సంప్రదాయాలు తుంగలోకి...


● ఎలాంటి సంప్రదింపులు లేకుండానే ఎంజి నరేగా చట్టం రద్దు ● కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ విమర్శ

**న్యూఢిల్లీ:** చారిత్రాత్మకమైన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం (ఎంజిఎన్ఆర్ఇజిఎ) చట్టాన్ని మోదీ ప్రభుత్వం పార్లమెంట్‌లో అపవిత్రం చేసిందని కాంగ్రెస్ ఆరోపించింది. ఎలాంటి సంప్రదింపులు లేకుండా, పార్లమెంటరీ సంప్రదాయాలు, విధానాలను పక్కనపెట్టి రెండు దశాబ్దాల పురోగతిని తిరగదోడారని మండిపడింది. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ ఈ పథకం సాధించిన విజయాలను నొక్కి చెప్పడానికి, 2012లో యుపిఎ ప్రభుత్వం విడుదల చేసిన గ్రామీణ ఉపాధి పథకం సమీక్ష పత్రాన్ని ఎక్స్‌లో పంచుకున్నారు. 2012 జూలై 14న అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్, గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ రూపొందించిన ఎంజిఎన్ఆర్ఇజిఎ సమీక్షను విడుదల చేశారని ఆయన అన్నారు.

ఇది 2008–2012 మధ్య ఎంజిఎన్ఆర్ఇజిఎపై నిర్వహించిన 145 క్షేత్రస్థాయి అధ్యయనాల సంకలనం అని, ఇందులో సిఎజి నివేదిక కూడా ఉందని రమేష్ తెలిపారు. గత వారం పార్లమెంటులో ఈ చారిత్రాత్మక చట్టాన్ని అపవిత్రం చేసిన నేపథ్యంలో ఇప్పుడు దీనిని చదవడం తప్పనిసరి అని అన్నారు. గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ బాధ్యతలు తన వద్ద ఉన్నప్పుడు విడుదల చేసిన ఎంజిఎన్ఆర్ఇజిఎ సమీక్ష పత్రం పరిచయ భాగానికి సంబంధించిన స్క్రీన్‌షాట్‌ను కూడా రమేష్ పంచుకున్నారు. ఎంజిఎన్ఆర్ఇజిఎను మోదీ ప్రభుత్వం బుల్డోజ్ చేస్తోందని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ అధ్యక్షురాలు సోనియా గాంధీ ఆరోపించిన మరుసటి రమేష్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ చట్టాన్ని రద్దు చేయడానికి ఉద్దేశించిన 'నల్ల చట్టాన్ని' దేశవ్యాప్తంగా లక్షలాది మంది పార్టీ కార్యకర్తలు ధిక్కరిస్తారని సోనియా ఉద్ఘాటించారు.

### ట్రంప్, అందానీ కోసమే శాంతి బిల్లు

పార్లమెంట్‌లో శాంతి బిల్లు ఆమోదంపై కాంగ్రెస్ మోడీ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించింది. దీనిని పార్లమెంటులో ట్రంప్ కోసం మాత్రమే కాకుండా అదానీ కోసం కూడా బుల్డోజర్ చేశారని పేర్కొంది. ప్రైవేట్ సంస్థలు ఈ రంగంలోకి ప్రవేశించడానికి అనుమతి పొందిన తర్వాత అదానీ గ్రూప్ అణుశక్తి ప్రయత్నాన్ని ప్లాన్ చేస్తుందని పేర్కొన్న మీడియా నివేదిక స్క్రీన్‌షాట్‌ను జైరామ్ రమేష్ ఎక్స్‌లో పంచుకున్నారు. పార్లమెంట్ గురువారం అణుశక్తి బిల్లును ఆమోదించింది, పటిష్టంగా నియంత్రించబడిన పౌర అణు రంగాన్ని ప్రైవేట్ భాగస్వామ్యం కోసం తెరవడానికి ప్రయత్నిస్తున్న చట్టానికి రాజ్యసభ ఆమోదం తెలిపింది.



'ట్రంప్ (ది రియాక్టర్ యూజ్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్) కోసం మాత్రమే కాకుండా అదానీ (యాక్సిలరేటెడ్ డ్యామేజింగ్ అధీనియం ఫర్ న్యూక్లియర్ ఇండియా) కోసం కూడా పార్లమెంట్‌లో శాంతిని బుల్డోజర్ చేశారని రమేష్ మండిపడ్డారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తన ఒకప్పుడు మంచి స్నేహితుడుతో శాంతిని పునరుద్ధరించడంలో సహాయపడటానికి మాత్రమే శాంతి బిల్లును పార్లమెంటులో బుల్డోజర్ చేశారని కాంగ్రెస్ శనివారం ఆరోపించింది. అమెరికా జాతీయ రక్షణ అధికార చట్టం 2026లో లేవనెత్తిన ఆందోళన అయిన అణు నష్టానికి పౌర బాధ్యత చట్టంలోని కీలక నిబంధనలను శాంతి బిల్లు తొలగిస్తుందని రమేష్ అన్నారు.

## బంగ్లాదేశ్ మీడియాది..
## తప్పుదోవ పట్టించే ప్రచారం

ఢిల్లీలో ఢాకా హైకమిషన్ బయట నిరసనల కథనాలపై భారత ఎంఇఎ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ ధ్వజం

**న్యూఢిల్లీ:**బంగ్లాదేశ్‌లో ఒక హిందూ వ్యక్తి హత్యకు వ్యతిరేకంగా న్యూఢిల్లీలోని బంగ్లాదేశ్ మిషన్ వెలుపల జరిగిన ప్రదర్శన భద్రతా పరిస్థితిని సృష్టించడానికి ప్రయత్నించిందని బంగ్లాదేశ్‌లోని తప్పుదోవ పట్టించే ప్రచార మీడియా నివేదికలను భారతదేశం ఆదివారం ఖండించింది. బంగ్లాదేశ్‌లోని మైమెన్‌సింగ్‌లో దీపు చంద్ర దాస్ భయంకరమైన హత్యకు నిరసనగా శనివారం బంగ్లాదేశ్ హైకమిషన్ ముందు దాదాపు 20నుంచి 25మంది వరకు యువకులు గుమిగూడి నినాదాలు చేశారని విదేశాంగ మంత్రిత్వ శాఖ (ఎంఇఎ) తెలిపింది. బంగ్లాదేశ్‌లోని అన్ని మైనారిటీల రక్షణ కోసం కూడా నిరసనకారులు పిలుపునిచ్చారని ఎంఇఎ తెలిపింది. దాస్ క్రూరమైన హత్యకు పాల్పడిన వారిని శిక్షించాలని ఢాకాలోని ఢాకాలోని తాత్కాలిక ప్రభుత్వాన్ని న్యూఢిల్లీ అభ్యర్థించింది. బంగ్లాదేశ్ హైకమిషన్ వెలుపల నిరసన తెలుపుతున్న యువకులు ప్రాంగణం యొక్క భద్రతను ఉల్లంఘించడానికి ప్రయత్నించారని బంగ్లాదేశ్ మీడియాలో కొన్ని వార్తా కథనాలు ప్రసారమయ్యాయి. గురువారం మైమెన్సింగ్ నగరంలో 25ఏళ్ల దీపు చంద్రదాస్‌ను ఒక గుంపు దారుణంగా కొట్టి చంపిన విషయం తెలిసిందే. విద్యార్థి నాయకుడు షరీఫ్ ఉస్మాన్ హాదీ మరణం తర్వాత బంగ్లాదేశ్‌లో తాజాగా అశాంతి చెలరేగింది. షేక్ హసీనా ప్రభుత్వం కుప్పకూలడానికి కారణమైన ప్రభుత్వ వ్యతిరేక అల్లర్లలో షరీఫ్ అహ్మద్ ప్రముఖుడు. 'ఈ సంఘటనపై బంగ్లాదేశ్ మీడియాలోని కొన్ని సెక్షన్లు తప్పుడు ప్రచారం చేసినట్లు మేం గమనించాం' అని ఎంఇఎ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ చెప్పారు.'డిసెంబరు 20న న్యూఢిల్లీలోని బంగ్లాదేశ్ హైకమిషన్ ముందు దాదాపు 20నుండి 25 మంది వరకు యువకులు గుమిగూడి తిరిగి మైమెన్సింగ్‌లో దీపు చంద్ర దాస్ హత్యకు నిరసనగా నినాదాలు చేస్తూ బంగ్లాదేశ్‌లోని అన్ని మైనార్టీల రక్షణ కోసం కూడా పిలుపునిచ్చారు' అని రణ్‌ధీర్‌జైస్వాల్ అన్నారు. 'ఘటన జరిగిన కొన్ని నిమిషాల తర్వాత అక్కడ మోహరించిన పోలీసులు ఆ బృందాన్ని చెదరగొట్టారు.

## ఎక్కువ పని... తక్కువ పరిశీలన

❑ పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో తొమ్మిది బిల్లుల్లో ఏడు బిల్లులకు ఆమోదం

**న్యూఢిల్లీ:**పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో తొమ్మిది బిల్లుల్లో ఏడు బిల్లులు ప్రవేశపెట్టిన వారంలోనే ఆమోదం పొందాయి. రెండు సభలు షెడ్యూల్ చేసిన గంటల కంటే ఎక్కువ సమయం సమావేశమై, చట్టాలు చేయడం కంటే చర్చలకే ఎక్కువ సమయం కేటాయించాయి. ఈనెల 1 నుండి 19 వరకు జరిగిన ఈ సమావేశంలో లోక్‌సభ 103 శాతం, రాజ్యసభ 104శాత పనిచేశాయని పిఆర్ఎస్ లెజిస్లేటివ్ రీసెర్చ్ తెలిపింది. సమావేశాలు పొడగించినప్పటికీ శాసనసభ వ్యవహారాలు లోక్‌సభ సమయంలో 36 శాతం, రాజ్యసభ సమయంలో 30 శాతం ఉన్నాయి. ఇటీవలి శీతాకాల సమావేశాల్లో కనిపించే విధానాన్ని కొనసాగించాయి. రెండు సభలలో 40 శాతం కంటే ఎక్కువ సమ యం చర్చల కోసం వెచ్చించారు. ప్రధానంగా వందేమాతరం 150వ వార్షికోత్సవం, ఎన్నికల సంస్కరణలపై ప్రత్యేక చర్చలకు ఎక్కువ సమయం కేటాయించారు. ప్రవేశపెట్టిన తొమ్మిది బిల్లుల్లో ఏడు బిల్లులు ఒక వారంలోనే ఆమోదించబడ్డాయి. వీటిలో అణుశక్తి నియంత్రణ, గ్రామీణ ఉపాధి పథకం, బీమా సంస్కరణలకు సంబంధించిన విస్తృత విధానపరమైన చిక్కులతో కూడిన చట్టాలు ఉన్నాయి. ఈ బిల్లుల్లో చాలా బిల్లులను సెషన్ చివరి వారంలో ప్రవేశపెట్టారు. విస్తృత చర్చ లేదా పరిశీలనకు తక్కువ సమయం ఇచ్చారు. ఉన్నత విద్య నియంత్రణ, మూడు సెక్యూరిటీ చట్టాలను ఒకే కోడ్‌లో ఏకీకృతం చేయడంపై రెండు బిల్లులను పార్లమెంటరీ కమిటీలకు పంపారు.



కమిటీ పరిశీలన కూడా సమావేశానికి మించి పరిమితంగానే ఉంది. 18వ లోక్‌సభలో ఇప్పటివరకు ప్రవేశపెట్టిన 42 బిల్లులలో 11 బిల్లులను కమిటీలకు పంపారు. వీటిలో ఎక్కువ భాగం ఉమ్మడి కమిటీలకు వెళ్లాయి, వీటిలో ఏకకాల ఎన్నికలపై రెండు బిల్లులు, నిర్బంధంలో మంత్రుల తొలగింపుకు సంబంధించిన మూడు బిల్లులు ఉన్నాయి. సెక్యూరిటీస్ మార్కెట్స్ కోడ్ అనే ఒక బిల్లు మాత్రమే శాఖ సంబంధిత స్టాండింగ్ కమిటీకి సూచించబడింది. రెండు సభలలో ప్రశ్నోత్తరాల సమయం అసమానంగా ఉన్నప్పటికీ పనిచేసింది. లోక్‌సభ షెడ్యూల్ చేసిన ప్రశ్నోత్తరాల సమయంలో 67 శాతం ఉపయోగించుకుంది, అయితే రాజ్యసభ 80 ఉ పయోగించుకుంది. నక్షత్రం గుర్తు ఉన్న ప్రశ్నలలో పావు వంతు మాత్రమే మౌఖికంగా సమాధానం ఇచ్చారు. లోక్‌సభలో 23 శాతం, రాజ్యసభలో 26 శాతం, మంత్రులను ప్రత్యక్షంగా ప్రశ్నించే అవకాశాలను పరిమితం చేసింది. కొత్తగా ఎన్నికైన ఉపాధ్యక్షుడిని సత్కరించడానికి రాజ్యసభ దాదాపు మూడు గంటలు వెచ్చించింది. ఈ పదవి జూన్ 2019 నుండి ఖాళీగా ఉంది. ప్రభుత్వ ప్రకటనలు 100 శాతం కంటే ఎక్కువ ఉత్పాదకత స్థాయిలను హైలైట్ చేశాయి.

## బిజెపి ప్రధాన ఎజెండా...
## 'ఒక దేశం, ఒక వ్యాపారవేత్త'

దేశ ఆర్థిక, రాజకీయ జీవితంలో క్రమపద్ధతిలో గుత్తాధిపత్యాన్ని ప్రోత్సహిస్తోంది : అఖిలేష్ యాదవ్

**లక్నో:** బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వంపై సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ తీవ్రంగా విరుచుకుపడ్డారు. 'ఒక దేశం, ఒక వ్యాపారవేత్త' అనే ఎజెండా కోసం పనిచేస్తోందని ఆరోపించారు. దేశ ఆర్థిక, రాజకీయ జీవితంలో గుత్తాధిపత్యాన్ని క్రమపద్ధతిలో ప్రోత్సహిస్తోందని మండిపడ్డారు. రాజకీయ నిధుల సౌలభ్యాన్ని నిర్ధారించడానికి బి జెపి కొంతమంది పారిశ్రామికవేత్తల చేతుల్లో వ్యా పారాలను కేంద్రీకరించాలని కోరుకుంటుందని ఎక్స్ వేదికగా అఖిలేష్ విమర్శలు చేశారు.'ఒక దే శం, ఒక వ్యాపారవేత్త' వైపు వెళ్లడం బిజెపి ప్రభు త్వ రహస్య ఎజెండా అని ఆయన అన్నారు. ''ఒక వ్యాపారం, ఒక విరాళ వనరు' అనే సూత్రం ప్రకా రం, బిజెపి నాయకులు దేశ ఆర్థిక వ్యవస్థలోని ప్ర తి రంగాన్ని ఎంపిక చేసిన కొద్దిమంది చేతుల్లోకి తీ సుకురావాలని కోరుకుంటున్నారని, తద్వారా వా రు నిధుల కోసం వేర్వేరు ప్రదేశాలకు వెళ్లాల్సిన అ వసరం ఉండదని యాదవ్ ఎద్దేవా చేశారు. రాజకీ య, ఆర్థిక లక్ష్యాలను సాధించడానికి పాలక పార్టీ తన డబ్బు కోసం దురాశకు ప్రాధాన్యత ఇస్తుంద ని, ప్రభుత్వం, పార్టీ సంస్థలో విధేయులైన తోలుబొమ్మలను ఉంచుతుందని మాజీ ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి ఆరోపించారు. రాజకీయ, ఆర్థిక లేదా సామాజిక రంగాలలో ఉద్భవించినా, ఏకస్వామ్య ధోరణులు ఏ దేశానికైనా ప్రమాదకరమని యాదవ్ హెచ్చరించారు. 'ఏ దేశానికైనా, ఏ రంగంలోనైనా గుత్తాధిపత్యం ప్రాణాంతకం, అది రాజకీయాలు, ఆర్థిక వ్యవస్థ లేదా సామాజిక ఆధిపత్యం కూడా కావచ్చన్నారు. బిజెపి ప్రభుత్వం ఇతర పా రిశ్రామిక సంస్థలను కూల్చివేసి, ఆర్థిక నియంత్రణను కొన్ని అనుకూల వర్గాలకు బదిలీ చేయడాని కి ప్రయత్నిస్తోందని ఆరోపిస్తూ, అటువంటి ప్రయత్నాలు తీవ్రమైన, ప్రమాదకరమైన పరిణామాలకు దారితీస్తాయన్నారు. తదుపరి దశ అనియంత్రిత లాభదాయకం, పెరుగుతున్న ద్రవ్యోల్బణం, చివరికి భారీ అవినీతి అని ఆయన పేర్కొన్నారు. గుత్తాధిపత్య సంస్థలకు ప్రయోజనం చేకూర్చడానికి చట్టాలు, నిబంధనలను మారుస్తారని, వినియోగదారులపై ఏకపక్షంగా వసూలు చేస్తారని ఆరోపించారు. కార్మికులు 'తక్కువ జీతం, ఎక్కువ పని' ఫార్ములా కింద పెరిగిన దోపిడీని ఎదుర్కొంటారన్నారు. రైతులు లేదా పిడిఎ (పిక్చాడా, దళిత, అల్పసంఖ్యాక్) సమాజం వింటామని, జనాభాలో దాదాపు 95 శాతం మంది తీవ్ర దోపిడీకి గురవుతారన్నారు. సమాజ్‌వాదీ పార్టీ అధినేత సమష్టి ప్రతిఘటనకు పిలుపునిచ్చారు. నేడు దేశం ఐక్యంగా ఉండి బిజెపికి బుద్ధి చెప్పాలని, గుత్తాధిపత్యం ఆమోద యోగ్యం కాదన్నారు.



## జమ్ముకశ్మీర్‌ను కమ్మేసిన మంచు దుప్పటి..



**జమ్ము :** ఉత్తరాదిని చలికి వణికిపోతోంది. జమ్ముకశ్మీర్ హిమాచల్ ప్రదేశ్‌లలో తాజా హిమపాతం మొదలైంది. ఎత్తయిన భూభాగాల్లో హిమపాతం పెరిగి లోయలోని పలు ప్రాంతాల కనిష్ఠ ఉష్ణోగ్రతలు ఘనీభవన స్థానం కంటే దిగువకు పడిపోయాయి. జలవనరుల ఉపరితల భాగాల్లో పలుచని మంచు పొరలు కనిపిస్తున్నాయి. అనేక ప్రాంతాల్లో సున్నా డిగ్రీల సెల్సియస్ కంటే తక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. గుల్‌మార్గ్‌లోని స్కై రిసార్ట్, సోనామార్గ్, దూద్‌పత్రి సహా దక్షిణ, ఉత్తరకశ్మీర్‌లోని ఎత్తయిన ప్రాంతాలలో భారీగా మంచు కురుస్తుండటంతో ఆ ప్రాంతాలు శ్వేతవర్ణంలోకి మారిపోయాయి. కశ్మీర్ అంతటా పరుచుకున్న మంచుదుప్పటి ఒకవైపు పర్యాటకులను ఆకర్షిస్తుండగా.. మరోవైపు రోడ్లపై భారీగా మంచు పేరుకుపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇదిలావుంటే భారీవర్షం కారణంగా పలు చోట్ల కొండ చరియలు విరిగిపడటంతో జమ్ముశ్రీనగర్ జాతీయ రహదారిపై రాకపోకలు నిలిపివేసినట్లు అధికారులు తెలిపారు. రహదారిపై అడ్డంకులను తొలగించి రాకపోకలను పునరుద్ధరించడానికి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో మంచు తీవ్రత ఎక్కువయ్యే అవకాశం ఉండడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. శీతాకాల సంసిద్ధతపై ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా నేతృత్వంలో శనివారం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. భారీ హిమపాతాన్ని ఎదుర్కోవడానికి రోడ్ క్లియరెన్స్, నిరంతర విద్యుత్తు సరఫరా, తాగునీటి లభ్యత వంటి వాటిపై దృష్టి సారించినట్లు సిఎం ఒమర్ అబ్దుల్లా పేర్కొన్నారు.

## గాయనిపై దాడికి తణమూల్ నేత యత్నం

**కోల్‌కతా:** పశ్చిమ బెంగాల్‌లో ఒక గాయనిపై అధికార తృణమూల్ కాంగ్రెస్(టిఎంసి) కార్యకర్త దాడికి యత్నించాడు. తూర్పు మిడ్నాపూర్‌లో ఒక పాఠశాలలో లైవ్ ప్రదర్శన ఇస్తున్న సమయంలో సెక్యులర్ సాంగ్స్ పాడనందుకు టీఎంసీ స్థానిక నాయకుడు తనను వేధించాడని, శారీరకంగా దాడి చేస్తానని బెదిరించాడని ప్రముఖ బెంగాల్ గాయని లగ్నిజిత చక్రవర్తి ఆరోపించారు. శుక్రవారం సాయంత్రం భగవాన్‌పూర్‌లోని ఒక స్థానిక పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈ ఘటన జరిగింది. ఈ మేరకు చక్రవర్తి పోలీసులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. మెహబూబ్ మాలిక్ అనే వ్యక్తి వేదికపైకి ఎక్కి అందరూ చూస్తుండగానే తనపై దాడి చేయడానికి ప్రయత్నించినట్లు ఆరోపించారు. సింగర్ ''జాగో మా'' అంటూ దుర్గామాత పాట పాడిన తర్వాత ఆమెను అడ్డుకోవాలని ప్రయత్నించాడు. నిందితుడిపై చర్యలు తీసుకోవాలని పోలీసుల్ని ఆమె కోరింది. సెక్యులర్ సాంగ్స్ పాడనందుకే సింగర్‌ను లక్ష్యంగా చేసుకున్నాడని బిజెపి ఆరోపించడంతో పులుముకుంది.

## ఏ మతానికి చెందిన సనాతన ధర్మానికి తలొగ్గి..
## ఆధునిక రాష్ట్రాన్ని పరిపాలించలేం

కేరళ రాష్ట్ర సాధారణ విద్య మంత్రి వి.శివన్‌కుట్టి స్పష్టీకరణ

ప్రగతిశీల విలువలకు నిలబడ్డ ఎల్‌డిఎఫ్‌కు తాత్కాలికంగా ఓట్ల నష్టం జరిగినా బాధ ఏమీలేదని వెల్లడి

**తిరువనంతపురం:** ఏ మతం నుండి వచ్చిన సనాతన ధర్మానికి తలొగ్గి ఆధునిక రాష్ట్రాన్ని పరిపాలించలేమని సిపిఐ(ఎం) సీనియర్ నాయకుడు, కేరళ సాధారణ విద్య మంత్రి వి.శివన్‌కుట్టి స్పష్టం చేశారు. ప్రగతిశీల విలువలకు నిలబడటం వల్ల పాలక లెఫ్ట్ డెమొక్రటిక్ ఫ్రంట్ (ఎల్‌డిఎఫ్)కు తాత్కాలికంగా కొన్ని ఓట్లు నష్టపోయినా బాధపడాల్సిన అవసరం లేదని ఆయన చెప్పారు. ఇటీవల స్థానిక సంస్థల ఎన్నికలలో ఎల్‌డిఎఫ్ పేలవమైన పనితీరుకు గల కారణాలపై వరుస ప్రశ్నలకు ఆదివారం 'పిటిఐ'కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో సమాధానమిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. కొచ్చిలోని క్రైస్తవుల నిర్వహణలో ఉన్న పాఠశాలకు సంబంధించిన హిజాబ్ వివాదంపై రాష్ట్ర ప్రభుత్వ వైఖరి, ముస్లిం మతాధికారుల వ్యతిరేకత ఉన్నప్పటికీ జుంబా నృత్య కార్యక్రమాలను అమలు చేయాలనే నిర్ణయం వామపక్షాలు దాని బలమైన ప్రాంతాలలో పేలవమైన ప్రదర్శనకు దోహదపడ్డాయి అని అడిగినప్పుడు శివన్‌కుట్టి 'ఇవి నిష్పత్తిలో లేకుండా బయటపడ్డ విభిన్న సమస్యలు' అని అంగీకరించారు. 'కొచ్చిలోని సెయింట్ రీటాస్ స్కూల్‌లో ప్రభుత్వం విద్యార్థుల రాజ్యాంగా బద్ధంగా విద్య, మతపరమైన వ్యక్తీకరణ హక్కు కోసం దృఢంగా నిలబడింది. ఆమెకు ప్రవేశం నిరాకరించబడకుండా చూసుకోవడానికి మేం జోక్యం చేసుకున్నాం. అది మైనార్టీ హక్కుల పట్ల మా నిబద్ధతను రుజువు చేస్తోంది' అని ముస్లిం విద్యార్థిని హిజాబ్ ధరించినందుకు ప్రారంభంలో ప్రవేశం నిరాకరించడంపై ప్రభుత్వం ఏవిధంగా జోక్యం చేసుకుందన్న విషయమై మంత్రి శివన్‌కుట్టి విపులీకరించారు. జుంబా సమస్య గురించి ఆయన మాట్లాడుతూ 'నేను స్పష్టంగా చెప్పాలి. నైతికత ముసుగులో పాఠశాలల్లో శారీరక దృఢత్వం, మాదకద్రవ్య వ్యతిరేక ప్రచారాలను వ్యతిరేకించడమే తిరోగమనానికి కారణమైంది' అన్నారు. 'మేము జుంబాను ప్రవేశపెట్టినప్పుడు మా పిల్లల ఆరోగ్యంకోసం కొన్ని సాంప్రదాయిక వర్గాల నుండి వ్యతిరేకత దురదృష్టవశాత్తూ తప్పుగా ప్రచారమైంది. కానీ ఏ మతానికి తలొగ్గి మనం ఆధునిక రాష్ట్రాన్ని పరిపాలించలేం' అని మంత్రి వివరించారు.శబరిమల బంగారం కేసు ప్రభావనం ప్రస్తుత ఎన్నికల పరాజయంపై అడిగిన ప్రశ్నకు మంత్రి శివన్‌కుట్టి సమాధానమిస్తూ భక్తులు వామపక్ష ప్రభుత్వాన్ని ఇప్పటికీ ఆదరిస్తున్నారని, సిట్ దర్యాప్తు సమర్థవంతంగా సాగుతోందని చెప్పారు. కాంగ్రెస్ నేతృత్వంలోని యుడిఎఫ్, బిజెపి 'శబరిమల బంగారం నష్టం సంఘటనను రాజకీయం చేయడానికి ప్రయత్నించడం ద్వారా విశ్వాసులపై దుష్ప్రవర్తనకు పాల్పడుతున్నాయి' అని ఆయన ఆరోపించారు.



స్థానిక సంస్థల ఎన్నికలను కేవలం రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల దృష్టి కోణంలో చూడరాదన్నారు. 2019లో యుడిఎఫ్ లోక్‌సభ ఎన్నికలలో విజయం సాధించడాన్ని ఆయన ప్రస్తావించారు. అయితే కేరళ ప్రజలు 2021 అసెంబ్లీ ఎన్నికలలో పినరయి విజయన్‌కు చారిత్రక విజయాన్నిచ్చి రెండవసారి అధికారం కట్టబెట్టారని మంత్రి గుర్తు చేశారు. ముఖ్యమంత్రి పినరయి విజయన్ పాలస్తీనా అనుకూల ర్యాలీలు నిర్వహిస్తున్నప్పటికీ రాష్ట్రంలో ముస్లిముల విశ్వాసాన్ని గెలుచుకోవడంలో విఫలమయ్యారన్న ప్రశ్నకు సమాధానమిస్తూ ఎల్‌డిఎఫ్ ఓట్లను రాబట్టుకుని గెలిచేందుకుఏ ప్రత్యేక సమాజాన్నీ లక్ష్యంగా చేసుకోవడంలేదని మంత్రి శివన్‌కుట్టి చెప్పారు. ఆయన ప్రకారం పిఎం శ్రీ, కేంద్రం కార్మిక నియమావళిపై రాష్ట్ర వైఖరికి సంబంధించి దురుద్దేశపూరిత ప్రచారం జరిగిందని వివరించారు.

## దేశ వ్యతిరేక కార్యకలాపాల్లో కాంగ్రెస్

❑ అక్రమ బంగ్లాదేశీ వలసదారులను అసోంలో స్థిరపడటానికి సహాయం చేస్తోంది : ప్రధాని మోదీ

**న్యూఢిల్లీ :** కాంగ్రెస్ దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతుందని ప్రధాని నరేంద్ర మోదీ విమర్శించారు. అక్రమ బంగ్లాదేశీ వలసదారులను అసోంలో స్థిరపడటానికి సహాయం చేస్తోందని ఆరోపించారు. అసోంలోని దిబ్రూగఢ్ జిల్లా నమ్రూప్‌లో రూ. 10,601 కోట్ల ఎరువుల కర్మాగారాన్ని ప్రారంభించిన అనంతరం జరిగిన బహిరంగ సభలో మోదీ ప్రసంగించారు. ఇక్కడి పాత ప్లాంట్‌ను ఆధునీకరించడానికి, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారాలు కనుగొనడానికి కాంగ్రెస్ ఎలాంటి ప్రయత్నం చేయలేదని ప్రధాని పేర్కొన్నారు. 'కాంగ్రెస్ దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతోంది. అక్రమ బంగ్లాదేశీ వలసదారులు అసోం అడవులలో, ఇక్కడ నేలపై స్థిరపడాలని వారు కోరుకుంటున్నారు. వారు కేవలం తమ ఓటు బ్యాంకును బలోపేతం చేసుకోవాలని చూస్తున్నారు తప్ప, ప్రజల గురించి పట్టించుకోవడం లేదు' అని ప్రధాని పేర్కొన్నారు. అస్సామీ ప్రజల గుర్తింపు, ఉనికి, ఆత్మగౌరవం గురించి ప్రతిపక్ష పార్టీకి ఏమాత్రం చింత లేదని, అయితే వాటిని పరిరక్షించడానికి బిజెపి ప్రయత్నిస్తోందని ఆయన అన్నారు. 'కాంగ్రెస్ కేవలం అధికారాన్ని చేజిక్కించుకోవడానికే ఓటర్ల జాబితాల సవరణను వ్యతిరేకిస్తోంది... నేను ఏ మంచి పని చేయాలనుకున్నా వారు వ్యతిరేకిస్తారు... బిజెపి ప్రభుత్వం ఎల్లప్పుడూ అస్సామీ ప్రజల గుర్తింపు, భూమి, ఆత్మగౌరవం, ఉనికిని పరిరక్షించడానికి కృషి చేస్తుంది,' అని మోదీ ఉద్ఘాటించారు. కాంగ్రెస్ ఈ దేశానికి అనేక తప్పులు చేసిందని, గత 11 సంవత్సరాలుగా వాటిని సరిదిద్దుతున్నప్పటికీ అన్నింటినీ గాడిలో పెట్టడానికి ఇంకా చాలా పని మిగిలి ఉందన్నారు. 'మా ప్రభుత్వం డాక్టర్ భూపేన్ హజారికాకు భారతరత్న ప్రదానం చేసినప్పుడు, కాంగ్రెస్ ఆ నిర్ణయాన్ని బహిరంగంగా వ్యతిరేకించింది. దాని జాతీయ అధ్యక్షుడు 'మోదీ నాట్యం చేసే, పాటలు పాడే వారికి భారతరత్న ఇస్తున్నారు' అని వ్యాఖ్యానించారు, ఇది భూపేన్ దాకు, అసోం ప్రజలకు అవమానం' అని మోదీ అన్నారు. శతాబ్దాల క్రితం అహోం రాజవంశం కాలంలో ఉన్నంత శక్తివంతంగా అసోంను తీర్చిదిద్దడమే బిజెపి ప్రభుత్వ లక్ష్యమని ఆయన అన్నారు. నమ్రూప్ యూరియా ప్లాంట్ స్థానిక రైతులకు మద్దతు ఇస్తుందని, అసోం యువతకు వేలాది ఉద్యోగాలను సృష్టిస్తుందన్నారు. నమ్రూప్ ఎరువుల కర్మాగారం దేశ పారిశ్రామిక వృద్ధికి ప్రతీకగా నిలుస్తుందని, ఈ ప్లాంట్‌ను ఆధునీకరించడానికి, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారాలు కనుగొనడానికి కాంగ్రెస్ ప్రయత్నాలు చేయకపోవడం విచారకరం అని ఆయన అన్నారు. సాంకేతికత పాతబడిపోవడంతో నమ్రూప్‌లో ఒక్కొక్కటిగా యూనిట్లు మూతపడ్డాయని ప్రధాని అన్నారు. సంవత్సరానికి 12.7 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యం ఉన్న ఈ ప్లాంట్‌లో ఉత్పత్తి ప్రారంభమైన తర్వాత, సరఫరా గొలుసు మరింత సమర్థవంతంగా మారుతుందని, లాజిస్టిక్స్ ఖర్చులు గణనీయంగా తగ్గుతాయని ఆయన అన్నారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఇటీవల భారతదేశాన్ని సందర్శించినప్పుడు, ఆయనకు అసోం నల్లటి టీని బహుమతిగా ఇచ్చామని మోదీ సభకు తెలిపారు. ఈశాన్య ప్రాంతం అభివృద్ధి లేకుండా భారతదేశం అభివృద్ధి చెందదని పేర్కొన్న మోదీ, అసోం అభివృద్ధి వేగాన్ని ప్రజలు ప్రశంసిస్తున్నారని అన్నారు. 'అభివృద్ధి ఫలాలు దేశంలోని మారుమూల ప్రాంతాల్లోని పేదలకు చేరాయి. మా అవిశ్రాంత ప్రయత్నాల వల్ల 25 కోట్ల మంది ప్రజలు పేదరికం నుండి బయటపడ్డారు. భారతదేశంలో ఒక నూతన మధ్యతరగతి వర్గం సృష్టించబడింది' అని మోదీ నొక్కి చెప్పారు. రైతుల కోసం చేపట్టిన అనేక చర్యలను హైలైట్ చేస్తూ, దేశంలో యూరియా ఉత్పత్తిని 2014లో 225 లక్షల మెట్రిక్ టన్నుల నుండి 306 లక్షల మెట్రిక్ టన్నులకు పెంచామని ఆయన అన్నారు. మనం మన మాతృభూమిని రక్షించుకోవాలని మనకు ఫలాలను ఇస్తుందని మోదీ అన్నారు.




## ఆర్ఎస్ఎస్‌ను రాజకీయ కోణంలో చూడొద్దు: మోహన్

**కోల్‌కతా:** రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) ను రాజకీయ కోణంలో చూడటం అతిపెద్ద తప్పు అని, సంఘ్ అధ్యక్షుడు మోహన్ భగవత్ అన్నారు. బీజేపీతో ఆర్ఎస్ఎస్‌ను పోల్చడంతో ప్రజల్లో తరచు అపార్థాలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా కోల్‌కతాలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. నైతిక విలువలు, సామాజిక బాధ్యత కలిగిన సంఘ్‌సేవక్‌లను సృష్టించడం ద్వారా ఆరోగ్యకరమైన సమాజాన్ని, బలమైన దేశాన్ని నిర్మించడానికి తాము నిరంతరం కషి చేస్తున్నామని అన్నారు. ఆర్ఎస్ఎస్ గురించి తమ అభిప్రాయం చెప్పే హక్కు దేశంలో ప్రతివ్యక్తికి ఉందని, కానీ అది వాస్తవికత ఆధారంగా ఉండాలని భగవత్ అన్నారు. సంఘ్‌కు ఎలాంటి రాజకీయ అజెండా లేదని, దేశమే తొలి ప్రాధాన్యం అన్న సిద్ధాంతాన్ని పాటిస్తూ పేదల జీవితాల్లో మార్పు తెచ్చేందుకు తమ కార్యకర్తలు పనిచేస్తున్నారని ఆయన చెప్పారు. విశ్వగురువుగా మారుతుందన్న విశ్వాసం వ్యక్తంచేశారు.

## క్రమపద్ధతిలో 'నరేగా' అంతం: ప్రశాంత్ భూషణ్

**న్యూఢిల్లీ:**కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం స్థానంలో 'వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ (గ్రామీణ్) (విబి–జి రామ్ జి) బిల్లును తీసుకురావడం ద్వారా దానిని ఆచరణాత్మకంగా అంతం చేసిందని సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ అన్నారు. శనివారం ఆయన లాతూరులో పిటిఐతో మాట్లాడుతూ పథకం పేరు మార్చడమే కాకుండా, మొత్తం స్వరూపాన్నే మార్చేశారన్నారు. 'ఎంజిఎన్ఆర్ఇజిఎ ఒక హక్కుల ఆధారిత పథకం, దీని కింద ప్రతి గ్రామీణ కుటుంబానికి కనీస వేతనాలతో కనీసం 100 రోజుల పాటు పని చేసే ప్రాథమిక హక్కు ఉండేది. ప్రభుత్వంతో డబ్బు పొందేది. కానీ ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం దానిని తొలగించింది. ఇది ఇప్పుడు బడ్జెట్ ఆధారితంగా ఉంటుందని ప్రభుత్వం చెప్పింది' అని భూషణ్ అన్నారు. ఇప్పుడు తాము ఎంత శాతం అందిస్తామో, రాష్ట్రం ఎంత శాతం అందిస్తుందో తామే నిర్ణయిస్తామని ప్రభుత్వం చెబుతోందని, దీంతో ఈ పథకాన్ని క్రమపద్ధతిలో అంతం చేసినట్లు కనిపిస్తోందన్నారు. గతంలో కూడా ప్రభుత్వం దీనిపై వివిధ రకాలుగా ఆంక్షలు విధించిందన్నారు. డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ (డిపిడిపి) చట్టం, భారతీయ న్యాయ సంహితలోని దేశద్రోహ నిబంధనపై కూడా ఆయన ఆందోళన వ్యక్తం చేస్తూ, ఇటువంటి చర్యల ద్వారా అనేక పరిమితులు విధించబడుతున్నాయన్నారు. అంతేకాకుండా, ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడే వారిపై ఉపా, పిఎంఎల్ఎ కింద లేదా ఏదో ఒక విధంగా కేసులు పెడుతున్నారని, వారు (కేంద్ర ప్రభుత్వం) వాక్ స్వాతంత్ర్యాన్ని అంతం చేయడానికి ప్రయత్నం చేస్తున్నారని, అయితే పూర్తిగా విజయం సాధించలేరన్నారు.






## జనం నోటిమాట

ఇదేమాట ప్రతీచోట
పదేపదే అందాం
కమ్యునిజం మనబతుకులు
మార్చేస్తుందందాం


బతుకుబాటలో కార్పొరేట్
శక్తులె అడ్డంకందాం
నడుంకట్టి కలిసెత్తే
వాటి పనెంతందాం
పేర్లుమార్చి ప్రజలనే మార్చె
కథలు విందాం
పాలకవర్గాల ముసుగు
చీల్చి ఎండగడ్దాం

ఓట్లచోరు బడా చోరు
ఖబర్దారనందాం
ప్రజాకోర్టులో మిమ్మిక
శిక్షిస్తామందాం
ఎర్రజండె జనశక్తికి
మారుపేరనందాం
శ్రమజీవుల సంతకమీ
ఎర్రజండెనందం

పోరుబాటలో జనులకు
ఏంపోయేదందాం
పోతే తలరాతల సం
కెళ్ళు పోతవందాం
చీకటి తెరలను చీల్చే
మార్గమిదేనందాం
నూరేళ్ళబట్టి పోరుచరిత
సాక్ష్యం ఉందందాం

**సిపిఐ వందేళ్ల పండుగ సందర్భంగా ఏటుకూరి ప్రసాద్ కవిత**

# కమ్యూనిజం.. సాహిత్యం..
# 'ఏటుకూరి' రెండు కళ్లు



నిజమైన కమ్యూనిస్టు... సిసలైన మార్క్సిస్టు భావాలున్న సాహితీవేత్త ఏటుకూరి ప్రసాద్. భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) వందేళ్ల పండుగ సందర్భంగా, తొంభై వసంతాలు పూర్తి చేసుకున్న నవయువకుడు, కమ్యూనిస్టు రచయిత ఏటుకూరి గురించి మాట్లాడుకోవడం అవసరం. విస్తారమైన ఆయన రచనలకు ప్రస్తావనే చిన్న పుస్తకమవుతుంది. విశ్లేషిస్తే ఒక గ్రంథమే. సమాజం మార్పు కోసం పోరాటం చేసే శక్తులు ఎన్నోరకాలు. వాటిలో అత్యంత ప్రభావవంతమైనది పాట. మాటలంటే శబ్దం మాత్రమే, కానీ ఆ శబ్దానికి హృదయం జతకలిసి స్వర రూపం దాల్చినప్పుడు, అది మనిషి ఆత్మను కదిలించే అగ్ని రేఖగా మారుతుంది. అలాంటి అగ్ని రేఖలను ప్రతిసారీ మన ముందుకు తీసుకురాగలిగిన ఒక అభ్యుదయ, ప్రగతిశీల గేయ రచయిత ఏటుకూరి. ఆయన రాసిన ప్రతి పాటలో ఒక జ్వాల స్పష్టంగా కనిపిస్తుంది. అది కోపం కాదు.. నిరీక్షణ అంతకన్నా కాదు.. అది వెలుతురు పట్ల మనిషి చేసే శాశ్వత యాత్ర. ఏటుకూరి పదాలలో కలిసిన కార్మికుడి చెమట, అణగారిన వర్గాల గోస, క్షేత్రాలపై వంగిన రైతు వెన్నునొప్పి, అక్షరాల కోసం ఆకలితో మగ్గే పిల్లల ఆశ కనిపిస్తాయి. వినిపిస్తాయి. ఈ స్వరాలు సమాజం చెవుల్లో గుసగుసలుగా కాకుండా, కాలానికే సమర్పించిన ధైర్యమైన ప్రకటనలుగా భాసిస్తాయి. సామాజిక బతుకు చిత్రాన్ని ఆయన స్పష్టంగా ఆవిష్కరిస్తారు. జీవితం ఎంత కఠినమో, మనిషి ఎంత దృఢమో ఒకే పాదంలో తెలిపే సత్తా ఆయనది. ఏటుకూరి కలం అణచివేతను అలంకరించదు... దానికి వ్యతిరేకంగా గర్జిస్తుంది. తిరగబడిన మనిషి గొంతుని రాగాలతో బలపరుస్తుంది. పాటలలో కనిపించే ఉపమానాలు భూమ్మీద పరుగులు తీయకుండా, మనసుకి నేరుగా పూల రేకుల్లా తాకి, వెంటనే మంటలు ఎగిసే అగ్ని నెగళ్లుగా మారతాయి. ప్రగతిశీలతను ఆయన కేవలం నినాదికి పరిమితం చేయకుండా, ఒక జీవన విధానంగా భావించారు. ఆచరించారు. సమాజంలోని కుళ్లును చూసి ఆయన భయపడరు. వాటిని మాటలతో కుట్టి, పునర్నిర్మాణానికి దారులు చూపిస్తారు. ప్రతిఘటన సృష్టిస్తారు. కమ్యూనిజాన్ని నమ్మి, ఆచరించి, జీవితంలోభాగంగా మార్చుకున్నఏటుకూరి పలు అంశాలపై వెలిబుచ్చిన అభిప్రాయాలు...

**ప్రశ్న: ప్రస్తుతకాలంలో ఒక కవి లేదా రచయిత సిద్ధాంతాల పేరుతో పరిధిని కుదించుకుంటున్నాడని అనుకుంటున్నారా?**

**ఏటుకూరి:** లేదు. మనిషి సంఘజీవి. సమాజంలోని మార్పులను గమనిస్తూ ఉంటాడు. తన ఆలోచనలకు అనుకూలమైన మార్పులు ఉన్నప్పుడు సానుకూలంగా స్పందిస్తాడు. కవి కూడా అంతే. తన భావాలకు అనుకూలైన వాదాన్ని ఎంచుకుంటాడు. అస్తిత్వవాదం లేదా ప్రాంతీయవాదం... స్త్రీవాదం లేదా దళితవాదం... అన్నీ మార్పు కోరుకునే కవి ఎంపిక చేసుకున్న మార్గాలే. ఆయా రచనలు సామాజిక మార్పును ప్రతిబింబిస్తాయి. ప్రతి రచయితా తాను ఎవరి కోసం రాయాలని అనుకుంటాడో, వారిని దృష్టిలో ఉంచుకుంటాడు. తన ఇష్టాయిష్టాలను పంచుకుంటాడు. సమాజంలో పలు రూపాల్లో చోటు చేసుకుంటున్న మార్పులను స్వాగతిస్తాడు. అ మార్పు ఏదైనా 'ఇజానికి' దగ్గరగా ఉండవచ్చు. మార్పులకు స్పందించని వ్యక్తి కాడు.. కాలేడు. నిజమైన కవి తన రచనలతో తదాప్యం చెందుతాడు. తన భావాలకు అనుగుణంగా రచనలు చేస్తాడు. ఇందులో తప్పేమీ లేదు. కుదించుకోవడం అనే ప్రశ్న ఉత్పన్నం కాదు.

**ప్రశ్న: కవుల్లో ఇన్ని వర్గాలు.. పరస్పర ద్వేషాలు ఎందుకు?**


**ఏటుకూరి:** కవిత్వానికి సరైన నిర్వచనం లేదు. కొందరు కాళిదాసు గొప్పకవి అంటే, మరికొందరు భారవి పేరు చెప్తారు. కాలానుగుణంగా ఇష్టాలు మారుతాయి. ప్రభావాలు మారుతాయి. సద్విమర్శలు చేసుకోవడం... సమీక్షించుకోవడం... తప్పొప్పులను సరిచేసుకోవడం వంటి లక్షణాలు ఆరోగ్యకరమైన పోటీకి అనువైన వాతావరణాన్ని సృష్టిస్తాయి. కవులు గ్రూపులు కట్టడం, ద్వేషించుకోవడం కొత్తేమీ కాదు. ఒకడి ఎదుగుదల చూసి మరొకడు ఈర్ష్యపడడం, విమర్శించడం, నీచంగా చూడడం అనాదిగా వస్తున్నదే. రాజకీయాలు సామాజిక చైతన్యాన్ని శాసిస్తున్నప్పుడు, ఈ పోకడలు వెర్రితలలు వేస్తాయి. ఫ్యూడలిజంలో మతం చైతన్య రూపంగా ఉండేది. క్రమంగా ఆ స్థానాన్ని రాజకీయాలు ఆక్రమించాయి. సామాజిక అంశాలన్నీ రాజకీయాంశాలుగా మారిపోయాయి. కవులు కూడా తమకు నచ్చిన లేదా తమ ఆలోచనలకు దగ్గరగా ఉన్న రాజకీయ పార్టీవైపు మొగ్గు చూపుతున్నారు. ఆ భావజాలంతోనే రచనలు చేస్తున్నారు. రాజకీయ అంశాలే వర్గాలుగా విడిపోవడానికి, ద్వేషాలు పెరగడానికి కూడా కారణం. అందుకే, కవులను పీతలతో పోలుస్తారు. ఒకటి పైకి ఎక్కడానికి ప్రయత్నిస్తే, మరో పీత దానిని కిందకు లాగుతుంది.

**ప్రశ్న: సాహిత్య ధోరణుల్లో మార్పులను ఏ విధంగా చూస్తారు?**

**ఏటుకూరి:** కాలగమనంలో మార్పు అనివార్యం. ఎక్కువ మంది ప్రజల్లో వచ్చే మార్పే సామాజిక మార్పును నిర్దేశిస్తుంది. ఈ మార్పును కోరుకునే కవులు వేరువేరు పంథాలు ఎంచుకోవడమే సాహిత్య ధోరణుల్లో మార్పులకు కారణం. సమాజంలో గుణాత్మక మార్పు తీసుకురాగల శక్తులను గుర్తించాలి. కొందరు కార్మికులతోనే సాధ్యమని అంటే, మరి కొందరు రైతుల పక్షం వహిస్తారు. ఇంకొందరు మధ్యతరగతి వర్గమే మార్పును నిర్దేశిస్తుందని నమ్ముతారు. తమతమ అభిప్రాయాల మేరకే రచనలు చేస్తారు. ఏ రచనైతే మార్పును ప్రభావితం చేయగల శక్తులను కదిలిస్తుందో... చైతన్యాన్ని రగిలిస్తుందో... సరికొత్త మార్గాల అన్వేషణకు పురిగొలుపుతుందో అదే ఎక్కువ కాలం నిలుస్తుంది. మార్గదర్శకం చేస్తుంది.

**ప్రశ్న: కవులు తమ పంథాను మార్చుకోవడంపై మీ అభిప్రాయం?**

**ఏటుకూరి:** సాహితీ ప్రస్థానంలో కవులు తమ మార్గాలను మార్చుకోవడం అనివార్యం కాకపోయినా, ఆశ్చర్యకరం మాత్రం కాదు. ఉదాహరణకు మహాకవి శ్రీశ్రీనే తీసుకుందాం. ఆయన తొలుత భావకవి. కాలగమనంలో, ప్రపంచ మార్పును తనదని భావించాడు. ప్రగతిశీల, అభ్యుదయ కవిగా తనను తాను మార్చుకున్నాడు. కవిత్వ సృజనలో వ్యక్తి నేపథ్యానిది కీలక పాత్ర. సామాజిక పరిస్థితులు లేదా సామాజిక నేపథ్యం సహజంగానే వ్యక్తి నేపథ్యాన్ని ప్రభావితం చేస్తాయి. ఇంతకు ముందు చెప్పినట్టు, సాహిత్యంలో రాజకీయాల వాతావరణం తనదైన ముద్ర వేయడం మొదలుపెట్టింది. ఆ క్రమంలోనే శ్రీశ్రీ ప్రపంచ పరిస్థితులను గమనించాడు. దోపిడీని గుర్తించాడు. ఆధిపత్య ధోరణులను పరిశీలించాడు. వాటిని ఎదిరించాడు. సామాజిక రుగ్మతలపై ధిక్కార స్వరం వినిపించాడు. అభ్యుదయ కవిగా తనను తాను ఆవిష్కరించుకున్నాడు. కాబట్టి, పంథాను మార్చుకోవడం.. భావజాలాన్ని మరల్చుకోవడం తప్పుకాదు. అయితే, ఈ మార్పు సమాజంపై ఎలాంటి ప్రభావం చూపుతున్నదనేది కీలకం.



**ప్రశ్న: ఆయుధాలు ధరించి పోరాటం సాగించాలనే సిద్ధాంతాన్ని ప్రచారం చేసే సాహిత్యం ఇప్పటికీ ప్రచారంలో ఉంది. కానీ, ఆ సాహిత్యాన్ని సృష్టించిన వారిలో చాలా మంది జనజీవన స్రవంతిలో చేరిపోతున్నారు. వారి ప్రభావం మాత్రం కొనసాగుతునే ఉంది. ఇది ఎంత వరకూ శ్రేయస్కరం?**

**ఏటుకూరి:** దీనికి కూడా దాదాపుగా ఇంతకు ముందు ఇచ్చిన సమాధానమే వర్తిస్తుంది. ఒక రచయిత ప్రభావంతో, మార్గాన్ని ఎంచుకున్నవారు, సదరు రచయిత మారినప్పుడు తాము కూడా ఎందుకు మారకూడదు? ఒక విషయాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడానికి, ప్రజా ఉద్యమాలను నిర్మించడానికి ఉపయోగపడే అనేక సాధనాల్లో లేదా మాధ్యమాల్లో సాహిత్యం కూడా ఒకటి. కేవలం పాటలు లేదా గాయాలు లేదా కవితలు లేదా మరే ఇతర ప్రక్రియలు మాత్రమే ప్రభావం చూపుతానుకోకూడదు. రకరకాల సామాజిక అంశాలు ఇందులో మిళితమై ఉంటాయి. వ్యక్తుల స్వీయ అనుభవాలు, ఎదుర్కొంటున్న పరిస్థితులు కూడా ఒక నిర్ణయం తీసుకోవడానికి కారణం కావచ్చు. ఇందులో సాహితీకారులను తప్పుపట్టకూడదు.

**ప్రశ్న: సాహిత్యం ఎప్పుడూ సమాజానికి అద్దం మాదిరి ఉండాలన్న అభిప్రాయంతో ఏకీభవిస్తారా?**

**ఏటుకూరి:** ఇది ఒక కోణం మాత్రమే. సమాజానికి అద్దం అంటే ఏమటి? సమాజ రుగ్మతలను ఉన్నవి ఉన్నట్టు చూపించడమే కదా.. ఒకప్పుడు ఇదే అభిప్రాయం అందరిలోనూ వేళ్లానుకొని ఉండేది. కానీ, కేవలం ఆ కోణంలోనే ఆలోచించి, అక్కడికే పరిమితమైతే సాహిత్యం సంపూర్ణతను సంతరించుకోదు. కేవలం సమస్యలను ఏకరువు పెట్టినంత మాత్రాన రచయిత బాధ్యత తీరిపోదు. పరిష్కారాలను కూడా ప్రస్తావించగలగాలి. పాఠకులు ఎంత వరకూ ఆ మార్గాన్ని లేదా పరిష్కారాన్ని అనుసరిస్తారన్నది వారివారి ఆలోచనలు, అభిప్రాయలపై ఆధారపడి ఉంటుందనే వాదన వినిపించవచ్చు. కానీ, రచయిత దార్శనికతను ప్రదర్శించగలుగుతాడు కాబట్టి, పరిష్కార మార్గాలను కూడా చెప్పగలగాలి. అప్పుడే ఆ రచనలకు సార్థకత చేకూరుతుంది. రచయితల్లో కొందరు సమస్యలు మాత్రమే ప్రస్తావించారు. మరికొందరు సమస్యలను ప్రస్తావించడంతోపాటు, కారణాలను కూడా విశ్లేషించి, వివరిస్తారు. కొద్ది మంది ఈ రెండు అంశాలతోపాటు, పరిష్కార మార్గాలను చూడా సూచిస్తారు. ఈ మూడో రకమైన రచయితలే సమాజానికి మార్గదర్శకం చేయగలుగుతారు.

**ప్రశ్న: ప్రగతిశీల రచయితలంతా కమ్యూనిస్టులు కావాల్సిన అవసరం లేదు. కానీ, కమ్యూనిస్టు రచయితలందరూ ప్రగతిశీలవాదులే అంటారు కదా?. ఒక రచయితకు కమ్యూనిస్టు భావజాల అవసరం ఎంత వరకూ ఉంటుంది?**

**ఏటుకూరి:** కమ్యూనిస్టు పార్టీ మాత్రమేకాదు... అసలు రాజకీయాలు ఏవీ ఆకాశం నుంచి ఊడిపడలేదు. ఫ్యూడల్ వ్యవస్థ నుంచి సామాజిక చైతన్యం వరకూ ఎన్నో అటుపోట్లకు మానవజాతి గురైంది. రాచరికం ఉన్నప్పుడు శాస్త్రం, కళలు, చట్టాలు, సాహిత్యం వంటివన్నీ మతం చుట్టూ ఉండేది. పెట్టుబడిదారీ వ్యవస్థ బలపడుతున్నప్పుడు డబ్బు ప్రధాన భూమిక పోషిస్తున్నది. ఈ రెండు వ్యవస్థల్లోనూ దౌర్జన్యాలు, అణచివేతలు ఉన్నాయి. సాహితీకారులు సమాజం నుంచే వచ్చారు. ఈ బాధలు వారు కూడా అనుభవించి ఉంటారు. కనీసం ఆ సమస్యలేమిటో వారికి తెలుసు. ఒక రకంగా, కమ్యూని స్టు లేదా వామపక్ష భావజాలం ఉన్న రచయితలు సమాజాన్ని మరింత లోతుగా తరచి చూశారు. విశ్లేషించారు. నేను అదే పంథాను అనుసరించాను. జనం మధ్య ఉండడానికి ప్రాధాన్యం ఇచ్చాను. మానవత్వమే మార్క్సిజం లక్షణం. కేంద్ర సాహిత్య అకాడెమీ బహుమతి పొందిన రచయితల్లో అత్యధికులు వామపక్ష భావజాల రచయితలే. ఇది చాలు... కమ్యూనిస్టు రచయిత లు ఏ విధంగా సమాజంతో మమేకమవుతారో చెప్పడానికి.

**ప్రశ్న: రచనలకు ఏవైనా ప్రాథమిక లక్షణాలు ఉంటాయా?**

**ఏటుకూరి:** ఉన్నాయి. ఏ రచనకైనా సుందరీకరణ, వాస్తవికత, తాత్విక చింతన అనే మూడు లక్షణాలు ఉండాలి. ఒక విషయాన్ని పొడిపొడి మాటల్లో చెప్తే ప్రజల్లోకి బలంగా వెళదు. అందుకే, భావ సౌందర్యంతోపాటు పద సంపదను కూడా జోడించాలి. ఈ రెండు లక్షణాలకు తాత్వికత తోడైతే పాఠకుడు చదివి ఆనందించడమేకాదు.. ఆలోచిస్తాడు కూడా. ప్రతి రచనా ఇదే విధంగా ఉండాన్న నిబంధన లేదు. రచయిత సర్వస్వతంత్రుడు. అయితే, సమాజానికి ఉపయోగపడినప్పుడే రచనలకు సార్థకత చేకూరుతుంది.

**ప్రశ్న: నేటి తరం రచయితలకు లేదా సాహిత్యవేత్తగా మారాలనుకునే ఔత్సాహికులకు మీ సందేశం ఏమిటి?**

**ఏటుకూరి:** సందేశం అనలేకపోయినా, సలహాలు, సూచనలు ఇస్తాను. సమాజంలో జరిగిన ప్రతి సంఘటనకూ స్పందించాలన్న తాపత్రయం చాలా మంది కనిపిస్తున్నది. అందుకే, ఒక సంఘటన జరిగిన వెంటనే, దానిపై రాకపోతే ఎవరు ఏమనుకుంటారోనని భయపడుతున్న రీతిలో ఏదో ఒకటి రాసేస్తున్నారు. ఇక 'క్యాలెండర్ రచయితలు' కూడా పుట్టుకొస్తున్నారు. జాతీయ, అంతర్జాతీయ దినాల జాబితాను ముందు పెట్టుకొని, ఆయా సందర్భంపై రచనలు చేస్తున్నారు. రాసినవన్నీ ప్రచురించబడాలని, అది కూడా చాలా త్వరగా జరగాలని కోరుకుంటున్న వారు పెరుగుతున్నారు. ఇది సరైన విధానం కాదు. రాసిన దానిని ఒకటికి పదిసార్లు సరి చూసుకోవాలి. శైలిపై దృష్టి పెట్టాలి. ఒక కవి రచనకు, అచ్చయిన రచనకు మొదట్లో వాళ్ళు రాసు కున్న రచనకు చాలా తేడాలుంటాయి. ఇది నేను కరుణశ్రీతో కలిసి ఏసి కాలేజ్లో పనిచేస్తున్నప్పుడు గమనించా. ఆ ఆలోచనతో తెలుగు కవులు వాళ్ళ రచనల్లో వాళ్ళ చేతి రాతతో మొదటి ప్రతిగా కొట్టివేతలు, మార్పులు, చేర్పులు ఇవ్వన్నీ ఉన్నటువంటి వాటిని సేకరిస్తే బావుంటుందనిపించేది. ఆ దిశగా ప్రయత్నం చేసి గురజాడ 1862 నుంచి 1962 యాకూబ్ వరకు 110 మంది ప్రసిద్ధులైన కవుల చేతిరాతల సంకలనాన్నియామిజాల ఆనంద్‌తో కలిసి 'పొయెట్రీ వర్క్‌షాప్' రూపంలో తీసుకొచ్చా. అది చాలా ప్రజామోదం పొందింది. ప్రముఖ రచయితలు తాము రాసుకున్నదానిని ఎన్నిసార్లు సవరించారో... ఎన్ని కొట్టివేతలు... దిద్దుళ్లు ఉన్నాయో అందులో కనిపిస్తుంది. కాబట్టి, రాసిన దానిని సరి చేసుకోవడం, దిద్దుకోవడం ప్రతి రచయితా అలవాటు చేసుకోవాలి. తాను రాసిందే గొప్ప అనుకోవడం తగదు. 'కాలాన్ని బట్టి మారండి. రాజకీయాల్లో మత ప్రవేశాన్ని ద్వేషించండి. అన్నీ చదివి సమాజానికి ఉపయోగపడే రచనలే చేయండి. పాములు, చీమలు ఉన్న ఈ సమాజం లో చీమలకు వత్తాసుపలకండి'... ఇదే ఈ తరం రచయితలకు నేను ఇచ్చే సూచన.

**– బిఎల్**

## ఈ వారం కవితలు

### శతాబ్ది సంబురం

సిపిఐ శతాబ్ది సమర సంబురం
వేదిక కానున్నది ఖమ్మం
వామపక్ష ఉద్యమ గుమ్మం

త్యాగాల సాళ్లు వేసి
పోరాటపు విత్తు చల్లి
మొలకలు మానులు జేసి
ఉద్యమాన్ని సాకి ఒరిగిన
అమరులైన వీరుల స్మృతి పథం

చారిత్రిక ఆనవాళ్ల గిరిజనం
భూగర్భ గనుల్లో ఎగిసిన పోరాటం
ప్రకృతి సంపదల నిలయం
నిరంతర ఉద్యమ పయనం
అడివమ్మ సిగన ఎగిసే అరుణ పతాకం
వామపక్ష గుమ్మమయ్యే మన ఖమ్మం

గిరిప్రసాద్ రజబ్అలీ కొమరయ్య
గంగులు నిలదీసిన విఠల్‌రావు
నినదించిన శేషగిరి
కదనాన కర్నాటి గర్జించిన గంగవరపు
పోరాటపు బరిలో ఒరిగిన యోధుల
త్యాగాలతో పుణితమైన పోరు భూమి
కమ్యూనిస్టు సమర నినాదమే ఖమ్మం

పల్లె పల్లెకు ఉందిగా పోరాటపు చరిత
వందేళ్ల సంబురాన ఇంటింటిపై
ఎగిరే ఎర్ర జెండా
ఊరువాడ కదులుతుంది ఎర్ర దండుతో
కదిలివచ్చే జనంతో
ఎరుపెక్కనున్న ఖమ్మం
భవిష్యత్తు పోరాటానికి
బాట చూపే సంబురం
శతాబ్ది సంబురాలు ఖమ్మంలో
జనవరి 18న జరుగుతున్న వేళ.

**– ఏనుగు వెంకటేశ్వరరావు**

### !! ఎర్రజెండ !!

ఎర్రజెండ ఎర్రజెండ ఎర్రెర్రని జెండా
పేదలకు అండగా వెలిసిన జెండా.
**!!ఎర్రజెండ!!**
కార్మిక కర్షక ఉద్యోగ ఉపాధ్యాయ
విద్యార్థి యువత మహిళా సమస్యలపై
పోరాటం చేసేది ఎర్రజెండా
హక్కులు సాధించేది ఎర్రజెండా
మాటలతూటలతో పాటలు అస్త్రాలతో
అవినీతి అక్రమాల నిలదీస్తూ..
కదిలినప్పుడు ఎర్రజెండా రెపరెపలు
విప్లవాల నినాదాలు
అరుణ సైన్యానికి ఉత్తేజమిచ్చే
సాధనాలు **!! ఎర్రజెండా!!**

గుడిసె గుడిసెకు గుండె గుండెకు
దగ్గరుండేది ఎర్రజెండా
సమస్యలుండే వరకు కొనసాగేదీ జెండా
సమ సమాజం స్థాపించేదీ జెండా
**!! ఎర్రజెండా!!**
**ఎస్.విజయ్ భాస్కర్**

## చదవాల్సిన పుస్తకం
# భారత కమ్యూనిస్టు పార్టీ చరిత్ర మార్గదర్శక సూత్రాలు

సమాజహితం కోరే వారందరూ కమ్యూనిస్టులే.. ఆర్థిక దోపిడీని వ్యతిరేకించే వారంతా కమ్యూనిస్టులే.. పోరాట బాటపట్టి, ఉద్యమాలతో మార్పును కోరుకునే ప్రతి ఒక్కరూ కమ్యూనిస్టులే. కమ్యూనిస్టు భావం.. నైజం అర్థం కావాలంటే, విస్తృత స్థాయి పఠనం అవసరం. ఈ అవసరాన్ని తీర్చడానికి భారత కమ్యూనిస్టు పార్టీ కేంద్ర అధ్యయన విభాగం 'భారత కమ్యూనిస్టు పార్టీ చరిత్ర మార్గదర్శక సూత్రాలు'ను సిద్ధం చేసింది. 1917 నుంచి 1929 వరకు సంబంధించిన మొదటి అధ్యాయానికి ఎం. ఫరూకీ, మొహిత్‌సేన్ ల సహాయంతో జి.అధికారి రూపకల్పన చేశారు. 1929 నుంచి 1941 మధ్యకాలానికి చెందిన రెండవ అధ్యాయాన్ని చిన్‌మోహన్ సెహనవిస్, 1942 నుంచి 1951 వరకు పరిణామాలతో కూడిన మూడవ అధ్యాయాన్ని అవతార్ మల్‌హోత్రా, 1951 నుంచి 1964 మధ్యకాలానికి చెందిన నాలుగవ అధ్యాయాన్ని మొహిత్‌సేన్‌లు రచించారు. ఇది భారత కమ్యూనిస్టు పార్టీ విపులమైన చరిత్రగా చెప్పలేకపోయినా, పార్టీ చరిత్రపై అవగాహన కల్పించడానికి ఖచ్చితంగా ఉపయోగపడుతుంది. పార్టీ నాయకులు, కార్యకర్తలతోపాటు, కమ్యూనిజం పట్ల ఆసక్తి ఉన్నవారు తప్పక చదవాల్సిన పుస్తకం ఇది. అంతేకాదు, కమ్యూనిజం పట్ల వ్యతిరేకతను పెంచుకున్న వారు సైతం దీనిని చదివి, వాస్తవాలను తెలుసుకోవాలి. '1925 కాన్పూరు సమావేశాన్ని పార్టీ ఆవిర్భావంగా పరిగణించాం. త్యాగాలు, పోరాటాలతో నిండిన మహోజ్వల చరిత్ర అది. భారత స్వాతంత్ర్య పోరాట కార్యక్రమాన్ని ముందుకు తీసుకుపోయిన చరిత్ర అది. వర్గపోరాట పునాదిపై శ్రమజీవుల ప్రజా సంఘాలను నిర్మించిన గొప్ప చరిత్ర అది. మార్క్సిజం–లెనినిజం సిద్ధాంతాన్ని శ్రామికవర్గ అంతర్జాతీయతకు వ్యాప్తి చేసిన సోవియట్ యూనియన్ మహత్తర విజయాలను ప్రచారం చేసిన మహోజ్వల చరిత్ర అది. బ్రిటిష్ సామ్రాజ్యవాదుల, పెట్టుబడిదారీ భారతదేశ పాలకుల ఘోర నిర్బంధాన్ని తట్టుకొని సిపిఐ నిలబడింది. కార్మికవర్గం, శ్రమజీవుల యితర విభాగాలకు సేవచేసిన అపూర్వ చరిత్ర దానికి వున్నది' అంటూ కమ్యూనిజం గురించి, ఈ పుస్తకం గురించి కేంద్ర కమిటీ అధ్యయన విభాగం 'గమనిక'లో చెప్పకనే చెప్పింది. 'గయ కాంగ్రెసు మహాసభలో పంపిణీ చేసిన భారత జాతీయ కాంగ్రెసు కార్యాచరణ కార్యక్రమాన్ని కూడా 1922 ఆఖరు నాటికి ఎంఎన్ రాయ్ తయారు చేశారు. ఈ కార్యక్రమంలో సంపూర్ణ రాజకీయ స్వాతంత్ర్యం, భూస్వామ్య విధానం రద్దు, వయోజన ఓటింగ్ హక్కు



డిమాండ్లను సరిగానే లేవనెత్తినప్పటికి కొన్ని ఒంటెత్తువాద సూత్రీకరణలున్నాయి. ఉదాహరణకు బ్రిటిష ఆస్తులను జాతీయం చేయాలని పిలుపిచ్చే బదులు ప్రధానమైన రంగాలలో ఉత్పత్త, పంపిణీ, మారకం (భూమి, గనులు, ఫ్యాక్టరీలు, రైల్వేలు మొదలైనవి) స్వాధీనం చేసుకోవాలని సూచించటం జరిగింది. అలాగే అన్ని పెద్ద ఫ్యాక్టరీలలో కార్మికుల కంట్రోలు, కార్మికుల కౌన్సిల్‌ల నినాదాన్ని అపరిపక్వంగా లేవనెత్తటం జరిగింది. దాదాపు అదే సమయంలో రాసిన మేము కోరేదేమిటి? అన్న పుస్తకంలో కూడ జాతీయ విముక్తి పోరాటానికి కార్మికరైతాంగ ఉద్యమాన్ని పోటీ పెట్టి రాయ్ తన ఒంటెత్తు పంథాను ముందుకు తెచ్చారు' అంటూ మొదటి దశ ముగుస్తుంది.1922–1924ల మధ్య పెట్టిన ఫెషావర్ కుట్రకేసులు, కమ్యూనిస్టుల బహిరంగ ప్రజాకార్యకలాపాల నిర్వహణకు చట్టబద్ధ పార్టీ నిర్మాణానికి అనేక అభిప్రాయాలను ముందుకు పెట్టడం, కాన్పూరు కుట్ర కేసు (1924), 1925 మార్చి ఏప్రిల్‌కి కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ కార్యవర్గ కమిటీ విస్తృత ప్లీనం సమావేశంలో భారతదేశంపై తీర్మానం ఆమోదం, 1925 డిసెంబరులో కాన్పూర్‌లో భారత కమ్యూనిస్టు పార్టీ సంస్థాపన సమావేశం వంటి కీలక ఘట్టాలను రెండవ దశ (1923–25)లో వివరించారు. మహత్తర అక్టోబర్ సోషలిస్టు విప్లవ భావాలు మనదేశంలో పరివ్యాప్తం కాకుండా నిరోధించలేమనే అభిప్రాయానికి బ్రి టిష్ సామ్రాజ్యవాదులు వచ్చారు. అందుకని అభివృద్ధి చెందుతున్న కమ్యూనిస్టు ఉద్యమాన్ని నాశనం చేసేందుకు నిర్బంధ యంత్రాంగాన్ని తయారు చేశారు. మూడో దశగా, 1942–1951 మధ్యకాలంలో జరిగిన ప్రజాయుద్ధం, స్వాతంత్ర్యానంతర తొలి సంవత్సరాల వివరణ ఉంది. ఇక చివరిదైన నాలుగో దశలో పునర్వ్యవస్థీకరణ నుంచి పార్టీ కార్యక్రమం ఆమోదం వర కూ ఘటనలను, పార్టీ ప్రస్థానాన్ని వివరిస్తారు. అదే వి ధంగా పార్టీ కార్యక్రమం నుంచి పాల్ఘాట్ మహాసభ వర కూ ఎన్నో అంశాలను జోడిస్తారు. ఈ నాలుగో దశలో చివరిగా (1961–1964) విజయవాడ మహాసభ నుం చి పార్టీ చీలిక వరకూ పరిణామాల క్రమం ఉంటుంది.

ఒకవైపు జాతీయ బూర్జువా వర్గం, రెండవవైపు సామ్రాజ్యవాదం మధ్య వైరుధ్యాలు అప్పటి సమాజంపై తీవ్ర ప్రభావం చూపాయి. ఆ పరిస్థితుల్లో, జాతీయ స్వాతంత్ర్యం జాతీయ ఆర్థిక వ్యవస్థల పటిష్టత, సమగ్రతల పట్ల ప్రజల ఆకాంక్ష గల పాత్రను కమ్యూనిస్టు పార్టీ పోషించింది.జాతీయ బూర్జువా వర్గ ద్విముఖ పాత్రను బయటపెట్టిన తీరు ఈ పుస్తకం చదివితే అర్థమవుతుంది. ఈ పుస్తకంలో పేర్కొన్న ఎన్నో సంఘటన లు, పంచుకున్న ఎన్నో అభిప్రాయాలు నేటి పరిస్థితుల కు కూడా అన్వయించుకోవచ్చు. అంతటి దార్శనికత కమ్యూనిస్టు సిద్ధాంతానికి ఉంది. పేద, ధనిక వర్గాల మధ్య నిత్యం జరిగే ఘర్షణలో, ప్రభుత్వాలు ఎప్పుడూ ప్రత్యక్షంగానో, పరోక్షంగానో దోపిడీ వర్గాలకే పెద్దపీట వేయడం కొత్తేమీ కాదు. ఒకవైపు సామ్రాజ్యవాదం, ఫ్యూడలిజం, రెండవ వైపు భారత ఆర్థిక అవసరాల మధ్య పెరుగుతున్న 'ఘర్షణలు, వైరుధ్యాలను' పార్టీ బహిర్గతం చేస్తునే ఉంది. వివిధ ఘర్షణలు, వైరుధ్యాలను ప్రజలకు తెలియచేస్తునే ఉంది. అదే సమయంలో, జరిగిన మంచిని, వచ్చిన మార్పును చెప్పడానికి పార్టీ ఏనాడూ సంకోచించలేదని ఈ పుస్తకం చదివితే తెలుస్తుంది. కమ్యూనిస్టు పార్టీ మార్గదర్శక సూత్రాలు ఏఏ అంశాల పునాదుల మీద ఏర్పడ్డాయో అవగతమవుతుంది. ఇది కమ్యూనిస్టులకు మాత్రమే పరిమితమైన పుస్తకం కానే కాదు. సామాజిక రుగ్మతల మూలాలను వెలికితీసి, పరిష్కార మార్గాలను సూచించే కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంతాల సమాహారం. ప్రగతిశీల సమాజాన్ని కోరుకుంటున్న ప్రతి ఒక్కరూ తప్పక చదవాల్సిన పుస్తకం. ఇది సిపిఐ వతవార్షికోత్సవ సందర్భంగా వెలువడిన ప్రచురణ.

**పుస్తకం పేరు**

భారత కమ్యూనిస్టు పార్టీ చరిత్ర మార్గదర్శక సూత్రాలు
కూర్పు: సిపిఐ కేంద్ర అధ్యయన విభాగం
వెల: రూ. 140

**ప్రతులకు**

నవచేతన పబ్లిషింగ్ హౌస్ గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్) జిఎస్ఐ (పోస్ట్), హైదరాబాద్: 500068. (నవచేతన బుక్ హౌస్ అబిడ్స్, సుల్తాన్ బజార్, బండ్లగూడ (నాగోల్) హైదరాబాద్, హన్మకొండ, కరీంనగర్, నల్లగొండ, ఖమ్మం శాఖల్లోనూ లభిస్తుంది).

## కుషాయిగూడ కోర్టులో జాతీయ లోక్ అదాలత్

**ప్రజాపక్షం/చర్లపల్లి :** జాతీయ లోక్ అదాలత్ కుషాయిగూడ జిల్లా కోర్టు ఆవరణలో జాతీయ, తెలంగాణ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్,జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్ఎన్ శ్రీదేవి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ లోక్ అదాలత్‌లో రాజీ పడదగిన కేసుల గూర్చి జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రెటరీ సీనియర్ సివిల్ జడ్జి పట్టు రవీందర్ ప్రసంగించారు. సివిల్, క్రిమినల్, ఎన్ఐ యాక్ట్, వాహన ప్రమాదం భీమా కేసులు, బ్యాంకు కేసులు పరిష్కరించబడ్డాయి. జిల్లా వ్యాప్తంగా 24 బెంచుల్లో ఇందులో 400 సివిల్ కేసులు, 21206 క్రిమినల్ కేసులు, ట్రాఫిక్ కేసులు పరిష్కరించామని, పరిహారంగా 80,45000 రూపాయలు వచ్చాయని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి బి.తిరుపతి,న్యాయమూర్తులు,కోర్టు,పోలీసు,బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తిరుప్పావై మహోత్సవంలో పాల్గొన్న రామచంద్రరావు, మురళీధర్‌రావు



**ప్రజాపక్షం/చర్లపల్లి :** దేవాలయ అభివృద్ధికి రామచంద్రరావు, మురళీధర్‌రావులు ఎంతో సహాయ సహకారాలు అందిస్తున్నారని శ్రీ రామనూజ సేవా ట్రస్టు చైర్మన్ డాక్టర్ ధనంజయ అన్నారు. ఆదివారం మౌలాలీ హౌసింగ్ బోర్డులోని గోదా శ్రీరంగగిరి దేవాలయంలో వైభవంగా నిర్వహిస్తున్న తిరుప్పావై మహోత్సవంలో బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు, జాతీయ నాయకులు మురళీధర్‌రావులు హాజరై గోదామాత పల్లకి సేవ అమ్మవారి ఊరేగింపులో పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య సంఘం సేవలు అద్భుతం




**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** ఆర్యవైశ్య సంఘం సేవలు అద్భుతమని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ కార్పొరేటర్ కొలను వీరేందర్ రెడ్డి అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని బాచుపల్లి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆర్యవైశ్య కుంటుంబాలకు వాల్యూమేడ్ ఆసుపత్రి వారి సహకారంతో 20 శాతం రాయితీని కల్పించారు. ఈ సందర్భంగా సుమారు 150 మంది ఆర్యవైశ్య కుంటుంబాలకు బాచుపల్లిలో మాజీ కార్పొరేటర్ కొలను వీరేందర్ రెడ్డి హెల్త్ రాయితీ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా వీరేందర్ రెడ్డి మాట్లాడుతూ ఆర్యవైశ్య సంఘం బాచుపల్లి ఆధ్వర్యంలో ఇలాంటి మంచి కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. ఆర్యవైశ్య కుటుంబాలు ఈ ఆసుపత్రి రాయితీని సద్వినియోగం చేసుకుని ఆరోగ్యంగా జీవించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం బాచుపల్లి అధ్యక్షులు నవీన్ కుమార్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత మెగా వైద్య శిబిరం ప్రారంభం



**ప్రజాపక్షం/కూకట్‌పల్లి :** వివేకానంద నగర్ డివిజన్ పరిధిలోని మాధవరం కాలనీలో ఆర్.ఎన్.సి హాస్పిటల్ వారి సౌజన్యంతో సీనియర్ నాయకులు తేళ్ల హరికృష్ణ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన మెగా ఉచిత వైద్య శిబిరాన్ని పిఎసి చైర్మన్ అరెకపూడి గాంధీ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ ఉచిత మెగా వైద్య శిబిరంలో 18 రకాల రక్త పరీక్షలు, బిపి, షుగర్, గైనకాలజీ, ఆర్థో, ఇసిజి, ఇఎన్‌టి, దంత పరీక్షలు, కంటి పరీక్షలు, ఎక్సరే, అర్హులైన వారికి ఉచిత కళ్ళ జోళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యం వ్యాపారంగా మారిన ఈ రోజుల్లో సామాజిక దృక్పథంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం అభినందించదగ్గ విషయమన్నారు. పరిసర ప్రాంత పేద ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. రోజువారి జీవనశైలీలో ప్రజలు ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని, దీనిని నివారించేందుకు గత ఆరు నెలలుగా నిరంతరంగా వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇది నాలుగో వారం నిర్వహిస్తున్న వైద్య శిబిరం అని తెలిపారు. వైద్యంతో పాటు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం గాంధీ డాక్టర్లను శాలువాతో ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నాయకులు నాయినేని చంద్రకాంత్‌రావు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరం సద్వినియోగం



**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** ఉచిత వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరు స్వదినియోగం చేసుకోవాలని ఘట్‌కేసర్ మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావనిజంగయ్య యాదవ్ అన్నారు. ఇడబ్ల్యుఎస్ కాలనీ వివేకానంద యువజన సంఘం ఆధ్వర్యంలో నీలిమ హాస్పిటల్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావనిజంగయ్య యాదవ్, మాజీ వార్డు సభ్యులు బర్ల దేవేందర్ ముదిరాజ్‌లు కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పావని జంగయ్య యాదవ్ మాట్లాడుతూ వివేకనంద యువజన సంఘం వారు నీలిమ హాస్పిటల్‌చే ఇంతటి మంచి కార్యక్రమం చేపట్టి దాదాపు 500 మందికి ఉచిత వైద్య సదుపాయాలు అందించటం చాలా సంతోషంగా ఉందని అన్నారు.ఉచితంగా పేద ప్రజలకు వైద్యం చేసి వారికీ 50శాతం డిస్కౌంట్ నీలిమ హాస్పిటల్ వారు కార్డును ఇస్తారని గర్భిణీ మహిళలకు నార్మల్ డెలివరీకి తక్కువ ఖర్చు అయ్యేలా వైద్యం అందిస్తారని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు ఆంజనేయులు,శశిధర్,నాగభూషణం,రవి,గోపాల్ గౌడ్,పావన్,వైద్యులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## బానిసత్వం వదలాలి



**ప్రజాపక్షం/బోడుప్పల్ :** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ లో అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి 357వ ఆదివారం జ్ఞానమాల కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అంబేద్కర్ ఆశయ సాధన సంఘం సభ్యులు అంబేద్కర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించి, ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా నత్తి మైసయ్య మాట్లాడుతూ దళిత, బహుజనులు స్వాతంత్రం వచ్చి 80 ఏళ్లు గడచిన అనుకున్న స్థాయిలో అభివృద్ధి చెందకపోవడం విచారకరమని, దీనికి ప్రధాన కారణం కొన్ని ఉన్నత వర్గాల గుప్పెట్లో బానిసలుగానే ఉండడం, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ స్ఫూర్తితో బానిసత్వాన్ని విడనాడి,ఉన్నత విద్యను అభ్యసించి, అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలనిఉన్నత విద్య ద్వారా విజ్ఞానాన్ని పొంది త మ బానిస సంకెళ్లను విడిపించుకోవాలని నత్తి మైసయ్య పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భూ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు బుగ్గ మైసయ్య, రాపోలు శ్రీరాములు, గరుగుల యాకయ్య, గుంటి శ్రీనివాస్, చిల్ల అంజయ్య, బెక్కం శివ, కంచి సతీష్, తదితరులు పాల్గొన్నారు.

## గాంధీ పేరు మార్చడం సరికాదు

**ప్రజాపక్షం /వికారాబాద్ :** దేశంలోని పేద గ్రామీణ ప్రజలకు ఉపాధి హామీ కల్పించిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పేరును మార్పు చేయడం సరికాదని డిసిసి జిల్లా అధ్యక్షులు ధారాసింగ్ అన్నారు. జిల్లా కేంద్రంలో ఉపాధిహామీ పథకం మహాత్మగాంధీ పేరును బిజెపి రద్దు చేసిన సందర్భంగా వికారాబాద్ జిల్లా కేంద్రాంలో జిల్లా డిసిసి అధ్యక్షుడు ధారాసింగ్ అధ్వర్యంలో ఎన్‌టిఆర్ చౌరస్తా నుండి మున్సిపల్‌లోని గాంధీపార్కులో ఉన్న మహాత్మగాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి, ధర్నా చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం కాంగ్రెస్ ప్రవేశ పెట్టిన మహాత్మాగాంధీ పేరు తొలగించడం కాదు అయన అశయాలకు అవమానపర్చవద్దన్నారు. ఈనిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేదుతమని అన్నారు. పథకం పేరును మార్చడంతో గ్రామీణ ప్రాంతలోఉన్న అభిమానం తగ్గదు అనిఅన్నారు. బిజేపిప్రభుత్వం ఇంతకన్న మంచి పథకం తెచ్చిపేద ప్రజలకు అందించాలని తెలిపారు.కేంద్ర ప్రభుత్వం తేచ్చిన ఐదు చట్టలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

# నాణ్యమైన విద్య అందించడమే మా ప్రభుత్వ లక్ష్యం

**మానవ విలువలు, సామాజిక చైతన్యం కలిగే విద్యను అందించేందుకు పాఠశాలలు కృషి చేయాలి**

**మెరిడియన్ వార్షికోత్సవ వేడుకల్లో మంత్రి శ్రీధర్‌బాబు**



**ప్రజాపక్షం/బోడుప్పల్ :** మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకురావడంతో పాటు మానవ విలువలు, సామాజిక చైతన్యం కలిగే విద్యను అందించేందుకు పాఠశాలలు కృషి చేయాలని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. ఆదివారం బోడుప్పల్ కార్పొరేషన్ సర్కిల్‌లోని మెరిడియన్ స్కూల్ అస్థిత్వ 4.0 పేరుతో వార్షికోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో పాటు వరంగల్ వెస్ట్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు కూడా ప్రైవేట్ విద్యా సంస్థల స్థాయిలోనే నాణ్యమైన విద్యను పొందేలా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుంది అని తెలిపారు. విలువలతో కూడుకున్న విద్యను అందించడంలో మెరిడియన్ స్కూల్ యాజమాన్యం కృషి ప్రశంసనీయమని అన్నారు. విద్యార్థులు ఆకట్టుకునే సాంస్కృతిక ప్రదర్శనలు చేసి ఆహూతులను అలరించారు. ఈ సందర్భంగా స్కూల్ డైరెక్టర్లు మాధురి, రాంగోపాల్ రెడ్డి, రాఘవేంద్ర రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు సాంస్కృతిక కార్యకలాపాలు, క్రీడలు, స్వీయరక్షణ, క్రమశిక్షణ తదితర అంశాలపై ప్రత్యేక శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. ప్రిన్సిపాల్ శైలజా రెడ్డి కూడా తమ విద్యాసంస్థ యొక్క విద్యా విధానాలను వివరించారు. ఈ కార్యక్రమంలో బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిషోర్ గౌడ్, మాజీ కార్పొరేటర్లు చందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


## బాలికలు అన్ని రంగాల్లో ముందుండాలి



**జిల్లా సంక్షేమాధికారి కాంతమ్మ**

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** బాల బాలికలు బాలురతో పాటు అన్ని రంగాల్లో ముందుండాలని, మైనార్టీ పిల్లల అభివృద్ధికి రెసిడెన్షియల్ పాఠశాలలు కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని మేడ్చల్ జిల్లా సంక్షేమాధికారి కాంతమ్మ అన్నారు. ఆదివారం మూడుచింతలపల్లి మున్సిపల్ జగ్గంగూడలోని మైనార్టీ రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలలో గత మూడు రోజులు నుంచి నిర్వహిస్తున్న ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన జోష్3 స్పోర్ట్స్ ఘనంగా ముగిశాయి. ఈ స్పోర్ట్స్‌లో అండర్ 14 విభాగంలో ఛాంపియన్‌గా వికారాబాద్, అండర్ 17 విభాగంలో, అండర్ 19 విభాగంలో ఛాంపియన్‌గా కుత్బుల్లాపూర్ నిలిచాయని ప్రిన్సిపల్ కృష్ణ తెలిపారు. అలాగే విజేతలకు ముఖ్య అతిథులు బహుమతులు అందజేశారు. రంగారెడ్డి ఆర్ఎల్‌సి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములు సహజమని ఓడిపోయామని బావన వదిలి వచ్చే సంవత్సరంలో నిర్వహించే ఆటల పోటీల్లో రెట్టించిన ఉత్సాహంతో పాల్గొనాలని పిలుపునిచ్చారు. అనంతరం ప్రిన్సిపల్ కృష్ణ మాట్లాడుతూ గత మూడు రోజులు నుంచి ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన ఆటల పోటీలను విజయవంతం చేసిన 12 స్కూళ్ల ప్రిన్సిపల్స్‌కు, పిడిలు, పిఇటీలు, ఇతర సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఆటల పోటీలను విజయవంతంగా పూర్తి చేయుట కు కృషి చేసిన మైనార్టీ ప్రిన్సిపల్ ఎం కృష్ణ, పాఠశాల ఉపాధ్యాయులను జిల్లా సంక్షేమాదికారి సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో డిఇ స్పూర్తి, మున్సిపల్ మేనెజర్ ఉషారాణి, శానిటేషన్ ఇన్స్‌పెక్టర్ మోహన్‌సింగ్, ఎడిఇ శ్రీధర్, రంగారెడ్డి జిల్లాలోని 12 స్కూళ్ల ప్రిన్సిపల్స్, పిడిలు. పిఇటీలు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ముగ్గురు పిల్లలతో సహా మహిళ అదృశ్యం



**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** తన ముగ్గురు చిన్న పిల్లలతో సహా ఓ మహిళ అదృశ్యమైన ఉదంతమిది. నేరేడ్‌మెట్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పుట్టపర్తి సత్యసాయి జిల్లా ధర్మవరం ప్రాంతానికి చెందిన గొల్ల దీప అలియాస్ పద్మ (32) తన భర్త వీరేష్‌తో ఈ నెల 1న గొడవ పడి మరుసటి రోజు తన 14 ఏళ్ల కుమారుడు అఖిల్, 5 ఏళ్ల కుమార్తె చైత్రవి, 4 ఏళ్ల కుమారుడు యశ్వంత్ కృష్ణలతో కలిసి సైనిక్‌పురి ప్రాంతంలో ఉండే బంధువుల ఇంటికి వచ్చింది. ఆ తర్వాత రెండు రోజులకు తన భర్త వద్దకు తిరిగి వెళుతున్నానంటూ బంధువులకు చెప్పి తిరుగు ప్రయాణమైంది. అప్పటి నుండి తన బార్య ఇంటికి చేరక పోవటంతో భర్త సైనిక్‌పురి వచ్చి వాకబు చేయగా ఈ నెల 4నే బయలు దేరిందని చెప్పటంతో ఇతర బంధువుల ఇళ్లల్లో వెతికినా ఫలితం లేక పోవటంతో భర్త వీరేష్ తనభార్య పిల్లల జాడ కోసం లిఖిత పూర్వకంగా ఫిర్యాదు ఇచ్చిన మేరకు కేసు నమోదు చేసుకొని మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# రొయ్యల కృష్ణమూర్తి మార్గంలో వెళ్దాం

**సిపిఐ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటపల్లి శంకర్**



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి నిబద్ధతతో పేద ప్రజలకు ఇళ్ల స్థలాలిప్పించటం, కార్మిక సమస్యల పరిష్కారం వంటి ప్రజా సమస్యల కోసం పోరాటాలు చేసిన కామ్రేడ్ రొయ్యల కృష్ణమూర్తి మార్గంలో వెళ్లటమే ఆయనకు మనమిచ్చే నిజమైన నివాళులని సిపిఐ మేడ్చల్ నియోజకవర్గ ఇంచార్జి తోటపల్లి శంకర్ అన్నారు. ఆదివారం జవహర్‌నగర్‌లోని గిరిప్రసాద్ నగర్‌లో జరిగిన రొయ్యల కృష్ణమూర్తి ప్రథమ వర్ధంతి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువజన సంఘం నుండి అంచెలంచెలుగా ఎదిగి సిపిఐ పార్టీ రాష్ట్ర సమితి సభ్యులుగా బాధ్యతలు నిర్వహించారన్నారు. తుది శ్వాస వరకు నిరంతరం ప్రజా సమస్యల కోసం పోరటాలు చేసారన్నారు. జవహర్‌నగర్‌లోని గిరిప్రసాద్ నగర్, సిపిఐ కాలనీనగర్, కీసర, మేడిపల్లి భూపోరాటాలతో పేద ప్రజలకు ఇళ్ల స్థలాలను ఇప్పించటంలో చురుకైన పాత్ర పోషించారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డ్ మెంబర్ రొయ్యల గిరిజా కృష్ణమూర్తి,గిరిజన సమైక్య జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శ్యామలా లత, వి. స్వరూప నాయక్, మహిళా సమాఖ్య జిల్లా ఉపాధ్యక్షురాలు మోతే రాజేశ్వరి గిరిప్రసాద్ నగర్ శాఖ కార్యదర్శి కొండ సత్యం సాగర్, సహాయ కార్యదర్శి సురేష్(నాని), సిపిఐ మం డల నాయకులు కె.కురుమయ్య, రవీంద్రచారి, మహిళా సమైక్య కాప్రా మండల ప్రధాన కార్యదర్శి కె.కవిత, బిసి సంఘం నాయకులు సూర వెంకటయ్య, సూర శీను, సిహెచ్ వెంకటేష్,ఆటో యూనియన్ నాయకులు సురేష్, లింగోజి, మహిళా సమైక్య నాయకురాలు ఫాతిమా, ఎ కవిత, శ్రీదేవి, రుక్కునయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎల్మకన్య గ్రామాభివృద్ధికి ఎన్ని నిధులైనా అందజేస్తాం

**ప్రభుత్వ చీఫ్ విఫ్ పట్నం మహేందర్‌రెడ్డి**



**ప్రజాపక్షం/తాండూరు :** తాండూరు మండల పరిధి ఎల్మకన్య గ్రామ అభివృద్ధికి ఎన్ని నిధులైన అందజేస్తానని తెలంగాణ శాసన మండలి ప్రభుత్వ చీఫ్ విఫ్ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. పంచాయతీ ఎన్నికల్లో ఎల్మకన్య గ్రామ పంచాయతీ సర్పంచ్ విజయం సాదించిన నరేష్ ఆదివారం ప్రభుత్వ చీఫ్ విఫ్ పట్నం మహేందర్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలుసుకున్నారు.ఈ సందర్భంగా పట్నం మహేందర్‌రెడ్డి సర్పంచ్ నరేష్‌ను శాలువతో సత్కరించారు.ఈ సందర్భంగా మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని పరిష్కరించాలని సూచించారు. గ్రామంలో మౌళిక సదుపాయల కల్పనకు ఎన్ని నిధులైన అందజేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వై. రాములు, రాజు, నరేష్, తదితరులు ఉన్నారు.

## కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

**ఎమ్మెల్యే కెపి వివేకానంద**

**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం అభివృద్ధే నా లక్ష్యమని బిఆర్ఎస్ ఎల్‌పి విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేకానంద అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని గాజులరామారం గ్రామంలో సుమారు రూ.47 లక్షల వ్యయంతో చేపట్టిన సిమెంటు రోడ్డు పనులకు స్థానిక ఎమ్మెల్యే కెపి వివేక్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వివేక్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలను కల్పించడమే బాధ్యతగా ముందుకువెళ్తున్నామన్నారు. నియోజకవర్గంలోని బస్తీలు, కాలనీలలో రహదారుల అభివృద్ధి చేయడం తద్వారా ప్రజలకు సౌకర్యవంతమైన రాకపోకలను కల్పించడమే అని తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను దశలవారీగా చేపడతామని, రాబోవు రోజుల్లో గాజులరామారం ప్రాంతాన్ని మరింతగా అభివృద్ధి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్ యాదవ్, కమలాకర్, నవాబ్ భాయ్, ఇమ్రాన్ బేగ్, మూసాఖాన్, మహేశ్, వెంకటేశ్, సుంకరి చందు, గోవర్ధన్, రాములు గౌడ్, హమీద్, శ్రవన్, జ్ఞానేశ్వర్, శ్రీశైలం, విజయ్ కుమార్, కిరన్, జగన్, వెంకటస్వామి, రవి, కృష్ణ, జీతయ్య పాల్గొన్నారు.



**అయోధ్యనగర్‌లో రామాలయ పనులు ప్రారంభం**

కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని జీడిమెట్ల డివిజన్ అయోధ్య నగర్‌లో నూతనంగా నిర్మించనున్న రామాలయం నిర్మాణంలో భాగంగా శిలా పనులను స్థానిక ఎమ్మెల్యే కెపి వివేకానంద ప్రారంభించారు. ఈ సందర్భంగా వివేక్ మాట్లాడుతూ శ్రీరామ చంద్ర ప్రభు ఆలయ నిర్మాణం సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసి భక్తులకు అందించాలని కమిటీ సభ్యులకు సూచించారు. ఆ స్వామివారి ఆశీస్సులతో ప్రజలంతా సుఖఃసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని వేడుకున్నారు. కార్యక్రమంలో నాయకులు మన్నెరాజు, కిషన్ రావు, ఏసు, సోమనర్సయ్య, ఉమేశ్, హరీష్, సత్యనారాయణ, శ్రీకాంత్, భాస్కర్, సిద్ధిరాములు, నదీమ్ రాయ్, జ్ఞానేశ్వర్, నరెందర్ రెడ్డి, నగేశ్, అరుణా రెడ్డి, గణేశ్, బలరాం, నల్ల ప్రసాద్, వేణు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో వర్గపోరు, ఎన్నికల్లో ముదిరిన వైరం

**ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వద్ద ప్లెక్సీల చించివేత**



**ప్రజాపక్షం/వికారాబాద్ :** కాంగ్రెస్ నేతల్లో నెలకొన్న వివాదాలు ముదిరి పాకాన పడ్డాయి. రెండు వర్గాల మధ్య నెలకొన్న లొల్లి పంచాయతీ ఎన్నికల సందర్భంగా మరింత రాజుకుంది. ఏడాది నుండి వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని అధికార పార్టీ నేతలు రెండుగా విడిపోయారు. వారి మధ్య నెలకొన్న వివాదాలు పలు సందర్భాల్లో బయటపడుతూనే ఉన్నాయి. ఇన్నాళ్లు పట్టణ కాంగ్రెస్‌లో రెండు వర్గాలు ఉండగా తాజాగా పట్టణ, మండల నాయకులు మధ్య వివాదం తలెత్తింది. పరిస్థితిని అంచనా వేసిన స్పీకర్ తన క్యాంపు కార్యాలయంలో పిలిపించి, ముఖ్య నేతలతో సమిక్షించినట్లు తెలుస్తుంది. ఈ నేపథ్యంలో కొంతమంది నేతలు కాంగ్రెస్ పార్టీని వీడలనే ఆలోచనకు వచ్చినట్లు ప్రచారం జరుగుతుంది. అధికార పార్టీలో నెలకొన్న గ్రూపు తగాదాలు అధికారులకు సంకటంగా మారుతున్నాయి. ఈ పరిస్థితి వికారాబాద్, తాండూర్ ఎక్కువగా కనిపిస్తుంది. గ్రూపు తగాదాలతో అటు మున్సిపల్ అధికారులు ఇటు పోలీస్‌లు సతమతవుతున్నారు.తమకు తెలియకుండా పట్టణంలో ఏ పని చేయకుడదని పార్టీ పట్టణ ముఖ్యనాయకుడొకరు కొంతకాలంగా అధికారులపై ఓత్తిడి చేస్తున్నారనే ప్రచారం జరుగుతుంది. అతని పెత్తనం ఏంటని మరికొంత మంది నేతలు అగ్రహం వ్యక్తం చేస్తున్నరు. పార్టీ నేతలు ఈ విషయాన్ని స్పీకర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. ఇంతకాలం ఓపిక పడుతూ ఇచ్చిన స్పీకర్ కూడా ఈ ముఖ్యనాయకుడిపై గుర్రగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇకపై ఎవరూ ఈ నేత మాట వినాల్సిన పని లేదని స్పీకర్ అధికారులకు పోలిస్‌లకు సూచించినట్లు సమాచారం, ఓ వర్గం నేత ఏర్పాటు చేసిన చేసిన ప్లెక్సిలను మరోవర్గం నాయకులు చింపేయడంతో వివాదం బట్టబయలైంది.సర్పంచు ఎన్నికల్లో మండల పార్టీ అధ్యక్షుని తల్లిని ఓడించడానికి , పట్టణ అధ్యక్షులు ,అతని అనుచరగనం ఇతర పార్టీలతో చేతులు కలిపారని మండల నేతలు ఆరోపిస్తున్నారు. శనివారం మండల పార్టీ అధ్యక్షులు ఎఐసిసి అధ్యక్షురాలు మీనాక్షినాటరాజ్‌కు ఫిర్యాదు చేశారు.అదివారం జరిగిన కాంగ్రెస్ ధర్నా కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు అయన అనుచరులు పాల్గోనలేరు అయన పార్టీ మరుతడని పట్టణంలో చర్చజరుగుతుంది.

## గడప గడపకు భారత రాజ్యాంగం

**మాజీ మున్సిపల్ చైర్మన్ కొండల్ రెడ్డి**



**ప్రజాపక్షం/ఘట్‌కేసర్:** ప్రజలోలలో శాస్త్రీయ ఆలోచన పెంపొందించే విధంగా స్ఫూర్తి ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో గడప గడపకు భారత రాజ్యాంగం కార్యక్రమం అభినందనీయమని పోచారం మున్సిపాలిటీ మాజీ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి అన్నారు. పోచారం జిహెచ్ఎంసి సర్కిల్ పరిధి అన్నోజిగూడలోని బోయపల్లి కొండల్ రెడ్డి కార్యలయంలో ఆదివారం మర్యాదపూర్వకంగా స్ఫూర్తి ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కుంటోళ్ళ యాదయ్య,ఆర్గనైజేషన్ సభ్యులు లంబ రాజు కలిసి కొండల్ రెడ్డికి భారత రాజ్యాంగం పుస్తకాన్ని అందించారు. ఈ సందర్భంగా కొండల్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలను మార్పు దిశగా 76వ భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ప్రతి ఇంటిలో భారత రాజ్యాంగం ఉండాలని స్ఫూర్తి ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో గడప గడపకు భారత రాజ్యాంగం చేపట్టడం మంచి పరిణామం అని అన్నారు, ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ ఆకిటి బాల్‌రెడ్డి, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

## పశువుల దొడ్ల ఏర్పాటుకు రెండెకరాల స్థలం కేటాయించాలి



**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** నేరేడ్‌మెట్ డివిజన్‌లో గేదెలు, ఆవుల పెంచుతూ పాడి పాల వ్యాపారంతో కులవృత్తిపై ఆధారపడి జీవనాలు కొనసాగిస్తున్న యాదవులకు ఆవులు, గేదెలు కట్టేందుకు గాను ప్రత్యేకంగా పశువుల ఒక ప్రాంగణంగా ఉండే దొడ్ల ఏర్పాటు కోసం ప్రభుత్వం రెండెకరాల స్థలం కేటాయించాలని నేరేడ్‌మెట్ యాదవ సంఘ ప్రతినిథులు కోరారు. ఆదివారం సంఘ ప్రతినిధులు పూలపల్లి సుందర్ యాదవ్, కావలి ఈశ్వర్ యాదవ్, పొనగంటి హరికృష్ణ యాదవ్, యాతం మంజుల యాదవ్‌లు మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిని కలిసి ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ రజకులకు దోబిఘాట్, గౌడ కులస్తులకు ఈతవనం, తాటివనం కోసం ప్రభుత్వం కేటాయించిన విధంగా స్థలాన్ని కేటాయించాలన్నారు. ఆవులను కట్టేందుకు ఏర్పరచుకొనే కొట్టాలు, దొడ్లు పశువుల వ్యర్థాలతో గోబర్ గ్యాస్ ఉత్పన్నం చేసుకోవచ్చన్నారు.

## నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించిన వజ్రేష్ యాదవ్



**ప్రజాపక్షం/బోడుప్పల్ :** బొమ్మక్ శంకరయ్య కన్వేన్షన్ హల్ నూతన సంవత్సరం 2026 క్యాలెండర్‌ను ఆదివారం మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ ఆయన నివాసంలో బోడుప్పల్ సర్కిల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ కార్పోరేటర్ పోగుల నర్సింహ్మరెడ్డి, మాజీ బ్యాంక్ డైరెక్టర్ బొమ్మక్ విశ్వనాథ్, మాజీ కార్పోరేటర్ బొమ్మక్ కళ్యాణ్ కుమార్, బొమ్మక్ నర్సింగ్ రావు తనయుడు బొమ్మక్ చరణ్ లతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ, బోడుప్పల్ లో మాజీ వార్డు సభ్యులు, టీడీపీ పార్టీ అధ్యక్షులుగా బొమ్మక్ నర్సింగ్ రావు ఎన్నో సామాజిక కార్యక్రమాలు, అభివృద్ధిలో పాలుపంచుకున్నారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మరాటి మల్లేష్, పడతం లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

## హిందూ స్మశానవాటిక అభివృద్ధికి నిధులు మంజూరు చేయండి



**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్ :** చింతల్, భగత్ సింగ్ నగర్ హిందూ స్మశానవాటిక అభివృద్ధి కొరకు నిధులు మంజూరు చేయించాలని కుత్బుల్లాపూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ టి.లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ కొలన్ హన్మంత్‌రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశారు. సానుకూలంగా స్పందించిన హన్మంత్‌రెడ్డి జిల్లా మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్లి తప్పకుండా స్మశానవాటిక అభివృద్ధికి సహకరిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో హిందూ స్మశానవాటిక అధ్యక్ష, కార్యదర్శులు దేగల కృష్ణమూర్తి, రిక్కా ప్రేమ్ కుమార్, కోశాధికారి రవి, అభివృద్ధి కమిటీ సభ్యులు కొమురయ్య, రాధాకృష్ణారెడ్డి, బాల్‌రెడ్డి, సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాలలో ప్రధాన సమస్య కోతులు

**ప్రజాపక్షం/అబ్దుల్లాపూర్‌మెట్:** రంగారెడ్డి జిల్లా, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కవాడిపల్లిలో కోతుల సమస్య ఎక్కువగా ఉందని స్థానికులు తెలిపారు. ఇల్లు పై కప్పుల మీద దుంకుతూ రేకుల ఇల్లు ధ్వంసం చేస్తున్నాయి. ఇంటి ముందు ఏ వస్తువులు ఉన్న అవి తినే వస్తువులు అనుకుని తీసుకెళ్తున్నాయన్నారు. ఎన్నో ఇబ్బందులు పడుతున్నామన్నారు. కొత్తగా అధికారంలోకి వచ్చిన సర్పంచ్ కొలను లక్ష్మి ప్రసన్న చొరవ తీసుకుని కోతుల బెడద నుండి తమను కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.



## లోక కల్యాణం కోసమే మహా యాగం

**ప్రజా/తుర్కయంజాల్:** లోక కళ్యాణం కోసమే సహస్ర చండీయాగం నిర్వహిస్తున్నామని శ్రీ రేణుకా రాజరాజేశ్వరి పీఠం పీఠాధి పతి మెల్లూరి నవీన్ శర్మ అన్నారు.లోక కల్యాణం కోసమై ,దేశ రాష్ట్ర ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని శ్రీ రేణుకా రాజరాజేశ్వరి పీఠం ఆధ్వర్యంలో మెల్లూరి నవీన్ శర్మ నిర్వహణలో తుర్కయాంజల్ పరిధి రాగన్నగూడ మెయిన్ రోడ్ సాగర్‌హైవే నందు దాదాపుగా 8 ఎకరాల స్థలంలో మహారుద్ర సహిత సహస్రచండీ మహాయాగాన్ని సంకల్పించింది. ఆదివారం పత్రిక ఆవిష్కరణను యాగస్థలంలోయాంజల శ్రీనివాస్ శర్మ చేశారు. వారు మాట్లాడుతూ యాగం జనవరి28నుండిఫిబ్రవరి1వరకుఏకోత్తర వృద్ధిగా, పంచాహ్నిక దీక్షా విధానంతో కొనసాగుతుందన్నారు.పుష్పగిరి శంకరాచార్య స్వామి పర్యవేక్షణలోకొనసాగుతాయిన్నారు.మొద్దు లచ్చిరెడ్డి, రవీందర్ రెడ్డి, సమా సంజీవ్ రెడ్డి, కొత్తకుర్మ శివకుమార్, ఎలిమినేటి నరసింహరెడ్డి, కోషికేఐలెయ్య, కుంటా గోపాల్ రెడ్డి,మర్రి మహేందర్‌రెడ్డి, దోసాడా జంగారెడ్డి, పన్నాల సురేందర్‌రెడ్డి,గుత్తా మహేందర్‌రెడ్డి,బాచిగాళ్ళ రమేష్ పాల్గొన్నారు.

## కౌన్సిల్ ఆఫ్ ఇహెచ్ఎస్ ప్రొఫెషనల్స్ శిక్షణ విజయవంతం



**ప్రజాపక్షం / హైదరాబాద్ :** కౌన్సిల్ ఆఫ్ ఈహెచ్ఎస్ ప్రొఫెషనల్స్ ఆధ్వర్యంలో 29వ ఉచిత శిక్షణా కార్యక్రమం నగరంలోని జీడిమెట్ల ఇండస్ట్రీస్ అసోసియేషన్ కాన్ఫరెన్స్ హాల్‌లో విజయవంతంగా జరిగింది. పరిశ్రమలో భద్రతా విధానాల బలోపేతం, పర్యావరణ పరిరక్షణ, ల్యాబొరేటరీ భద్రతా ప్రమాణాలు, ఇండస్ట్రియల్ గ్యాస్ టెస్టింగ్, ఫైర్ సేఫ్టీ, ఆక్యుపేషనల్ హెల్త్ అండ్ సేఫ్టీ (ఒహెచ్ అండ్ ఎస్) మేనేజ్‌మెంట్ విధానాలపై నిపుణులు అవగాహన కల్పించారు. పరిశ్రమలు ఎదుర్కొంటున్న ప్రస్తుత సవాళ్లను దృష్టిలో ఉంచుకొని భద్రతా చర్యలను ముందస్తుగా అమలు చేయాలని సూచించారు. ఉద్యోగుల భద్రత, సంస్థ ఆస్తుల రక్షణ, పర్యావరణ సంరక్షణకు మేనేజ్‌మెంట్ నాయకత్వం, ఉద్యోగుల చురుకైన భాగస్వామ్యం అత్యంత కీలకమని ప్రొఫెషనల్స్ ఎగ్జిక్యూటివ్ బోర్డు మెంబర్ అశోక్ పొడిశెట్టి తెలిపారు.ప్రొఫెసనల్స్అధ్యక్షులు తపస్ సహ, ప్రధానకార్యదర్శి ఎ.సూర్య ప్రకాశ్, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ హరిబుక్య, జి.జగదీశ్వరరావు, తిరుపతి హాజరై, పరిశ్రమలు , ఈహెచ్ఎస్ సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో రిసస్టెనబిలిటీ లిమిటెడ్ సంస్థ వైస్ ప్రెసిడెంట్ ఆర్.కె.వి.నటరాజ్, బేసిక్ ఎలిమెంట్స్ సంస్థ డైరెక్టర్ ప్రసాద్ వివిధ అంశాల నిపుణులు పాల్గొన్నారు.

## 30న ముదిరాజ్ సర్పంచ్‌లకు సన్మానం

**ప్రజాపక్షం / ఖైరతాబాద్ :** పంచాయతీ ఎన్నికల్లో గెలుపొందిన ముదిరాజ్ సర్పంచ్‌ల సన్మాన సభ ఈ నెల 30న హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించనున్నట్టు ముదిరాజ్ కోఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మన ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ చొప్పరి శంకర్, అఖిల భారత కోలి సమాజ్ జాతీయ ప్రధాన కార్యదర్శి కాసాని వీరేశ్‌లతో కలిసి ఆయన మాట్లాడారు. గతంలో ముదిరాజ్ సర్పంచ్‌లు 1000వరకు ఉండగా, ఇప్పుడు 1600కుపైగా గెలుపొందడం మన చైతన్యానికి నిదర్శనమన్నారు. ఈ సన్మాన కార్యక్రమానికి మంత్రి వాటికి శ్రీహరి, ఎంపి ఈటల రాజేందర్, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్ ముదిరాజ్, మాజీ ఎంఎల్‌సి కాసాని జ్ఞానేశ్వర్, నీలం మధు, ముదిరాజ్ మహాసభ నేతలు, కులపెద్దలు హాజరవుతారని తెలిపారు. సమావేశంలో ముదిరాజ్ సంఘాల నేతలు గొడుగు శ్రీనివాస్, బోళ్ల కర్ణాకర్, మద్దెల సంతోష్, సలేంద్ర శివయ్య, డా.బొజ్జ నారాయణ, గుండ్లపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## 'స్థానికం'స్ఫూర్తితో రాజ్యాధికారం సాధిద్దాం : బాల్‌రాజ్‌గౌడ్



**ప్రజాపక్షం / హైదరాబాద్ :** పంచాయతీ ఎన్నికల్లో 51శాతం బిసిలు సర్పంచ్‌లుగా గెలుపొందటం శుభపరిణామమని, ఇదే స్ఫూర్తితో రాజ్యాధికారాన్ని సాధించుకుందామని బిసి పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ బాలగోని బాల్‌రాజ్‌గౌడ్ పిలుపునిచ్చారు. బిసిల గెలుపు బహుజన రాజ్యం ఏర్పడేందుకు తొలిమెట్టు అని పేర్కొన్నారు. బిసి రిజర్వేషన్ల అమలుపై చిత్తశుద్ధి నిరూపించుకొని బిఆర్ఎస్, బిజెపి, కాంగ్రెస్ పార్టీలకు ఈ విజయం చెంప పెట్టులాంటిదన్నారు. ఆదివారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో '' పంచాయతీ ఎన్నికల స్ఫూర్తితో రాజ్యాధికారం సాధిద్దాం'' అనే అంశంపై ఎస్.దుర్గయ్యగౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి బాల్‌రాజ్ గౌడ్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఫ్రంట్ రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్నగౌడ్‌తో కలిసి బాల్‌రాజ్‌గౌడ్ మాట్లాడారు. బిసిల ఐక్యతకు, బిసి రిజర్వేషన్ల సాధనకు బిసి పొలిటికల్ ఫ్రంట్ ఆధ్వర్యంలో అనేక పోరాటాలు చేశామన్నారు. బిసిల్లో మరింత రాజకీయ చైతన్యం తీసుకొచ్చేందుకు సంక్రాంతి తర్వాత రాష్ట్రవ్యాప్తంగా బస్సు యాత్ర చేపడుతామన్నారు.బిఆర్ఎస్, బిజెపి, కాంగ్రెస్ బిసిలకు ఏం చేయలేదని విమర్శించారు.గత పంచాయతీ ఎన్నికల్లో 22శాతం ఉన్న బిసి రిజర్వేషన్లను ఇప్పుడుకాంగ్రెస్ ప్రభుత్వం 17శాతానికి తగ్గించి బిసిలను నట్టేట ముంచిందన్నారు. అయినా, బిసిలు చైతన్యవంతమై జనరల్ స్థానాల్లో సైతం పోటీ చేసి సగానికిపైగా విజయం సాధించారన్నారు. ఫ్రంట్ కన్వీనర్లు యెలికట్టె విజయకుమార్, అంబాల నారాయణగౌడ్, నేతలు బైరు శేఖర్, నగేశ్ ముదిరాజ్, మల్లేశ్ యాదవ్, సింగం నాగేశ్ గౌడ్, దామోదర్ గౌడ్, మహేశ్ పాల్గొన్నారు.

## సమాజ శ్రేయస్సుకు బాలచెలిమి సంకలనాలు



**ప్రజాపక్షం / ఖైరతాబాద్ :** సమాజ శ్రేయస్సుకు బాలచెలిమి సంకలనాలు ఎంతగానో తోడ్పడుతాయని తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ పరిషత్తు చైర్మన్ రియాజ్ అన్నారు.ఆదివారంహిమాయత్‌నగర్‌లోని ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ స్కూల్ లో బాలచెలిమి జాతీయకథల పోటీ – 2025 కార్యక్రమం మణికొండ వేదకుమార్ అధ్యక్షతన నిర్వహించారు. రియాజ్ మాట్లాడుతూ బాలచెలిమి పత్రిక తెలుగుతోపాటు వివిధ బాషలలోకి అనువాదం చేసి, విద్యార్థులకు అందుబాటులోఉంచాలన్నారు. మణికొండ వేదకుమార్ మాట్లాడుతూ 20 19, నవంబర్ 20న బాలచెలిమి మొదటిగ్రంథాలయం పోచంపల్లిలో ఏర్పాటు చేశామన్నారు.కొత్తగా20గ్రంథాలయాలు అందుబాటులోకితెచ్చామన్నారు. యువత, విద్యార్థులు రాసిన కథలను జ్యూరీ సభ్యుల బృందం పరిశీలించి, 36మందిని విజేతలుగా ప్రకటించగా, వారికి బహుమతులందజేశారు. ఎపి గ్రంథాలయ చైర్మన్ డా.రావి శారద, చిత్రకారులు కూరెళ్ల శ్రీనివాస్, ధనుంజయ, మాడభూషి లలితాదేవి,బాలచెలిమి కన్వీనర్ గరిపల్లె అశోక్, కో–ఆర్డినేటర్ సయ్యద్ ఖైజర్, అమరవాది నీరజ, కృష్ణమూర్తి, శ్రీకాంత్‌ఉన్నారు.

### గాంధీని హత్యచేసిన గాడ్సే వారసులు

# రెండోసారి హత్య చేస్తుండ్రు



**కాంగ్రెస్ నిరసన కార్యక్రమంలో టిపిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్**

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** స్వాతంత్ర్య ఉద్యమాన్ని ముందుండి నడిపించి దేశానికి స్వాతంత్ర్యం సాధించిపెట్టిన జాతిపిత మహాత్మాగాంధీని హత్యచేసిన గాడ్సే వారసులు ఆయన పేరును తొలగించి రెండోసారి హత్యచేస్తున్నారని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టిపిసిసి) అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. ఆదివారం కేంద్రంలోనిబిజెపి ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరును మార్చడాన్ని నిరసిస్తూ ఎఐసిసి,టిపిసిసి ఇచ్చిన పి లుపు మేరకు రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి నాయకత్వంలో మొయినాబాద్ మండలం అజీజ్ నగర్ లో చేపట్టిననిరసనకార్యక్రమం చేపట్టారు. ముందుగా మహాత్మాగాంధీ,రాజీవ్ గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ నేతలకు గాంధీజీ పేరు పలకడం ఇష్టంలేక ఉపాధి హామీ పథకం పేరు మారుస్తున్నారని తీవ్రంగా ధ్వజమెత్తరు.నాడు ఎంతో దూరదృష్టితో దేశంలోని పేద ప్రజలకు కనీసం వంద రోజు పని కల్పించాలనే సంకల్పంతో 2005లో కాంగ్రెస్ ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం తీసుకొచ్చిందని గుర్తుచేశారు. గ్రామస్వరాజ్యం కోసం కలలుగన్న మహాత్మాగాంధీ పేరును ఉపాధి హామీ పథకానికి పెట్టారని చెప్పారు. కులాలు,మతాలు, ప్రాంతాల పేరుతో ప్రజల్లో విద్వేషాలను రెచ్చగొట్టి,రాముడి పేరుతో అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం స్వాతంత్ర పోరాటం, ఆతరువాత చరిత్రనంతా వక్రీకరిస్తుందని ఆయన తీవ్రంగా విమర్శించారు. గాంధీజీ,నెహ్రూ దేశానికి అందించిన సేవలను ప్రజలకు తెలియనీయకుండా కుట్రలు చేస్తుందన్నారు.అంతే కాకుండా దేశంలో అనేక ప్రాజెక్టులు,పరిశ్రమలు, ప్రభుత్వ రం సంస్థలన్నీ నెహ్రూ హయాంలోనే నిర్మించారని చెప్పారు.ఈ నిజాలను బిజెపి నేతలు వక్రీకరిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభివృద్ధి, సంక్షేమంతో ప్రజలకు మరింత దగ్గరవుతున్నారన్నా రు.ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో ప్రజలు దాన్ని నిరూపిస్తూ అత్యధికంగా కాంగ్రెస్ బలపర్చిఅభ్యర్థులను గెలిపించారన్నారు.అనంతరం డిసిసి అధ్యక్షుడుచల్లా నర్సింహారెడ్డి మాట్లాడుతూ గ్రామీణ పేదల చెమటతో నడిచే చారిత్రాత్మక ఉపాధి పథకం నుంచి మహాత్మా గాంధీ పేరు తొలగించడం గాంధీజీకి మాత్రమే కాదు,దేశంలోని కోట్లాది గ్రామీణ పేదలకు చేసిన ఘోర అవమానమని మండిపడ్డారు. ఏఐసిసి వర్కింగ్ కమిటీ సభ్యుడు చల్లా వంశీచందర్‌రెడ్డి మాట్లాడుతూ యూపీఏ ప్రభు త్వం హయాంలో అప్పటి ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్,యూపీఏ చైర్‌పర్సన్ సోనియా గాంధీ సంకల్పంతో గ్రామీణ పేదలకు గౌరవప్రదమైన ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. మోదీ ప్రభుత్వం మహాత్మా గాంధీ పేరును తొలగించడం అంటే గ్రామీణ భారతానికే అవమానమని,ఇది గ్రామీణ ఉపాధి హక్కును నిర్వీర్యం చేసే కుట్రగా కాంగ్రెస్ పార్టీ భావిస్తోందని స్పష్టం చేశారు. మహాత్మా గాంధీ పేరును తొలగించే ప్రయత్నాలను వెంటనే విరమించుకోవాలని, లేకపోతే కాంగ్రెస్ పార్టీ దేశ వ్యాప్తంగా ఉద్యమాలను ఉధృతం చేస్తుందని హెచ్చరించారు.ఎంఎల్‌ఏలు వీర్లపల్లి శంకర్,కసిరెడ్డి నారాయణరెడ్డి, టిపిసిసి ఉపాధ్యక్షులు వేణుగౌడ్, రాష్ట్ర స్పోక్స్ పర్సన్ గౌరీ సతీష్ కుమార్,యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జెక్కిడి శివ చరణ్ రెడ్డి,కాంటెస్టడ్ ఎమ్మెల్యేలు భీమ్ భరత్, జగదీశ్వర్ గౌడ్,కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి,ముద్దగొని రామ్మోహన్ గౌడ్,కార్పొరేషన్ చైర్మన్లు జ్ఞానేశ్వర్ ముదిరాజ్, జైపాల్,చేవెళ్ల పార్లమెంట్ ఇంచార్జ్ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ పాల్గొన్నారు.

## బుక్‌ఫెయిర్‌లో 'తెలంగాణ పబ్లికేషన్స్' స్టాల్ నిరాకరణపై వివరణ

**10 సంవత్సరాల్లో సుమారు రూ. 6 కోట్ల హెచ్‌బిఎఫ్ లావాదేవీలు**
**ఆధారాలు చూపనందునే బ్లాక్ లిస్ట్‌లో పెట్టాం: నూతన కార్యవర్గం**



**ప్రజాపక్షం/హైదరాబాద్:**హైదరాబాద్ బుక్ ఫెయిర్‌లో తెలంగాణ పబ్లికేషన్స్ స్టాల్ నిరాకరించడం, దానిని పలువురు రచయితలు, కవులు, ప్రముఖులు మద్దతు తెలపడంపైప్రస్తుతహైదరాబాద్ బుక్ ఫెయిర్ సొసైటీ స్పందించింది. జరిగిన ఘటనపై వివరణ ఇవ్వాల్సింది పోయి, సామాజిక మాధ్యమాల్లో ప్రస్తుత కమిటీపై బురద చల్లడాన్ని ఖండిస్తున్నామని తెలిపింది. బుక్ ఫెయిర్ ప్రాంగణంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరులసమావేశంలోహెచ్‌బిఎఫ్ అధ్యక్షుడు కవి యాకూబ్, కార్యదర్శి వాసు, ఉపాధ్యక్షుడు బాల్ రెడ్డి కలిసి గత కమిటీ బాధ్యులపై ప్రశ్నల వర్షం కురిపించారు. ప్రతిష్ఠాత్మక హైదరాబాద్ బుక్ ఫెయిర్ (హెచ్‌బిఎఫ్) ఆర్థిక వ్యవహారాల్లో భారీ అక్రమాలు జరిగినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయనీ ఆరోపించారు. 2014 నుంచి 2022 వరకు కొనసాగినగత కార్యవర్గం హయాంలో బ్యాంకు ఖాతాల నిర్వహణ,నిధులమళ్లింపుపైనూతనకార్యవర్గం ప్రశ్నిస్తూ 1986 నుంచి కాచిగూడలోని బ్యాంక్ ఆఫ్ ఇండియా(బిఒఐ)లో అధికారిక ఖాతా ఉండగా, రిజిస్ట్రేషన్ లేకుండానే 2021లో ఐసిఐసిఐ బ్యాంకులో, 2016లో ఎస్‌బిఐలోకొత్తఖాతాలుఎందుకు తెరవాల్సి వచ్చిందని నూతన కార్యవర్గం ప్రశ్నించింది. ఆయా ఖాతాల నుంచి ఒక కన్వెన్షన్ సెంటర్‌కు సుమారు రూ. 30 లక్షలు చెల్లించడం వెనుక ఆంతర్యం ఏమిటి? గతంలో నిర్వహించిన 8 ప్రదర్శనలకు సంబంధించి ఫుడ్ స్టాల్స్, టికెట్ల విక్రయాల ద్వారా వచ్చిన ఆదాయం బ్యాంకు ఖాతాల్లో ఎందుకు జమ కాలేదు? అని నిలదీశారు. సంస్థకు అధికారిక బ్యాంక్ ఖాతా ఉండగా, 'ది హైదరాబాద్ బుక్ ఫెయిర్' పేరిట రిజిస్ట్రేషన్ లేని మరో అకౌంట్‌ను తెరిచి నిధులు దారిమళ్లించారని పేర్కొన్నారు. ఎస్‌బిఐ ఖాతా నుంచి ఒక కన్వెన్షన్ సెంటర్‌కు రూ. 32 లక్షలు బదలాయించారని, రూ. 10 లక్షల నగదు విత్ డ్రా చేశారని ఆధారాలతో సహా వెల్లడించారు. జిల్లాల్లో జరిగిన ప్రదర్శనలకు ప్రభుత్వం ఇచ్చిన ఆర్థిక సాయం, టికెట్లు, ఫుడ్ కోర్టుల ద్వారా వచ్చిన ఆదాయం ఎక్కడా బ్యాంకులో జమ కాలేదని ఆరోపించారు. ఉమ్మడి రాష్ట్రంలో కేవలం 2 సెకండ్ హ్యాండ్ బుక్ స్టాళ్లు ఉండగా, ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత గత బుక్ ఫెయిర్ సొసైటీ నిర్వాహకులు ఇష్టారీతినా సెకండ్ హ్యాండ్ బుక్స్ విక్రయించే వారికి ఏకంగా 70 స్టాళ్లను కేటాయించి, సొమ్ము చేసుకున్నారని తెలిపారు. సంవత్సరానికి రూ. 60 లక్షల చొప్పున దాదాపు 10 సంవత్సరాలు అంటే, సుమారుగా రూ. 6 కోట్లకు సంబంధించిన లెక్కలను చూపలేదని పేర్కొన్నారు.

**బ్లాక్ లిస్ట్‌లో బాధ్యులు..**
నిధుల దుర్వినియోగంపై మూడు సార్లు నోటీసులు ఇచ్చినా గత బాధ్యులు స్పందించలేదని కమిటీ తెలిపింది. దీంతో వారి సభ్యత్వాలను తాత్కాలికంగా రద్దు చేసి, 'బ్లాక్ లిస్ట్'లో ఉంచినట్లు ప్రకటించారు. పదేళ్లుగా ఐటీ రిటన్స్ ఫైల్ చేయలేదని, అసలు క్యాష్ బుక్, వోచర్లు కూడా అప్పగించలేదని మండిపడ్డారు.

**ఆర్థిక నేరమే..**
ప్రభుత్వం ఇచ్చిన ఆర్థిక సహాయం బ్యాంకు రికార్డుల్లో కనిపించడం లేదని, కొత్త కార్యదర్శి ఎన్నికైనా పాతవారే సిగ్నేటరీలుగా కొనసాగడం తీవ్రమైన ఆర్థిక నేరం కిందకేవస్తుందని వారు పేర్కొన్నారు. నవతెలంగాణ పబ్లిషింగ్ హౌస్ నుంచి తప్పుకున్నాక కూడా కోయ చంద్ర మోహన్ కార్యదర్శిగా కొనసాగడం నియమావళికి విరుద్ధమని స్పష్టం చేశారు. బుక్ ఫెయిర్ కార్యాలయాన్ని సొంతఅవసరాలకువాడుకోవడంపై మండిపడ్డారు. వివరణ ఇవ్వాలని గత కమిటీ బాధ్యులైన జూలూరి గౌరీశంకర్,కోయచంద్రమోహన్,పి. రాజేశ్వరరావులకు మూడు సార్లు లేఖలు రాసినా స్పందన లేదని కమిటీ తెలిపింది. వారి సభ్యత్వాలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు, రాబోయే బుక్ ఫెయిర్లలో వారు పాల్గొనకుండా జనరల్ బాడీ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు.

# విపత్తుల సమయంలో అప్రమత్తం

**రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి నారాయణరెడ్డి**



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** ప్రకృతి విపత్తులు, పరిశ్రమలలో అగ్ని ప్రమాదాలు సంభవించిన సమయంలో చేపట్టాల్సిన తక్షణ చర్యలపై అవగాహనతో పాటు సన్నద్ధతను మరింత పెంపొందించేందుకు జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ సహకారంతో ఈనెల 22న జిల్లాలో ప్రయోగాత్మకంగా నిర్వహించనున్న మాక్ ఎక్సర్ సైజ్ ను పకడ్బందీగా నిర్వహించాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి అధికారులను ఆదేశించారు. మాక్ ఎక్సర్ సైజ్ కు సంబంధించిన ముందస్తు ఏర్పాట్లపై ఆదివారం సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. మాక్ డ్రిల్ నిర్వహణకు నిర్ణీత ప్రణాళిక, ఆయా శాఖల బాధ్యతలు, అగ్ని ప్రమాదం సంభవించిన వెంటనే చేపట్టాల్సిన తక్షణ చర్యలు, సమన్వయం, సమాచార వ్యవస్థ,అత్యవసర సేవల నిర్వహణ వంటి అంశాలపై అధికారులకు మార్గనిర్దేశం చేశారు.మాక్ డ్రిల్‌ను సోమవారం(నేడు)నందిగామ మండలం మేకగూడ లోని నాట్కో పరిశ్రమ ఆవరణలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. విపత్తులు,వరదలు, ఊహించని రీతిలో ప్రమాదాలు జరిగిన సమయంలో ఎలా స్పందించాలి,ఆస్తి, ప్రాణనష్టం నివారించేందుకు ఏవిధమైన చర్యలు తీసుకోవాలి,వివిధ శాఖల మధ్య సమన్వయం ఎలా ఉండాలి అనే అంశాలపై ఈ మాక్ ఎక్సర్ సైజ్ ద్వారా ప్రయోగాత్మకంగా అవగాహన కలుగుతుందని,విపత్తులను ఎదుర్కొనే విషయంలో సన్నద్ధత ఏ మేరకు కలిగి ఉన్నామనేది అవగతం అవుతుందన్నారు.మాక్ ఎక్సర్ సైజ్ ను పకడ్బందీగా, విజయవంతంగా నిర్వహించేందుకు సంబంధిత అన్ని శాఖల అధికారులు పూర్తి స్థాయిలో ఏర్పాట్లతో సంసిద్ధంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. విపత్తుల పై సమాచార సేకరణ, తక్షణమే స్పందించేందుకు వీలుగా కలెక్టరేట్ లో కంట్రోల్ రూమ్ నెం: 040 23237416, 984990 6949 ఏర్పాటు, సమాచార మార్పిడి, ప్రజలను అప్రమత్తం చేయడం తదితర వాటిపై కలెక్టర్ సూచనలు చేశారు. ఇది కేవలం మాక్స్ ఎక్సైజ్ మాత్రమే అని,దీని ద్వారా ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురి కావద్దని, విపత్తులు సంభవించినప్పుడు ప్రజలు భయపడకుండా, ప్రజలకు అవగాహన కల్పించాలని ఉద్దేశంతో ఈ మాక్ ఎక్సైజ్ ను చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఎలాంటి వదంతలను ప్రచారం చేయొద్దని జిల్లా కలెక్టర్ కోరారు.

## వినియోగదారుల నమ్మకమే బ్యాంక్ పురోగాభివృద్ధికి పునాది

**సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రిటైర్డ్ సిఇఒ ఎం.వి.రావు**

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వినియోగదారుల నమ్మకమే బ్యాంక్ పురోగాభివృద్ధికి పునాది అని, ఇందుకు ఉద్యోగులు పారదర్శకతతో సేవలను అందించాలని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రిటైర్డ్ ఎండి. సిఇఓ ఎం.వి.రావు ఉద్బోధించారు.. సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా హైదరాబాద్ జోన్ ఆధ్వర్యంలో బ్యాంక్ 115వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. జోనల్ హెడ్ కె.ధారసింగ్ నాయక్ అధ్యక్షతన జరిగిన ఈ వేడుకలకు ముఖ్యఅతిథులుగా హాజరైన ఎం.వి.రావు మాట్లాడుతూ 1911లో సోరాబ్జీ పోచ్‌ఖానావాలా స్థాపించిన సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అనేక ఒడుదొడుగులను ఎదుర్కొందని, అయినా మొక్కవోని దీక్షతో వినియోగదారులను నమ్మకాన్ని చూరగొన్ని బ్యాంక్ కార్యాకలాపాలను విస్తరించుకుంటూ పురోగాభివృద్ధి సాధించడంతో పాటు దేశ అభివృద్ధిలో సైతం కీలక పాత్రను పోషిస్తూ వస్తోందని తెలిపారు. వినియోగదారులకు అవసరమైన సేవలను అందిస్తూ వారి అభివృద్ధికి సైతం బాటలు వేసిందన్నారు. వినియోగదారులు ఏమి కోరుకుంటున్నారో ఎప్పటికప్పుడు గుర్తించి అందుకు అనుగుణంగా ప్రతి ఉద్యోగి పారదర్శకత, బాధ్యతయుత జవాబిదారితనంతో కూడిన సేవలను అందించాలని సూచించారు. హైదరాబాద్ జోనల్ హెడ్ ధారసింగ్ నాయక్ మాట్లాడుతూ హైదరాబాద్ జోనల్ పరిధిలో రోజువారిగా రూ.50వేల కోట్ల లావాదేవీలను లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఈ మైలు రాయిని అతిత్వరలో అందుకుంటామని విశ్వాసం వ్యక్తం చేశారు.
**పలువురికి సన్మానం :** సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 115వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకల్లో భాగంగా బ్యాంక్ వివిధ శాఖల్లోని ఉత్తమ వినియోగదారులతో పాటు బ్యాంక్ ఉన్నతికి కృషి చేసిన పలువురు రిటైర్డ్ అధికారులను సన్మానించారు. అదేవిధంగా ఈ ఆర్థిక సంవత్సరంలో ఉత్తమ ప్రతిభను కనబర్చిన వివిధ శాఖల అధికారులను హైదరాబాద్ జోనల్ హెడ్ ధారసింగ్ ఘనంగా సత్కరించారు. ఉద్యోగుల పిల్లలకు నిర్వహించిన వివిధ పోటీల్లోగెలుపొందినపలువురికిబహుమతులను అందజేశారు.

## ఇఎన్‌టి ఆసుపత్రి నాలా పనులకు రూ. 2.65 కోట్లు

**బిఆర్ఎస్ గోషామహల్ నేత ఆనంద్ కుమార్‌గౌడ్**



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నగరంలోని కోఠి ఈఎన్‌టి ప్రభుత్వ ఆసుపత్రిలో వరద నీటి సమస్యకు శాశ్వత పరిష్కారంగా కాలువ నిర్మాణ పనుల కోసం జిహెచ్ఎంసి ద్వారా రూ.2.65 కోట్ల నిధులు మంజూరు చేయించినట్లు బిఆర్ఎస్ గోషామహల్ నేత ఎం. ఆనంద్ కుమార్ గౌడ్ తెలిపారు. గౌలిగూడలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గత సెప్టెంబర్‌లో నాలా పగిలి ఆసుపత్రి వార్డుల్లోకి వరద నీరు, మురుగు నీరు చేరిన నేపథ్యంలో ఆసుపత్రిని స్వయంగా సందర్శించి పరిస్థితిని పరిశీలించినట్లు ఆయన చెప్పారు. రోగులు, వైద్య సిబ్బంది ఎదుర్కొంటున్న ఇబ్బందులపై జిహెచ్ఎంసి కమిషనర్, జోనల్ కమిషనర్ల దృష్టికి తీసుకెళ్లి నిధుల మంజూరుకు కృషి చేశామని చెప్పారు. ఈ పనుల్లో జిహెచ్ఎంసి సర్కిల్14 ఏఈ మహేందర్ నిర్లక్ష్యం కారణంగా పనులలో జాప్యం జరిగిందని విమర్శించారు. ఈ విషయమై కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తామని,సంబంధిత అధికారిని బదిలీ చేయాలని ఆనంద్ కుమార్ గౌడ్ కోరారు. నిధులు మంజూరు చేసిన జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్‌కు గోషామహల్ ప్రజలు, ఈఎన్‌టి ఆసుపత్రి రోగుల తరపున కృతజ్ఞతలు తెలిపారు.

## గాదె ఇన్నయ్య అరెస్టు అప్రజాస్వామికం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ ఉద్యమకారుడు, ప్రముఖ ప్రజాతంత్ర వాది గాదె ఇన్నయ్యను జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) అక్రమంగా అరెస్టు చేసిందని సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ పార్టీ తీవ్రంగా ఖండించింది. ఇన్నయ్యపై ఉపా వంటి కఠిన చట్టాల కింద కేసులు బనాయించడం ప్రభుత్వ నిరంకుశత్వానికి నిదర్శనమని సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రస్తుతం 'ఆపరేషన్ కగార్' పేరుతో మావోయిస్టుల నిర్మూలన లక్ష్యంగా నరమేధాన్ని కొనసాగిస్తోందని పోటు రంగారావు విమర్శించారు. భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. తప్పుడు కేసులను తక్షణమే ఉపసంహరించుకోవాలని, ఆయన్ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## కేంద్ర నిధులతోనే గ్రామాల్లో మౌలిక వసతులు

**ఎంపి కొండావిశ్వేశ్వర్‌రెడ్డి**



**ప్రజాపక్షం /వికారాబాద్ :** కేంద్ర నిధులతోనే గ్రామాల్లో మౌలిక వసతులు జరుగుతున్నాయి అని చేవేళ్ల ఎంపి కొండవిశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. అదివారం వికారాబాద్ మున్సిపల్‌లోని కొండా బాలకిష్టారెడ్డి పంక్షన్‌హల్ లో వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా బిజెపి బలపర్చిన సర్పంచు అభ్యర్థులను ,ఉపసర్పంచులను,వార్డు మెంబర్స్‌ను బిజెపి అధ్వర్యంలో సన్మానించారు. అయన మాట్లాడుతూ కేంద్రంలోని ప్రధాన మంత్రి నరేంద్రమోడి పాలన వచ్చాక గ్రామాల్లో రూపురేఖలన్ని మారిపోయాయన్నారు. నేరుగా కేంద్రం నుండి జీపీ అకౌంట్లో నిదులు జమచేస్తున్నారని తెలిపారు. బిఆర్ఎస్ కుటుంబ పార్టీయని, ఆ కుటుంబంలోనేఇప్పుడు కొట్లాటలవుతున్నాయన్నారు. ప్రతి ఒక్క కార్యకర్త ,నాయకుడు సోషల్ మీడియాలో యాక్టివ్ పనిచేసి పార్టీ కార్యక్రమాలను, ప్రభుత్వ కార్యక్రమాలు, విదానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం దిశకమిటి సభ్యులు వడ్ల నందు మీడియా సమావేశంలో మాట్లాడుతూ బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షన్ని గ్రామాల్లో గెలువలేకపోవడం చూస్తే అర్థం అవుతుంది. బిజేపి జిల్లా కన్వీనర్ కరణం ప్రహ్లదరావు,మాజీ జిల్లా అధ్యక్షులుమాధవరెడ్డి, సదానందారెడ్డి ,,రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేస్ కుమార్ , శివరాజు, మారుతికిరణ్ ,వికారాబాద్ కో ఆర్డినేటర్ వడ్ల నందు ,శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గోన్నారు.

## అక్రమమని తేల్చిన ఇరిగేషన్ అధికారులు

**చర్యలు చేపట్టని రెవెన్యూ అధికారులు**

**ప్రజాపక్షం/దుండిగల్:** దుండిగల్ మండల రెవెన్యూ పరిధిలోని లోని సారెగూడెం గంగన్న కుంట సర్వేనెంబర్ 276 బఫర్ జోన్లో నిర్మాణాలు చేపట్టడంతో ఇటీవలే పలు పత్రికలలో వరుస కథనాలు వెలువడ్డాయి. ఇరిగేషన్ అధికారులు సర్వే నిర్వహించి అక్రమమని తేల్చినా స్థానిక దుండిగల్ మండల్ అధికారులు చర్యలు చేపట్టడంలో వెనుకడుగు వేస్తున్నారన్న వార్తలు వినవస్తున్నాయి. గతంలో ఆక్రమణదారులు కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టడంతో రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకురావడంతో చర్యలు తీసుకొని నియంత్రించారు. రెండు సంవత్సరాల కాలంగా స్తబ్దతగా ఉన్న అక్రమ నిర్మాణదారులు మరల ఏకంగా రూములను నిర్మించడంతో వారిని నియంత్రించాలని స్థానికులు కోరుతున్నారు.

# క్రీడ



## దంచేసిన జెమీమా..
### శ్రీలంకపై భారీ విజయంతో టీమిండియా బోణీ!

వన్డే ఛాంపియన్ భారత జట్టు తొలి సిరీస్‌ను విజయంతో ఆరంభించింది. విశాఖపట్టణంలో జెమీమా రోడ్రిగ్స్ (69 నాటౌట్) క్లాస్ ఇన్నింగ్స్‌తో చెలరేగగా శ్రీలంకను చిత్తుగా ఓడించింది. ప్రపంచకప్ ఫామ్‌ను కొనసాగించిన జెమీమ్మ.. స్మృతి మంధాన(25)తో హాఫ్ సెంచరీ భాగస్వామ్యంతో విజయానికి బాటలు వేసింది. మంధాన ఔటైనా కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్(15 నాటౌట్)తో కలిసి కూల్‌గా ఆడిన జెమీమ్మ.. టీమిండియాను 8 వికెట్లతో గెలిపించింది. మరో 5 ఓవర్లు మిగిలి ఉండగానే ప్రత్యర్థిని మట్టి కరిపించిన భారత్ ఐదు టీ20ల సిరీస్‌లో 1–0తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. స్వదేశంలో ఇటీవలే వన్డే ప్రపంచకప్ పట్టేసిన టీమిండియా.. టీ20 వరల్డ్‌కప్ సన్నద్ధతను ఘనంగా ఆరంభించింది. శ్రీలంకతో విశాఖలో జరిగిన తొలి టీ20లో భారత్ భారీ విజయం సాధించింది. మొదట శ్రీ చరణి(1–30), క్రాంతి గౌడ్(1–23)లు లంకను 121కి కట్టడి చేశారు. అనంతరం స్వల్ప ఛేదనలో షఫాలీ వర్మ(9) విఫలమైనా స్మృతి మంధాన (25) తన స్టయిల్లో రెచ్చిపోయింది. ఈ ఫార్మాట్లో 4 వేల క్లబ్‌లో చేరిన మంధాన.. కాసేపటికే రణవీర ఓవర్లో సిక్సర్‌కు యత్నించి వెనుదిరిగింది. దాంతో రెండో వికెట్‌కు జెమీమా రోడ్రిగ్స్(69 నాటౌట్)తో నెలకొల్పిన 54 పరుగుల భాగస్వామ్యానికి బ్రేక్ పడింది. ఆ తర్వాత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్(15 నాటౌట్)తో కలిసి జట్టును గెలుపు దిశగా నడిపించింది. గిమ్హాని వేసిన 12వ ఓవర్లో రెండు ఫోర్లతో అర్ధ శతకం పూర్తి చేసుకున్న జెమీమా.. చివరి రెండు బంతుల్ని బౌండరీకి తరలించింది. దాంతో.. లక్ష్యం ఐస్ ముక్కలా కరిగిపోగా.. హర్మన్‌ప్రీత్ కూల్‌గా ఆడింది. రణవీర వేసిన 15వ ఓవర్లో జెమీమా సింగిల్ తీయగా8 వికెట్ల తేడాతో గెలుపొందిన టీమిండియా సిరీస్‌లో ముందంజ వేసింది.



## పన్నెండోసారి విజేతగా పాకిస్థాన్

పురుషుల అండర్ –19 ఆసియాకప్ ఫైనల్లో భారత జట్టుకు పాకిస్థాన్ బిగ్ షాకిచ్చింది. భారీ స్కోర్ చేసిన పాక్ అనంతరం పవర్ ప్లేలోనే కీలక వికెట్లు తీసి టీమిండియాను దెబ్బకొట్టింది. ఓపెనర్లు వైభవ్ సూర్యవంశీ(26), ఆయుష్ మాత్రే(2)ను ఔట్ చేసి భారత్‌ను అలీ రజా(4–42) ఒత్తిడిలో పడేశాడు. పాక్ బౌలర్ల స్లో పిచ్ బంతులకు మిడిలార్డర్ బ్యాటర్లు వికెట్ ఇచ్చేశారు. టాప్ స్కోరర్ దీపేశ్ దేవేంద్ర(36)ను చివరి వికెట్‌గా వెనుదిరగడంతో 26.2 ఓవర్లలో 156కు భారత్ ఆలౌటయ్యింది. దాంతో.. 191 పరుగుల తేడాతో గెలుపొందిన పాకిస్థాన్ 12వ సారి విజేతగా రికార్డు నెలకొల్పింది. అజేయంగా అండర్ 19 ఆసియాకప్ ఫైనల్ చేరిన భారత్ అనూహ్యంగా బోల్తా పడింది. లీగ్ దశలో పాకిస్థాన్‌ను చిత్తు చేసిన టీమిండియా.. టైటిల్ పోరులో మాత్రం తేలిపోయింది. మొదట ప్రత్యర్థిని భారీ స్కోర్ చేయనివ్వని ఆయుష్ మాత్రే బృందం.. ఆ తర్వాత బ్యాట్లెత్తేసింది. ఫైనల్లో భారత బౌలర్లను ఉతికేసిన పాక్ ఓపెనర్ సమీర్ మిన్హాస్(172) విధ్వంసక సెంచరీతో చెలరేగాడు. అహ్మద్ హుసేన్(56) అర్ధ శతకంతో మెరవగా దాయాది జట్టు నిర్ణీత ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 347 పరుగులు చేసింది. భారీ ఛేదనలో టీమిండియాకు ఆరంభంలోనే షాకిచ్చాడు అలీ రెజా(4–42).

**ఒక్కరూ నిలబడలే**

ఓపెనర్ ఆయుష్ మాత్రే(2)ను పెవిలియన్ పంపిన అతడు కాసేపటికే డేంజరస్ వైభవ్ సూర్యవంశీ(26)ని సైతం వెనక్కి పంపాడు. ఆదిలోనే కష్టాల్లో పడిన టీమిండియాను గట్టెక్కిస్తారనుకున్న ఆరోన్ జార్జ్(16), విహాన్ మల్హోత్రా(7), అభిగ్యాన్ కుండు(13)లు పాక్ బౌలర్ల స్లో పిచ్ బంతులకు వికెట్ పారేసుకున్నారు. 59కే నాలుగు, 94కే ఏడు వికెట్లు పడడంతో టీమిండియా కోలుకోలేకపోయింది. పవర్ ప్లేలోనే కీలక వికెట్లు పడడంతో మ్యాచ్ పాక్ చేతుల్లోకి వెళ్లింది. ప్రధాన బ్యాటర్లు డగౌట్ చేరినా దీపేశ్ దేవేంద్ర(36) ఉన్నంతసేపు ధనాధన్ ఆడాడు. పాక్ బౌలర్లను దంచేస్తూ ఆరు ఫోర్లు, 2 సిక్సర్లు బాదిన దీపేశ్ వికెట్ ఓవర్లో క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. అంతే.. 26.2 ఓవర్లలోనే మ్యాచ్ ముగియగా.. 191 పరుగులతో గెలుపొందిన పాక్ 12వ సారి ఆసియా విజేతగా నిలిచింది.

## ఆస్ట్రేలియా హ్యాట్రిక్

స్వదేశంలో జరుగుతున్న యాషెస్ సిరీస్‌లో ఆస్ట్రేలియా హ్యాట్రిక్ కొట్టింది. పెర్త్, బ్రిస్బేన్‌లో ఇంగ్లాండ్‌కు షాకిచ్చిన ఆసీస్ అడిలైడ్‌లోనూ పంజా విసిరింది. మిచెల్ స్టార్క్(3–62), నాథన్ లియాన్(3–77) విజృంభించడంతో చావోరేవో మ్యాచ్‌లో పర్యాటక జట్టు బ్యాటర్లు చేతులెత్తేశారు. ఐదోరోజు జేమీ స్మిత్(60), విల్ జాక్స్ (47)లు పోరాడినా స్టార్క్ వీరిద్దరిని ఔట్ చేసి ఇంగ్లండ ఆశలపై నీళ్లు చల్లాడు. అడిలైడ్‌లో 82 పరుగుల తేడాతో గెలుపొందిన కంగారూ టీమ్ ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను 3–0తో పట్టేసింది. యాషెస్ సిరీస్‌లో ఇంగ్లాండ్ పోరాడలేక ట్రోఫీ సమర్పించుకుంది. ఆస్ట్రేలియా బౌలర్ల జోరుకు ప్రధాన బ్యాటర్లు క్రీజులో నిలవలేకపోవడంతో 82 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. ఓవర్‌నైట్ స్కోర్ 2076 తో ఐదో రోజు ఇన్నింగ్స్ ఆరంభించిన ఇంగ్లాండ్‌ను మిచెల్ స్టార్క్(3–62) దెబ్బకొట్టాడు. అర్ధ శతకంతో రాణించిన జేమీ స్మిత్(60)ను, విల్ జాక్స్(47)ను ఔట్ చేసి పర్యాటక జట్టును ఓటమి ఖాయం చేశాడు. దాంతో, తొలి రెండు టెస్టుల్లో ఆస్ట్రేలియాకు కనీసం పోటీ ఇవ్వలేకపోయిన ఇంగ్లిష్ టీమ్.. అడిలైడ్‌లోనూ అదే తడబాటుతో సిరీస్ సమర్పించుకుంది. ఆసీస్ నిర్దేశించిన భారీ ఛేదనలో ఓపెనర్ జాక్ క్రాలే(85) అర్ధ శతకంతో ఆశలు రేపినా.. కమిన్స్ (3–24), నాథన్ లియాన్(3–64) వికెట్ల వేటకు టాపార్డర్ కుప్పకూలింది. కమిన్స్ ఓవర్లో జో రూట్(39), లియన్ దెబ్బకు హ్యారీ బ్రూక్(30)లు తేలిపోయారు. స్వల్ప తేడాతో బ్రూక్‌ను, బెన్‌స్టోక్స్(5)ను బౌల్డ్ చేసిన లియాన్ ఇంగ్లాండ్‌ను విజయావకాశాల్ని దెబ్బతీశాడు. అర్ధ శతకంతో పోరాడిన క్రాలేను ఔట్ చేసి ఇంగ్లాండ్‌ను ఓటమి అంచున నిలిపాడు లియాన్. ఆఖరి సెషన్‌లో వికెట్ కాపాడుకున్న జేమీ స్మిత్, విల్ జాక్స్ ఐదోరోజు పోరాడినా స్టార్క్ వీరిద్దరిని పెవిలియన్ పంపి ఇంగ్లాండ్ యాషెస్ కలను భగ్నం చేశాడు. తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీతో మెరిసిన అలెక్స్ క్యారీ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా ఎంపికయ్యాడు.

# ఫోకస్ | ఆరోగ్యం



## చలికాలంలో ఆరోగ్య సంరక్షణ..

చలికాలంలో ఉష్ణోగ్రతలు తగ్గడంతో శరీరం త్వరగా ప్రభావితమవుతుంది. జలుబు, దగ్గు, జ్వరం, చర్మ సమస్యలు వంటి ఇబ్బందులు ఈ కాలంలో ఎక్కువగా కనిపిస్తాయి. కాబట్టి చలికాలంలో ప్రత్యేకంగా ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం. సాధ్యమైనంత వరకూ శరీరాన్ని వెచ్చగా ఉంచుకోవాలి. వెచ్చని దుస్తులు ధరించాలి, ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు చలికి ఎక్కువగా లోనవుతారు. జాగ్రత్త తీసుకోవాలి. ఉదయం, రాత్రి చల్లని గాలి నేరుగా తగలకుండా చూసుకోవాలి. పోషకాహారం తీసుకోవాలి, వేడి ఆహారం ఎక్కువగా తీసుకోవాలి, సూపులు, కూరగాయలు, పప్పులు, చిరుధాన్యాలు మంచివి, విటమిన్ 'సి' ఉన్న నారింజ, నిమ్మకాయ, ఆమ్లా వంటివి రోగనిరోధక శక్తిని పెంచుతాయి. గోరు వెచ్చని నీరు తాగాలి. చలికాలంలో దాహం తగ్గినా నీరు తాగడం తప్పనిసరి. గోరువెచ్చని నీరు జలుబు, గొంతు ఇన్ఫెక్షన్లను తగ్గిస్తుంది. పరిశుభ్రత పాటించాలి. చేతులు తరచూ కడుక్కోవాలి, దగ్గు, తుమ్ము వచ్చినప్పుడు నోటికి కర్చీఫ్ లేదా చేయి అడ్డం పెట్టుకోవాలి. గుంపులుగా ఉండే ప్రదేశాల్లో జాగ్రత్తపడాలి. రోజూ కొద్దిసేపైనా వ్యాయామం చేయాలి, యోగా, ప్రాణాయామం శ్వాసకోశ ఆరోగ్యానికి మంచిది. ఉదయం ఎండ వచ్చిన తర్వాతే బయటకు వెళ్లడం మంచిది. చలికాలంలో శరీరానికి విశ్రాంతి ఎక్కువగా అవసరం. రోజుకు కనీసం 7–8 గంటల నిద్ర తీసుకోవాలి. చలి వల్ల చర్మం పొడిబారుతుంది. కాబట్టి, మాయిశ్చరైజర్, నూనె వంటివి వాడాలి. డి నీటితో ఎక్కువసేపు స్నానం చేయడాన్ని నివారించాలి. రోగనిరోధక శక్తిని పెంచుకోవాలి. తులసి, అల్లం, మిరియాలు, పసుపు వంటి సహజ పదార్థాలు ఉపయోగపడతాయి. అవసరమైతే, వైద్యుల సలహామేరకు ఫ్లూ వ్యాక్సిన్ తీసుకోవడం మంచిది. జలుబు వంటి లక్షణాలు ఉంటే నిర్లక్ష్యం చేయకూడదు. ఎక్కువ రోజులు జలుబు, జ్వరం, దగ్గు ఉంటే వైద్యుడిని సంప్రదించాలి. పిల్లలు, వృద్ధుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం. మొత్తం మీద, చలికాలంలో సరైన ఆహారం, వెచ్చదనం, పరిశుభ్రత, వ్యాయామం, విశ్రాంతి ఉంటే ఆరోగ్యంగా ఉండవచ్చు. చిన్న జాగ్రత్తలే పెద్ద సమస్యలను దూరం చేస్తాయి.

## గుడ్లపై అనుమానాలొద్దు..

గుడ్లు తినడం వల్ల కేన్సర్ వస్తుందనేది కేవలం అపోహ మాత్రమే. సోషల్ మీడియాలో ఈ విషయంపై విపరీతమైన ప్రచారం సాగుతున్నది. లేనిది ఉన్నట్టు చూపడంతో ప్రజల్లో అనుమానం, గందరగోళం పెరుగుతున్నాయి. అయితే, గుడ్డు వల్ల కేన్సర్ వస్తుందనడానికి ఎలాంటి ఆధారాలు లేవు. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఎఐ)ను అనుసరించి గుడ్లు తినడానికి సురక్షితం. వీటి వల్ల కేన్సర్ ప్రమాదం ఉందనే వార్తలు తప్పుదారి పట్టించే, శాస్త్రీయ ఆధారాలు లేని ఆరోపణలు మాత్రమే. ప్రజల్లో అనవసర భయాన్ని సృష్టించేలా ఉన్నాయి. దేశంలో అందుబాటులో ఉన్న గుడ్లు మనుషులు తినడానికి పూర్తిగా సురక్షితమైనవి. గుడ్లలో కేన్సర్ కారక పదార్థాలు ఉన్నాయన్న ఆరోపణలకు శాస్త్రీయ పునాది లేదు. భారతదేశంలో అమ్మే గుడ్లలో నైట్రోఫ్యూరాన్ మెటబోలైట్స్ (ఎఒజెడ్) అనే కేన్సర్‌కు కారణమవుతాయని చెప్పే పదార్థాలను గుర్తించినట్టు కొన్ని మీడియా వార్తలు, సోషల్ మీడియా పోస్టుల నేపథ్యంలో ఎఫ్ఎస్ఎస్ఎఐ వివరణ ఇచ్చింది. దీనిని అనుసరించి, నైట్రోఫ్యూరాన్‌ల వినియోగం పౌల్ట్రీ, గుడ్ల ఉత్పత్తి అన్ని దశల్లోనూ 2011 ఆహార భద్రత నిబంధనల ప్రకారం పూర్తిగా నిషేధించారు. అయితే, నియంత్రణ పరమైన అవసరాల కోసం మాత్రమే 1.0 మైక్రోగ్రాం/కిలోగ్రాం (ఎంజి/కెజి) అనే ఎక్స్‌ట్రానియస్ మాక్సిమమ్ రెసిడ్యూ లిమిట్ (ఇఎంఆర్ఎల్)ను నిర్ణయించారు. ఇది ప్రయోగశాలల్లో గుర్తించగల కనిష్ఠ స్థాయిని మాత్రమే సూచిస్తుంది., ఆ పదార్థం వాడటానికి అనుమతి ఉందన్న అర్థం కాదు. ఇఎంఆర్ఎల్ కంటే తక్కువ స్థాయిలో సూక్ష్మ అవశేషాలు కనబడితే, అది ఆహార భద్రత ఉల్లంఘన కాదు. ఆరోగ్యానికి ప్రమాదం ఉందు. భారతదేశ నియంత్రణ వ్యవస్థ అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగానే ఉంది. యూరోపియన్ యూనియన్, అమెరికా కూడా ఆహార ఉత్పత్తి జంతువుల్లో నైట్రోఫ్యూరాన్‌ల వినియోగాన్ని నిషేధించాయి. అక్కడ కూడా నియంత్రణ కోసం మాత్రమే కొన్ని సూచిక పరిమితులను ఉపయోగిస్తున్నారు. దేశాల మధ్య సంఖ్యల్లో తేడాలు ఉండటం వినియోగదారుల భద్రతలో తేడాల వల్ల కాదని, నియంత్రణ విధానాలు, పరీక్షా పద్ధతుల తేడాల వల్ల మాత్రమే. గుడ్లు తినడం వల్ల కేన్సర్ వస్తుందన్న నిర్ధారిత సంబంధం ఏదీ లేదని శాస్త్రీయ ఆధారాలు చెబుతున్నాయి. ప్రపంచంలో ఏ జాతీయ లేదా అంతర్జాతీయ ఆరోగ్య సంస్థ కూడా సాధారణ గుడ్ల వినియోగాన్ని కేన్సర్ ప్రమాదంతో అనుసంధానించలేదన్న విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేసుకోవాలి. కొన్ని నిర్దిష్ట గుడ్ల బ్రాండ్ పరీక్షల గురించి వచ్చిన వార్తలపై ఎఫ్ఎస్ఎస్ఎఐ స్పందిస్తూ, అవి ఒక బ్యాచ్‌కు మాత్రమే సంబంధించిన ఒంటరి ఘటనలని, అవి అనుకోని కలుషితం లేదా మేతకు సంబంధించిన కారణాల వల్ల రావచ్చని, అవి దేశంలోని మొత్తం గుడ్ల సరఫరా వ్యవస్థను ప్రతినిధ్యం వహించవని తెలిపింది. ఇలాంటి ఒంటరి ప్రయోగశాల ఫలితాల ఆధారంగా గుడ్లన్నీ అసురక్షితమని చెప్పడం శాస్త్రీయంగా తప్పని పేర్కొంది. అందువల్ల, ప్రజలు ధృవీకరించిన శాస్త్రీయ ఆధారాలు మరియు అధికారిక సూచనలపైనే నమ్మకం ఉంచాలని ఎఫ్ఎస్ఎస్ఎఐ కోరింది. నిబంధనల ప్రకారం ఉత్పత్తి చేసి వినియోగించినప్పుడు, గుడ్లు సురక్షితమైనవి, పోషక విలువలతో కూడినవి, సమతుల్య ఆహారంలో ముఖ్యమైన భాగమని స్పష్టం చేసింది. కాబట్టి గుడ్ల వినియోగంపై అనుమానాలు వద్దు. కేన్సర్ ప్రమాదం ఉందనడానికి శాస్త్రీయ ఆధారం ఏదీ లేదు.



(ఇది వివిధ మాధ్యమాల నుంచి సేకరించిన సమాచారం మాత్రమే. పాఠకుల అవగాహనకు ఇది ఉపయోగపడవచ్చు. కానీ వైద్యుల సూచనలు, సలహాలు తీసుకోవడం తప్పనిసరి).

## కార్పొరేషన్ ఎన్నికల్లో అన్ని డివిజన్లలో సిపిఐ పోటీ
### సిపిఐ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం




ప్రజాపక్షం/పెద్దపల్లి : రాబోయే మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో రామగుండంలోనే అన్ని డివిజన్లలో సిపిఐ పోటీ చేస్తుందని సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం అన్నారు. ఆది వారం స్థానిక భాస్కరరావు భవన్లో జరిగిన సిపిఐ రామగుండం నగర కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ రామగుండం కార్పొరేషన్ పరిధిలోని డివిజన్లలో ఉన్న సమస్యలను తీసుకొని ఆయా డివిజన్లోని ప్రజలను కలుపుకొని పోరాటాల నిర్వహించాలని తద్వారా రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో ప్రజల ఆదరణ లభిస్తుందని అన్నారు. అదేవిధంగా భారతదేశంలో సిపిఐ ఆవిర్భవించి వంద సంవత్సరాలు అవుతున్న సందర్భాన్ని పురస్కరించుకొని జనవరి 18న ఖమ్మంలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని, పారిశ్రామిక ప్రాంతమైన గోదావరిఖని నుండి అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు,ప్రజలు తరలి రావాలని ఆయన కోరారు. పార్టీ వంద సంవత్సరాల ఉత్సవాల సందర్భంగా ఈ నెల 26న వాడవాడలా ఎర్ర జెండాలుఎగురవేసి శతాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని అన్నారు. సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కామ్రేడ్ గోసిక మోహన్, గౌతం గోవర్ధన్, యూనియన్ కేంద్ర ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్ ,నగర కార్యదర్శి కె కనకరాజ్ మాట్లాడారు. మార్కాపురి సూర్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కార్యవర్గ సభ్యులు తాళ్ళ పెల్లి మల్లయ్య, మాటేటి శంకర్, తోడుపునూరి రమేష్ కుమార్, మడికొండ ఓదెమ్మ,అసల రమ శనిగరపు చంద్రశేఖర్, రేణుకుంట్ల ప్రీతం, రంగు సీను, సంకె అశోక్, సిరిసిల్ల మల్లేష్, పడాల కనక రాజ్, ఎం ఎ గౌస్, తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ, ఆశ వర్కర్ల సమస్యలు పట్టవా? : భోగే ఉపేందర్




ప్రజాపక్షం/ఆసిఫాబాద్ : కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి భోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆసిఫాబాద్ లోని ఎస్టియు భవన్‌లో ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు టి. దివాకర్ అధ్యక్షతన జరిగిన జిల్లా స్థాయి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేస్తూ కార్మిక హక్కులను కాలరాస్తోందని విమర్శించారు. కార్మికులకు కనీస వేతనం 26 వేల రూపాయలు చెల్లించాలని కోరారు. అలాగే జాతీయ ఉపాధి హామీ పథకాన్ని 200 రోజులకు పెంచి, నిధుల కోత లేకుండా అమలు చేయాలని డిమాండ్ చేశారు.సింగరేణి ఆవిర్భావ వేడుకలను గతంలో మాదిరిగానే వైభవంగా జరపాలన్నారు. సివిల్ సప్లై హమాలీలకు క్వింటాల్‌కు 40 రూపాయల చొప్పున రేట్లు పెంచి, వారిని నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించి వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఏఐటియుసి నాయకులు పిడుగు శంకర్, సుధాకర్, దత్తు, తిరుపతి, నగేష్, శ్రీనివాస్, దొండే రావు, లక్ష్మ ణ్ పాల్గొన్నారు.

## నమ్మిన సిద్ధాంతం కోసం పోరాడిన యోధుడు ఏపూరి బ్రహ్మం
### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



ప్రజాపక్షం/ఇల్లందు:నమ్మిన సిద్ధాంతం కోసం చివరి శ్వాస వరకు నిలబడిన అసలైన కమ్యూనిస్టు ఏపూరి బ్రహ్మం అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు అన్నారు. ఆదివారం ఇల్లందు పట్టణంలోని జెకె కాలనీ వద్ద ఏపూరి బ్రహ్మం మొదటి వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన స్థూప ఆవిష్కరణ కార్యక్రమం సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కే సారయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు, సిపిఐ జాతీయ సమితి సభ్య లు భాగం హేమంతరావు, కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా మాట్లాడుతూ ఇల్లందు ప్రాంతంలో ఏపూరి బ్రహ్మం పట్టుదల, ప్రేమ, పోరాట పటిమ కలిగిన నాయకుడని తన చివరి శ్వాస వరకు కమ్యూనిస్టు సిద్ధాంతం పట్ల నిబద్ధతతో పని చేశారని తెలిపారు. కమ్యూనిస్టు అనే వాడు ఒక్కడు ఉన్నా సరే నిజాయితీగా ఉండి ఆ పార్టీ కృషికి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తారని తెలిపారు. కమ్యూనిస్టుల పట్ల అభిమానం, విశ్వసనీయత ఉన్న దానిని మనం ఓట్లగా మల్చలేకపోతున్నామని అన్నారు. కార్మిక వర్గానికి అండగా ఉన్నది కమ్యూనిస్టులు మాత్రమేనని, నాడు సంఘటిత రంగం లో కార్మికులు, నేడు అసంఘటిత రంగ కార్మికులుగా మారారని వారి అభిరుచికి తగ్గట్టుగా కమ్యూనిస్టులు మారి వారిని కమ్యూనిజం వైపు నడిపించాలన్నారు. 2026 మార్చి 31 వరకు మావోయిస్టు లందరిని అంతం చేస్తానని ప్రకటించిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా మావోయిస్టులను మాత్రమే చంపగలడని ప్రజల గుండెల్లో ఉన్న వారి మావోయిజంచంపలేడన్నారు. క మ్యూనిస్టు పార్టీలు నిరంతరం ప్రజా సమస్యలపై పోరాట చేస్తూ కమ్యూనిస్టు ఉనికిని కాపాడుకోవాలన్నారు. దేశంలో కమ్యూనిస్టులు మాత్రమే పేద ప్రజల కోసం పోరాడి వారి హక్కులను కాపాడారని ఆదర్శ కమ్యూనిస్టులు పోరాటచరిత్ర భావితరాలకు తెలియాలన్నారు. ప్రస్తుతం భారతదేశంలో బిజెపి ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తుందని, దేశ సంపదను కార్పొరేట్లకు దోచిపెడుతుందని, దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేస్తూ బడా పారిశ్రామికవేత్తలకుఅప్పగించి కార్మికులను మోసం చేస్తుందన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేకుండా రైతులకు ఇబ్బందులకు గురి చేస్తుందని, రైతులకు యూరియా సరైన సమయానికి అందించకుండా ఎన్నో ఇబ్బందులకు గురి చేసిందన్నారు. రానున్న రోజుల్లో బిజెపి ప్రభుత్వానికి ప్రజలే తగిన బుద్ధి చెప్తారని విమర్శించారు. మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి విజయ పార్ధసారథి, రాష్ట్ర నాయకులు పోటు కళావతి, ఏపూరి లతాదేవి, ముత్యాల విశ్వనాథం, తాటి వెంకటేశ్వరరావు, సింగు నరసింహారావు, జిల్లా కార్యవర్గ సభ్యులు దేవరకొండ శంకర్, బంధం నాగయ్య, మండల పట్టణ కార్యదర్శులు బొప్పిశెట్టి సత్యనారాయణ, బాస శ్రీనివాసరావు, ఏఐటియూసి బ్రాంచ్ కార్యదర్శి నజీర్ అహ్మద్, ఉపాధ్యక్షులు దాసరి రాజారాం, మండల కార్యదర్శిలు, నాయకులు ఉన్నారు.

## నాసిరకం మందులతో చెలరేగుతున్న మెడికల్ మాఫియా
### సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్


ప్రజాపక్షం/కరీంనగర్:ధనార్జనేధ్యేయంగా కరీంనగర్ జిల్లాలో ప్రైవేట్ ఆసుపత్రులు,మెడికల్ మాఫియా చెలరేగిపోతూ, ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాలశ్రీనివాస్ ఒక ప్రకటనలో ఆరోపించారు. దురదృష్టవశాత్తు అనారోగ్యానికి గురై అత్య వసర పరిస్థితులలో ప్రజలు హస్పిటల్ కు వస్తే వారిని ప్రాణాప్రాయం నుండి కాపాడాల్సిన హాస్పిటల్స్ యాజమాన్యాలు రోగుల అత్యవసర పరిస్థితిని ఆసరాగా చేసుకుని కొన్ని ప్రైవేటు ఆసుపత్రులు నిలువునా దోచుకుంటున్నారని, అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరితే ఎంఎన్‌సి మందులతో వైద్యం అందించాల్సిన వైద్యులు లోకల్‌గా తయారవుతున్న మందులతో వైద్యం చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని, అనవసరమైన వైద్య పరీక్షలు చేసి రోగుల నుండి అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారని సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. హాస్పిటల్స్ లో చేరిన ఇన్ పేషెంట్లకు మల్టీ నేషనల్ కంపెనీలు తయారుచేసిన మెడిసిన్ ఉపయోగించి వైద్యం చేయాల్సిన ప్రైవేట్ హాస్పిటల్స్ వైద్యులు లోకల్ గా తయారు కాబడిన నాసిరకం మందులను రోగులపై వాడుతున్నారని, ఈ మందులు ఒక్క ఆసుపత్రికి ఒక్కో రేట్ చొప్పున ఇష్టానుసారంగా రేట్లు ఫిక్స్ చేసుకొని ప్రజలను,రోగులను ఆర్థికంగా నిలువునా దోపిడీ చేస్తున్నారని ఆయన విమర్శించారు. ఒకే రకమైన వ్యాధికి ప్రైవేటు హాస్పిటల్స్‌వారు ఉపయోగిస్తున్న మెడిసిన్ ఫార్ములా ఒకటే అయినప్పటికీ ఒక్కో హాస్పిటల్ లో ఒక్కొక రకమైన మెడిసిన్ ధరల్లో భారీగా తేడాలు ఉండటం ఆశ్చర్యానికి గురిచేస్తుందని,ఇన్‌పేషెంట్లకు వాడే మందులను లోకల్‌గా తయారు చేసే కంపెనీలతో ముందే లోపాయికారి ఒప్పందం చేసుకొని ప్రైవేట్ ఆసుపత్రిలో యాజమాన్యాలు నిర్ణయించిన ధరలనే మందులపైన ముద్రించాలని అలా అయితేనే ఆ కంపెనీల మందులను వాడుతామని బెదిరిస్తూ వారు చెప్పిన ధరలనే మెడిసిన్ పై ముద్రించడంతో ప్రైవేట్ ఆస్పత్రుల దోపిడీకి అడ్డు లేకుండా పోయిందని,దానిమూలంగా ఇటు ప్రజల ప్రాణాలతో పాటు అటు డబ్బులు కూడా కోల్పోతున్నారన్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల దోపిడిని నియ ంత్రించి ప్రజల,రోగుల ప్రాణాలను కాపాడాల్సిన అధికారులు నిద్రమత్తులో ఉంటున్నారని, ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాల్సిన జిల్లా వైద్యా ఆరోగ్య శాఖ అధికారులు మరియు డ్రగ్ ఇన్స్పెక్టర్లు అటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదని ఇప్పటికైనా వైద్య శాఖా అధికారులు స్పందించి ప్రైవేట్ ఆస్పత్రుల అరాచకాలకు అడ్డుకట్ట వేసి ప్రజల ప్రాణాలనుకాపాడాలని డిమాండు చేశారు. లేని పక్షంలో నాసిరకం మందులతో వైద్యం అందిస్తున్న ప్రైవేట్ హాస్పిటల్స్ ముందు సిపిఐ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని పంజాల శ్రీనివాస్ పేర్కొన్నారు.

## బిసి రిజర్వేషన్‌ల కోసం ర్యాలీ చేస్తే కేసు నమోదు చేయడం సిగ్గుచేటు
### సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమామహేష్



ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్ : బిసి రిజర్వేషన్‌ల కోసం ర్యాలీ చేస్తే కేసు నమో దు చేయడం సిగ్గుచేటు అని సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ పేర్కొన్నారు. ఆదివారం మేడ్చల్ కోర్టులో హాజరైన అనంతరం వారు మీడియాతో మాట్లాడారు. గత నెల 18న రాష్ట్ర వ్యాప్తంగా బీసీ బంధు పిలుపులో భాగంగా షాపూర్‌నగర్‌లో వామపక్షాల ఆధ్వర్యంలో బీసీ బంధును జయప్రదం చేయాలని కోరుతూ ర్యాలీ తీయడం జరిగింది. ఈ ర్యాలీ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకున్నా, శాంతియుతంగా ర్యాలీ నిర్వహిస్తే కేసులు పెట్టడం సిగ్గుచేటు అన్నారు. ప్రభుత్వమేమో బీసీ రిజర్వేషన్లకు సంపూర్ణ మద్దతు తెలియజేసి బీసీ బంద్‌ను జయప్రదం చేస్తే ఇక్కడ అధికారులేమో కేసులు వేయడం ఘోరమన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్, సిపిఐ మండల కార్యదర్శి కె.స్వామి, సిపిఎం మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మ ణ్ పాల్గొన్నారు.

## సింగరేణి ఉత్సవాలపై యాజమాన్య వైఖరి మారాలి
### 23న నల్ల బ్యాడ్జీలతో నిరసన
### ఎఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి సహాయ కార్యదర్శి రంగు శ్రీను




ప్రజాపక్షం/పెద్దపల్లి : సింగరేణి లో గత కొన్ని సంవత్సరాలుగా కార్మికుల సమక్షంలో యాజమాన్యం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సింగరేణి ఆవిర్భావ దినోత్సవ వేడుకల్ని ఆకస్మికంగా ఎలాంటి ప్రాధాన్యత లేని కార్యక్రమంగా నిర్వహించాలని యాజమాన్యం నిర్ణయించడం పట్ల సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి)వ్యతిరేకిస్తుందని సింగరేణి కాలరీస్ వర్క ర్స్ యూనియన్ ఎఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి సహాయ కార్యదర్శి రంగు శ్రీను పేర్కొన్నారు. ఆదివారం గోదావరిఖని భాస్కర్ రావు భవన్‌లో ఎఐటియుసి ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి ఆవిర్భావ దినోత్సవాన్ని ఇంట్లో పండగ లాగా నిర్వహించుకునే కార్మికులు యాజమాన్యం నిర్ణయం పట్ల ఆగ్రహంగా ఉన్నారన్నారు. సింగరేణి ఉత్సవాలు ఉత్తమ కార్మికులు పొందే బహుమతులు, విద్యార్థులు పిల్లల ప్రతిభకు గుర్తింపులు, కార్మికుల కుటుంబాలు పిల్లలు సాంస్కృతిక కార్యక్రమాలు సింగరేణి సేవా సమితి కార్యక్రమాలు, సింగరేణి కుటుంబంలో ఒక గొప్ప అనుభూతిగా సింగరేణి ఆవిర్భావ దినోత్సవాలు మిగులుస్తాయన్నారు. కార్మికుల కష్టార్జితమైన లాభాల్ని సింగరేణి ని ధుల్ని అప్పనంగా బయట వ్యక్తులకు ఖర్చుపెడ్తు న్నయాజమాన్యం ఆవిర్భావ దినోత్సవానికి ఖర్చు పెట్టడానికి నిరాకరించడందుర్మార్గమన్నారు. ఎఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి ఉపాధ్యక్షులు సంకె అశోక్, నాయకులు మానాల శ్రీనివాస్, పొన్నాల వెంకటయ్య, కారంపూరి వెంకన్న,గొడిశలనరేశ్, సదా మల్లేష్, పంచిక సదయ్య, సమ్మయ్య, రాజేష్, ఊరడి అంజయ్య, రామకృష్ణ కిరణ్, ఆర్. సమ్మయ్య,నల్ల మహేష్, కండే కీర్తి శేకర్, పొన్నం రంజిత్, నిమ్మతి శివ, నవీన్, ఆఫీస్ కార్యదర్శి తొడుపునూరి రమేశ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, నాగర్‌కర్నూల్

## గొర్రెలు, మేకలకు ఉచితంగా నట్టల నివారణ మందులు

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** జిల్లాలోని 20 మండలాల్లోగల గొర్రెలు, మేకలకు ఉచితంగా నట్టలనివారణ మందులను అందించడం జరుగుతుందని ఈ అవకాశాన్ని జిల్లాగొర్రెలు మేకల పెంపకందారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశువైద్య, పశుసంవర్ధక అధికారి డాక్టర్ బి.జ్ఞానశేఖర్ తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ జిల్లాలోని 20 మండలాల్లో గల 9,67,926 గొర్రెలు, 2,06,403 మేకలకు మొత్తం (11,74,329 ) జిల్లా పశువైద్య పశుసంవర్ధక శాఖ ద్వారా ఉచితంగా నట్టల నివారణ ఈనెల 22నుండి 31వతేదీ వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం మండలాల వారిగా సిబ్బంది 50 బృందాలుగా ఏర్పడి అన్ని గ్రామాల్లో ఈ కార్యక్రమం చేపడుతామన్నారు. కావున గొర్రెల మేకల పెంపకందారులందరు సదవకాశాన్ని వినియోగించుకొని నట్టలనివారణ మందులను వారి జీవాలకు తాగించుకోవాల్సిందిగా కోరారు.

## అనుమతులు లేకుండా మట్టి తరలింపు

### రాత్రి, పగలు తేడా లేకుండా సాగుతున్న దందా



**ప్రజాపక్షం/కల్వకుర్తి :** అనుమతులు లేకుండా మట్టితరలింపు వెల్దండ మండలంలో జోరుగా సాగుతుంది. మండలంలోని కొట్రగేటు సమీపంలో ఉన్న పెట్రోల్‌బంకు వెనకాలగల గుట్టనుండి కొందరు అక్రమార్కులు టిప్పర్లలో మట్టిని తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. పట్టపగలు మట్టి మాయం అవుతున్నా అధికారుల పట్టింపు లేకుండా పోయింది. కల్వకుర్తి పట్టణానికి చెందిన వ్యక్తి అక్రమంగా టిప్పర్లలో మట్టిని యథేచ్ఛగా తరలిస్తున్నట్లు సమాచారం. ఇలా అక్రమంగా మట్టిని తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నారు. ఈవిషయంపై తహసీల్దార్ కార్తీక్‌కుమార్‌ను ఫోన్‌లో సంప్రందించగా తక్షణమే స్పందించి మట్టి తరలించే ప్రదేశానికి రెవెన్యూ సిబ్బందిని పంపించారు. అధికారులు వస్తున్న సమాచారం తెలుసుకున్న జెసిబి, టిప్పర్ డ్రైవర్లు వాహనాలతో అక్కడినుండి వెళ్లిపోయారు. అక్రమంగా మట్టిని తరలిస్తున్న మట్టి వ్యాపారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని వెల్దండ మండల రెవెన్యూ అధికారులు తెలిపారు.

## రైతాంగానికి సాగునీరు అందజేస్తాం

### ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ



**ప్రజాపక్షం/అచ్చంపేట :** యాసంగి సీజన్‌లో అచ్చంపేట నియోజకవర్గంలో గతంలో పంటలువేసిన భూములకు సాగునీరు అందిస్తామని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. ఆదివారం చందాపూర్ మండలపరిధిలో చంద్రసాగర్ రిజర్వాయర్‌నుంచి ఆయకట్టుకు నీరు విడుదల చేశారు. దీనిపరిధిలో 550 ఎకరాలకు సాగునీరు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాలవల్ల చంద్రసాగర్ నిండటంతో రైతులు పంటపొలాలకు నీరు విడుదల చేయగలిగామని తెలిపారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వధ్యేయమని అన్నారు. ఎకరానికి రూ.12వేల పెట్టుబడిసాయం, రైతుభరోసా, రుణమాఫీవంటి పథకాలను తమ ప్రభుత్వం ప్రవేశపెట్టి రైతులను ఆదుకుంటున్నామని తెలిపారు. ప్రజాప్రభుత్వం రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉందని తెలిపారు. సాగునీటి ప్రాజెక్టులను పూర్తిచేసి మరింత నీటిప్రవాహం తీసుకొస్తామన్నారు. అదేవిధంగా నియోజకవర్గంలోని పెండింగ్ ప్రాజెక్టలకు నిధుల సమీకరణ అనంతరం కాల్వలు మరమ్మతులుచేసి చివరి ఆయకట్టు వరకు నీరు అందిస్తామన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గపు నాయకులు పాల్గొన్నారు.

## గచ్చు బావి పరిరక్షణలో ఎన్‌సిసి క్యాడెట్లు



**ప్రజాపక్షం/జడ్చర్ల:** స్థానిక డా.బూర్గుల రామకృష్ణ రావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల జడ్చర్లలోని ఎన్‌సిసి కెప్టెన్ డా.రాజేశ్వరి, కళాశాల వృక్షశాస్త్ర సహాయాచార్యుడు డా.బి.సదాశివయ్య ఆధ్వర్యంలో 30 మంది ఎన్‌సిసి కాడేట్స్ కావేరమ్మపేటలో గల గచ్చు బావిని రక్షించుకుందాం రండడి అనే నినాదంతో ఆదివారం గచ్చు బావిని శుభ్రపరిచారు. గత 23 రోజులుగా జరుగుతున్న గచ్చు బావిని రక్షించుకుందాం అనే కార్యక్రమంలో తమ వంతు పాత్రగా అక్కడ ఉన్న ముళ్ళ పొదలను తొలగించడం, రాళ్ళు, మట్టిని ఎత్తిపోయడం, చెత్తా చెదారంను పారబోయడం లాంటి అనేక పనులను చేసి బావిని శుభ్రపరిచారు. అనంతరం అదే బావిలో ఈత కొట్టి ఉస్తాహంగా గడిపారు. విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.సుకన్య అభినందించారు. భారతదేశ వారసత్వ సంపదను కాపాడటంలో బూర్గుల రామకృష్ణ రావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎప్పుడూ ముందంజలో ఉంటుందని తెలిపారు. భవిష్యత్‌లో ఇంకా అనేక కార్యక్రమాలు చేసి సమాజానికి చేరువగా విద్యార్థులను తీసుకెళ్తామని ప్రిన్సిపల్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బోడ జైపాల్, బుక్క మహేష్, పాలవాది రామమోహన్, వెంకటేష్, రాజు, సంతోష్, పాలవాది శ్రీనివాస్ బాబు, యువకులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులు, విద్యార్థి సంఘాల నాయకుల మీద కేసులు ఎత్తివేయాలి

### సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ నాయకులు ఆనంద్



**ప్రజాపక్షం/కృష్ణ :** నారాయణపేట జిల్లా కేంద్రంలో విద్యార్థుల బస్సుల కోసం ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకుల మీద, వార్తలు కవరేజ్ చేయడానికి వెళ్లిన జర్నలిస్టుల మీద, ఆర్టీసీ వారు పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ నాయకులు ఆనంద్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల బస్సుల కోసం నిరీక్షిస్తున్న విద్యార్థుల తరపున వారికి పిడిఎస్‌ఎయు, ఎస్‌ఎఫ్‌ఐ, ఎబివిపి విద్యార్థి సంఘాల నాయకులు వారికి బస్సు సౌకర్యం కల్పించాలని శాంతియుతంగా ధర్నా చేస్తున్నారని కనీసం విద్యార్థుల దగ్గరికి వచ్చి ఆర్టీసీ వారు మాట్లాడాలని డిమాండ్ చేస్తే కనీసం మర్యాద ఇవ్వకుండా ఇలా అక్రమ కేసులు నమోదు చేయడం సరైన పద్ధతి కాదని ఆర్టీసీ అధికారులు తీరు మార్చుకోవాలని హెచ్చరించారు. అలాగే సమాజంలో జరుగుతున్న మంచి చెడు విషయాలను విద్యార్థి సమస్యలను ప్రభుత్వ సమస్యలను ప్రజాక్షేత్రంలోకి తీసుకెళ్లి వివరించగలుగుతున్న జర్నలిస్టుల మీద అక్రమంగా కేసులు నమోదు చేయడం మరి దారుణమని అన్నారు. ఆర్టీసీ నిర్లక్ష్యం స్పష్టంగా కనబడ్డమే కాదు ఇలా జర్నలిస్టులు మీద కేసులు పెట్టడం అంటే వారి హక్కుల్ని కాలరాయడమే అని అన్నారు. ఇప్పటికైనా విద్యార్థి సంఘాల నాయకుల మీద జర్నలిస్టుల మీద పెట్టిన అక్రమ కేసులను ఉపసంహరించుకోవాలని లేకపోతే ప్రగతిశీల సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ఆధ్వర్యంలో వారికి మద్దతు ఉంటూ పెద్దెత్తున ఉద్యమం చేస్తామని ఆర్టీసీ డిపోను కూడా ముట్టడిస్తామని వారు హెచ్చరించారు.

## మోదీ, అమిత్‌షా నియంతృత్వపాలనను తరిమికొట్టాలి

### మంత్రి జూపల్లి కృష్ణారావు

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** కేంద్రంలోని ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్రమంత్రి అమిత్‌షా కాంగ్రెస్‌పార్టీ అగ్రనేతలపై కుట్రపూరితంగా కేసులు నమోదు చేయించడం బెదిరింపులకు పాల్పడటం జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు సైనికుల్లా పనిచేస్తూ నరేంద్రమోదీ ప్రభుత్వాన్ని తరిమికొట్టే వరకు పోరాడాలని మంత్రి జూపల్లి కృష్ణారావు, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్‌రెడ్డిలు కోరారు. ఆదివారం ఎఐసిసి పిలుపుమేరకు జిల్లాకేంద్రంలో ర్యాలీనిర్వహించి అంబేద్కర్ చౌరస్తాలో నిర్వహించిన ధర్నాకు బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షులు విజయ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా మంత్రి జూపల్లి కృష్ణారావు హాజరయ్యారు. ఈసందర్భంగా నిర్వహించిన ధర్నాలో మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డిలు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యానికి పూర్వం ప్రజలను చైతన్యం చేసేందుకు ఏర్పాటు చేసిన నేషనల్ హెరాల్డ్ పత్రికను అడ్డం పెట్టుకొని కేంద్రంలోని ప్రభుత్వం ఎఐసిసి నాయకులైన సోనియాగాంధీ, రాహుల్‌గాంధీపై అక్రమంగా కేసు నమోదు చేశారని కోర్టు సంబంధం లేదని తీర్పు ఇచ్చిన మనీ లాండరింగ్ కేసులు నమోదు చేయడం వారి అహంకారపాలనకు నిదర్శనమన్నారు. సోనియాగాంధీ, రాహుల్‌గాంధీలకు ప్రధాని అవకాశం వచ్చిన ఒక విద్యావేత్తను ప్రధానిని చేసి త్యాగాలు చేశారని వారు గుర్తుచేశారు. తప్పుడు కేసులుపెడుతున్న కేంద్రంలోని నరేంద్రమోడి ప్రభుత్వం గురించి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు చైతన్యం చేయాలన్నారు. కార్యక్రమంలో అచ్చంపేట ఎమ్మెల్యే, జిల్లా పార్టీ అధ్యక్షుడు వంశీకృష్ణ, మార్కెట్ కమిటి చైర్మన్ రమణారావు, యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ వినోద్‌తోపాటు వివిధ మార్కెట్ కమిటి చైర్మన్లు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




## యువతి కుటుంబసభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే, కలెక్టర్



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** దేవరకద్ర నియోజకవర్గం మూసాపేట మండలం వేముల గ్రామంలో ఈనెల 17న అత్యాచార ఘటన అనంతరం మృతి చెందిన దళిత యువతి కుటుంబ సభ్యులను ఆదివారం వేముల గ్రామంలో దేవరకద్ర శాసన సభ్యులు జి.మధుసూదన్ రెడ్డితో కలిసి జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి పరామర్శించారు. జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి మాట్లాడుతూ వేముల ఘటనకు సంబంధించి, బాధిత కుటుంబానికి ప్రభుత్వం పరంగా అండగా ఉంటూ, వారికి రావలసిన పరిహారం అందిస్తామని, అన్ని రకాల సహాయ, సహకారాలు అందజేస్తామని అన్నారు. యువతి సోదరుడిని కుటుంబ సభ్యులు కోరుకుంటే గురుకుల పాఠశాలలో ప్రవేశం కల్పించనున్నట్లు తెలిపారు. యువతి కుటుంబానికి మూడు నెలల సరిపడ నిత్యావసర సరకులను తహశీల్దార్ అందజేయడం జరిగింది. శాసన సభ్యులు జి.మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ జరిగిన సంఘటనపై సమాచారం తెలిపిన వెంటనే ఎప్పటికప్పుడు అధికారులతో మాట్లాడుతున్నట్లు తెలిపారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు 18 వ తేదీన పోలీస్ అధికారులు ఎఫ్‌ఐఆర్ నమోదు చేయడం జరిగిందన్నారు. అదే రోజు నిందితుడిని అరెస్టు చేయడం జరిగింది. బాధిత కుటుంబానికి వ్యక్తిగతంగా 50 వేల రూపాయలు ఆర్థిక సహాయం ఎమ్మెల్యే అందజేశారు. బాధిత కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు, ప్రైవేట్ సంస్థలో అమ్మాయి తల్లికి ఉద్యోగం, తమ్ముడికి ప్రభుత్వ రెసిడెన్షియల్ హాస్టల్‌లో సీటు ప్రభుత్వపరంగా ప్రవేశం కల్పిస్తామని తెలిపారు. ఆదివారం పోస్టుమార్టం రిపోర్ట్ రాబోతుంది. పోస్టుమార్టం రిపోర్ట్ ఆధారంగా తదుపరి చర్యలు పోలీస్ శాఖ తీసుకుంటుందని తెలిపారు. బాధిత కుటుంబానికి వ్యక్తిగతంగా, ప్రభుత్వ పరంగా ఎల్లవేళలా అండగా ఉంటామని అన్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, ఆర్.డి.ఓ నవీన్, తహశీల్దార్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## నేడు యధావిధిగా ప్రజావాణి

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** ప్రజాసమస్యల సత్వర పరిష్కారంకోసం ప్రతి సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ఈనెల 22వతేది సోమవారం నుండి యథావిధిగా నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణ నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉండటంవల్ల ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేయడం జరిగిందన్నారు. గ్రామపంచాయతీ ఎన్నికల ప్రక్రియ ముగిసినందున ప్రజావాణి కార్యక్రమం తిరిగి యథావిధిగా కొనసాగుతుందని కలెక్టర్ తెలిపారు.

**ఈనెల 23న కలెక్టరేట్‌లో మీడబ్బు- మీహక్కు కార్యక్రమం**

ఈనెల 23న మీడబ్బు మీహక్కు ప్రత్యేక శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ తెలిపారు. వివిధ కారణాలవల్ల క్లెయిమ్‌చేసుకొని ఆర్థికపరమైన ఆస్తులకోసం ప్రభుత్వం కల్పించిన మూడునెలల ప్రత్యేక కార్యక్రమం మీడబ్బు మీహక్కులో భాగంగా ఈనెల 23న సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో జిల్లాస్థాయి శిబిరం నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. కేంద్రప్రభుత్వ ఆర్థిక మంత్రిత్వశాఖ పరిధిలోని ఆర్థికసేవల విభాగం ఆదేశాలకు అనుగుణంగా మీడబ్బు మీహక్కు అనే ఇతివృత్తంతో క్లెయిమ్ చేసుకొని ఆర్థికపరమైన ఆస్తుల సమస్యను పరిష్కరించేందుకు కేంద్ర ఆర్థికమంత్రి 2025 అక్టోబర్ 4న గుజరాత్‌లోని గాంధీనగర్‌లో జాతీయస్థాయి కార్యక్రమాన్ని ప్రారంభించారని గుర్తుచేశారు. క్లెయిమ్ చేసుకొని బ్యాంకు పొదుపులు, షేర్లు, డివిడెండ్లు, మ్యూచువల్‌ఫండ్స్, బీమా క్లెయిమ్ చేసుకునేందుకు వీలు కల్పించాలన్న లక్ష్యంతో దీనిని చేపట్టారన్నారు. ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, తమ ఆస్తులు తనిఖీ చేసుకొని తగిన పత్రాలతో కలెక్టరేట్‌లో నిర్వహించే శిబిరంలో పాల్గొనాలన్నారు.

## ఉపాధి హామీ పథకం కాపాడితే హక్కులే కాపాడినట్లే

### ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని కాపాడటం అంటే దేశంలోని పేదల హక్కులను కాపాడటమే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో, సోనియా గాంధీ చైర్‌పర్సన్‌గా ఉన్న యూపీఏ ప్రభుత్వం దేశంలోని పేద, గ్రామీణ, శ్రమజీవి ప్రజలకు ఆత్మగౌరవంతో జీవించే హక్కు కల్పించాలనే ఉన్నత లక్ష్యంతో తీసుకువచ్చిన అత్యంత ప్రజా ప్రయోజనకరమైన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. ఎఐసిసి పిలుపు మేరకు ఆదివారం మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని అశోక్ టాకీస్ చౌరస్తాలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్ అధ్యక్షత భారీ నిరసన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ, 2005లో పార్లమెంటులో చట్టరూపం దాల్చిన ఈ పథకం 2006 నుంచి దేశవ్యాప్తంగా అమలులోకి వచ్చి, ఇప్పటి వరకు ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా దాదాపు 5 వేల కోట్ల పని దినాలను కల్పించిన ఏకైక పథకంగా చరిత్ర సృష్టించిందని తెలిపారు. అంతకు ముందు గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించి, ధర్నా కార్యక్రమంలో పాల్గన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్, జి.మధుసూదన్ రెడ్డి, టిపిసిసి ప్రధాన కార్యదర్శి మిథున్ రెడ్డి, అధికార ప్రతినిధి జహీర్ అక్తర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మా రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కెరి అనిత మధుసూదన్ రెడ్డి, వైస్ చైర్మన్ పెద్ద విజయ్ కుమార్, జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం పర్సన్ ఇంచార్జ్ గోనెల శ్రీనివాసులు, ఐఎన్టీయుసి రాములు యాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వినోద్ కుమార్, ఎన్ పి వెంకటేష్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, డిసిసి ఉపాధ్యక్షులు సత్తూరు చంద్రకుమార్ గౌడ్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ వేముల కృష్ణయ్య, యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అవేజ్, సంజీవ రెడ్డి, హన్వాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వి.మహేందర్, టంకర కృష్ణయ్య, శేఖర్ నాయక్, సిజె బెనహర్, ఫయాజ్, మైత్రి యాదయ్య, సేవాదళ్ అధ్యక్షులు రాజేశ్వర్ రెడ్డి, అజ్మత్ అలి, అర్షద్ అలి, ప్రవీణ్ కుమార్, మోయిజ్ వివిధ మండలాల అధ్యక్షులు, వివిధ గ్రామాల నూతన సర్పంచులు, ఉప సర్పంచులు వార్డు సభ్యులు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.



## కొత్త సర్పంచ్‌లకు సమస్యలతో స్వాగతం

**ప్రజాపక్షం/ధన్వాడ:** ధన్వాడ మండల కేంద్రంలో అన్ని గ్రామ పంచాయితీ కార్యాలయంలో నేటి నుంచి నూతన సర్పంచులు పదవి బాధ్యతలు చేపట్టనున్నారు. గ్రామపంచాయితీల్లో కొత్తపాలన ప్రారంభం కానుండగా, అభివృద్ధి ఆశలతో పాటు అనేక సమస్యలు కూడా నూతన సర్పంచులకు స్వాగతం పలికేందుకు సిద్దంగా ఉన్నాయి. ఐదేళ్లుగా పాటు గ్రామాల భవిష్యత్తును నిర్దేశించే బాధ్యతను స్వీకరించనున్న సర్పంచుల ముందున్న ప్రధాన సవాళ్లు గ్రామస్థుల దైనందిన జీవితానికి సంబంధించినవే కావడం గమనార్హం. ముఖ్యంగా గ్రామాల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు నెల నెలా జీతాలు చెల్లించలేని పరిస్థితులు, చెత్త తరలించే ట్రాక్టర్లకు అవసరమైన డీజిల్ కొరత, వీధిలైట్లు మంజూరులో జాప్యం వంటి సమస్యలు గ్రామపంచాయితీల్లో తీవ్రంగా ఉన్నాయి. దీంతో గ్రామ పారిశుద్ధ్యం, రహదారుల భద్రత, రాత్రి వేళ ప్రజల సురక్ష వంటి అంశాలు ప్రశ్నార్థకంగా మారుతున్నాయి. ఇక పంచాయితీలకు వచ్చే నిధుల నిర్వహణ, అభివృద్ధి పనుల అమలు, ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి కుటుంబానికి చేరవేయడం వంటి అంశాల్లోనూ నూతన సర్పంచులు ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉందని గ్రామ ప్రజలు అభిప్రాయపడుతున్నారు. విధుల పట్ల నిబద్ధతతో పాటు నిధుల వినియోగంలో పూర్తిస్థాయి పారదర్శకత పాటించాలన్నది ప్రజల ప్రధాన డిమాండుగా మారింది. నేటి నుంచి ఐదేళ్ల పాటు పదవిలో కొనసాగనున్న సర్పంచులు రాజకీయాలకు అతీతంగా గ్రామీణాభివృద్ధినే లక్ష్యంగా పెట్టుకుని పని చేయాలని ఆ యొక్క గ్రామస్తులు ఆశిస్తున్నారు. గ్రామ సమస్యలను ప్రాధాన్యత గా తీసుకుని, సమయపాలనతో నిర్ణయాలు తీసుకుంటేనే గ్రామాల్లో సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. నూతన సర్పంచుల పాలన గ్రామాలకు అభివృద్ధి దిశను చూపిస్తుందా? లేక పాత సమస్యలే కొనసాగుతాయా? అన్నది రానున్న రోజుల్లో తేలనుండగా, గ్రామ ప్రజలు మాత్రం తమ సమస్యలకు పరిష్కారం దొరుకుతుందన్న ఆశతో ఎదురుచూస్తున్నారు.




## నూతన సర్పంచ్‌ల దశ.. గ్రామీణ తెలంగాణకు కొత్తదిశ

**ప్రజాపక్షం/వనపర్తి :** తెలంగాణ రాష్ట్రంలో నేడు నూతన సర్పంచ్‌లు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఇది కేవలం ఒక ఎన్నికల ప్రక్రియ ముగింపు మాత్రమే కాదు, గ్రామీణ పాలనలో కొత్త అధ్యాయం ప్రారంభం కావాలి. గ్రామ సచివాలయం నుంచి గ్రామ సభ వరకు, తాగునీటి సమస్య నుంచి ఉపాధి అవకాశాల వరకు గ్రామీణ వ్యవస్థ మొత్తం ఇప్పుడు సర్పంచ్ నాయకత్వానికై ఆశగా ఎదురుచూస్తోంది. ఈ నేపథ్యంలో నూతనంగా బాధ్యతలు చేపట్టనున్న సర్పంచులకు ఈ వ్యాసం ఒక దిక్సూచిగా నిలవాలని ఆశిస్తూ గ్రామపాలన అధికారానికి కాదు బాధ్యతకు ప్రతీకగా నిలవాలి. సర్పంచు పదవి అధికార ప్రదర్శనకు కాకూడదు, సేవా సంకల్పానికి ప్రతీకగా గ్రామ అభివృద్ధి అంటే కేవలం సిమెంట్ రోడ్లు, భవనాలు మాత్రమే కాదనేది దృష్టిలో పెట్టుకోవాలి. పారదర్శక పాలన, ప్రజల భాగస్వామ్యంతో పాటు అవసరాల ఆధారిత ప్రణాళికలన్నీ కలిసినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని గుర్తించాలి. గ్రామ అభివృద్ధికి మూలం గ్రామ సభనే, ప్రతి నిర్ణయం కూడా గ్రామ సభ ఆమోదంతో తీసుకోవాలి. మహిళలు, రైతులు, యువత పాల్గొనేలా సమావేశాలు నిర్వహిస్తే సమస్యలపై బహిరంగ చర్చకు వేదిక అవుతుంది. గ్రామ సభ రెగ్యులర్‌గా నిర్వహించడం వలన పాలన కూడా జవాబుదారిగా మారుతుంది.

**ఆర్థిక క్రమశిక్షణ నమ్మకానికి పునాది**

గ్రామ పంచాయితీ నిధుల వినియోగం పట్ల ప్రజల్లో అనేక సందేహాలు రావడం సహజమే, గ్రామ ఆదాయం ఖర్చుల వివరాలను బహిరంగంగా ప్రకటించాలి. దీనితో ప్రతి అభివృద్ధి పనికి ఖర్చు వివరాఉ గ్రామ పంచాయితీ కార్యాలయంలో బోర్డు పైన తెలియజేయాలి. ఇలా చేయడం వలన ఆడిట్‌కు ఇబ్బంది కలుగదు. వీలు చేసుకుని సమయం స్వచ్ఛంద సమీక్షలు చేపట్టడం మంచిది. నూతన సర్పంచ్‌లు ప్రతి అభివృద్ధి పనిలో స్పష్టంగా ప్రజలకు తెలియజేస్తూ నిధుల అంశంపైన పారదర్శకత ఉంటే ఆ సర్పంచు పైన నిజమైన విశ్వాసం కలుగుతుంది. ప్రాధాన్యతలు స్పష్టం ఉండాలి. నూతన సర్పంచులు మొదటి ఏడాదిలో ముఖ్యమైన అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలి. మొదటగా తాగునీరు, డ్రైనేజీ , పారిశుద్ధ్యం రెండవ ప్రాధాన్యత వైద్య సేవలు, ప్రాథమిక ఆరోగ్యం ఇలా రైతులకు సాగునీరు, గోదాములు, యువతకు ఉపాధి, నైపుణ్య శిక్షణ, మహిళా సంఘాల ఆర్థిక బలోపేతం లాంటి వాటిపైన కేంద్రీకరించాలి. అవసరాలకు మించి అలంకరణ పనులు, అభివృద్ధి కాదని గుర్తించుకోవాలి.

## స్నేహితురాలికి ఆర్థిక సహాయం



**ప్రజాపక్షం/మద్దూర్ :** పట్టణ పరిధిలోని రెనివట్ల గ్రామంలో ఆదివారం రోజు తోటి స్నేహితురాలు జయమ్మకు ఆర్థిక సహాయం చేసిన పూర్వ విద్యార్థులు. గత వారం అనారోగ్యంతో జయమ్మ భర్త బోయిని దేవేందర్ మరణించారు. విషయం తెలుసుకున్నా పూర్వ విద్యార్థులు భర్తను కోల్పోయిన స్నేహితురాలికి అండగా ఉండాలని అప్పట్లో చదువుకున్నా తోటి విద్యార్థులు కలిసి 36,251 నగదును రేనివట్లలోని స్నేహితురాలి ఇంటికి వెళ్లి ఆర్థిక సహాయం అందజేశారు. ఆమెను పరామర్శించి అనారోగ్యంతో మరణించడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని ఓదారుస్తు భరోసానిచ్చారు. స్నేహితులు వెంకటేష్, రవి, యాదయ్య, భాగ్యమ్మ, గంగావతి, సంగీత, కవిత, నవనీత, ఏ.రవి, మహేష్ కుమార్, కంరోద్దిన్ ,ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

## సమానత్వం అభివృద్ధి, సామాజిక న్యాయమే లక్ష్యం




**ప్రజాపక్షం/ఉట్కూర్:** ఉట్కూర్ మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామం ఇటీవల నిర్వహించిన గ్రామపంచాతీ ఎన్నికల్లో బీసీ సమాజానికి చెందిన యువ నాయకుడు బస్వారాజ్ కాంగ్రెస్ సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. సామాన్య కుటుంబం నుంచి ఎదిగి గ్రామ ప్రజల విశ్వాసాన్ని సంపాదించి సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టడం గ్రామ రాజకీయాల్లో కొత్త ఉత్సాహాన్ని తీసుకొచ్చింది. నూతన సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో ఉన్న త్రాగునీటి సమస్యలు పారిశుధ్యం, డ్రైనేజీ రహదారులు దుస్థితి, ఉపాధి లోపం, పేద వర్గాల సమస్యలు వంటి అంశాలను ప్రాధాన్యంగా తీసుకొని పరిష్కరిస్తానని తెలిపారు. అన్ని వర్గాకు సమాన న్యాయం అందేలా పరిచేయడమే తన ప్రధాన లక్ష్యమని చెప్పారు. బీసీ, ఎస్సీ ఎస్టీ, మైనారిటీలు, మహిళలు రైతులు కార్మికులు, అందరికీ ప్రభుత్వ సంక్షేమ సథకాలు అర్హత మేరకు అందేలా పారదర్శకంగా అమలు చేస్తామని తెలిపారు. గ్రామసభలను క్రమం తప్పకుండా నిర్వహించి ప్రజల అభిప్రాయాలను నేరుగా తెలుసుకుంటామని అన్నారు.

## సేవకుడిగా పని చేస్తా

**ప్రజాపక్షం/అడ్డాకుల:** అడ్డాకుల మండల పరిధిలోని బలీదుపల్లి గ్రామ సర్పంచ్‌గా సేవ చేసే అవకాశం కల్పించిన గ్రామ ప్రజలు సేవకుడిగా పని చేస్తానని సర్పంచ్ కరుణాకర్ రెడ్డి అన్నారు. గ్రామ ప్రజలకు సేవ చేస్తూ సేవకుడిగా ఉంటూ గ్రామ ప్రజల పెద్దల యువకుల మహిళల సహకారంతో గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు.

అడ్డాకుల మండల పరిధిలోని పెద్ద మునగాల్‌చేడ్ గ్రామ సర్పంచ్‌గా సేవ చేసే అవకాశం కల్పించిన గ్రామ ప్రజలకు ఒక సేవకుడిగా పని చేస్తానని సర్పంచ్ చిట్టిబాబు అన్నారు. గ్రామ ప్రజలు సేవ చేస్తూ గ్రామ ప్రజల పెద్దలు, యువకులు, మహిళలు సహకారంతో గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ నా విజయానికి కృషి చేసిన పెద్ద మునగల్ చెడ్ గ్రామ ప్రజలకు, పెద్దలకు, యువకులకు ఒకే ఒక్కరికి పేరు పేరునా శుభాభివందనాలు తెలుపుతున్నామని అన్నారు.

## జాతీయ స్థాయి కరాటే పోటీలలో విద్యార్థులకు బంగారు పతకాలు




**ప్రజాపక్షం/కొత్తకోట:** హైదరాబాద్ మహానగరంలోని మౌలాలిలోని శ్రీ లక్ష్మీ నరసింహ కళ్యాణ మండపంలో నిర్వహించిన మొదటవ జాతీయ స్థాయి మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్ షిప్ 2025 పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు వివిధ రాష్ట్రాల నుండి దాదాపు 1000 మంది విద్యార్థి విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలకు కొత్తకోటకు చెందిన గాడ్స్ ఆన్ వారియర్స్ షోతోఖాన్ కరాటే అకాడమీ చెందిన విద్యార్థులు పాల్గొని చక్కటి ప్రతిభ కనబరిచి బంగారు, వెండి పథకాలు సాధించారు. ఈ విద్యార్థులందరూ సీనియర్ కరాటే మాస్టర్ ఎండి. ఇంతియాజ్ దగ్గర శిక్షణ తీసుకుంటున్నట్లు ఫౌండర్ అబ్దుల్ నబీ తెలిపారు. వీరిలో అండర్ 14 సంవత్సరాల కుమ్మితే విభాగంలో వేణు బంగారు పతకం అదే విధంగా జూనియర్ బ్లాక్ బెల్ట్ విభాగంలో ఎం.విజయ్ కుమార్ వెండి పతకం సాధించారు. ఈ గెలుపొందిన విద్యార్థులందరికీ ముఖ్య అతిథిగా విచ్చేసిన తులసి విద్యార్థులకు పథకాలు అందించి అభినందించడం జరిగింది. వీరితో పాటు క్లబ్ ఫౌండర్ అబ్దుల్ నబీ సీనియర్ మాస్టర్ అంజి విద్యార్థులను అభినందించారు. వీరితో పాటు రాష్ట్ర సీనియర్ కరాటే మాస్టర్స్ అమర్‌సింగ్ కేశవ్‌గౌడ్, సాయి, పృద్వీ, విద్యార్థులను అభినందించడం జరిగింది.

## మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

**ప్రజాపక్షం/కల్వకుర్తిరూరల్ :** ఊర్కొండ మండలంలోని ముచ్చర్లపల్లి గ్రామానికి చెందిన నీరటియాదయ్య అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న మాదారం మాజీసర్పంచ్ కాంగ్రెస్ మండలపార్టీ వర్కింగ్‌ప్రెసిడెంట్ ధ్యాప నిఖిల్‌రెడ్డి మృతుడి కుటుంబానికి కాంగ్రెస్‌నాయకుల ద్వారా రూ.5వేలు అందజేశారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్ ముచ్చర్ల వినిత ధర్మేందర్‌రెడ్డి, ఉపసర్పంచ్ సాయికుమార్‌రెడ్డి, వార్డుసభ్యులు నితీష్, నాయకులు లక్ష్మణ్, రామ్, పురుషోత్తం, ఆనంద్, శేఖర్, కృష్ణయ్య పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
నల్లగొండ, సూర్యాపేట యాదాద్రి, గద్వాల

## చిన్న కేసులను లోక్ అదాలత్‌లో...



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: చిన్న చిన్న కేసులను లోక్‌అదాలత్‌లో పరిష్కరించుకోని సత్వరం ప్రశాంతత పొందాలని మిర్యాలగూడ ఐదవ అదనపు జిల్లా జడ్జి కెవి.చంద్రశేఖర్‌రావు అన్నారు. ఆదివారం స్థానిక కోర్టు సముదాయంలో జరిగిన జాతీయ లోక్‌అదాలత్ ప్రారంభ కార్యక్రమంలో రోడ్డు ప్రమాద బాధిత కుటుంబానికి రూ.5లక్షల చెక్ అందచేసిన సందర్భంగా కోర్టులో ప్రమాద బాధితులు రూ.15లక్షలు చెల్లించాలని 2022లో కేసు వేశారని, సంవత్సరాలు పట్టిందని, నేడు బీమా కంపెనీతో రాజీమార్గం లోక్ అదాలత్‌లో రూ.5లక్షలు పొందగలిగారని అన్నారు. చెక్ బౌన్స్, రోడ్డు ప్రమాదాలు, భార్య భర్తల తగాదాల కేసులు పెండింగ్ పెట్టకుండా సత్వరం పరిష్కరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు పవన్‌కుమార్, లావణ్యరాణి, అరుణ్‌తేజ్, నేతి సత్యనారాయణ, అలుగుబెల్లి భూపతిరెడ్డి, కొంక వెంకన్నలు ఉన్నారు.



## లోక్ అదాలత్‌తో 481 కేసులు పరిష్కారం

ప్రజాపక్షం/ రామన్నపేట: రామన్నపేట కోర్టు పరిధిలో మొత్తం 481 కేసులకు పరిష్కారం లభించింది. ఆదివారం రామన్నపేట సీనియర్ సివిల్ జడ్జి జి.సబిత, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి, అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎస్.శిరీష, సెకెండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు జడ్జి డి.సత్తయ్యలు కలిసి కోర్టు హాల్‌లో జాతీయ లోక్‌అదాలత్‌ను నిర్వహించారు. రామన్నపేట జ్యుడిషియల్ సంబంధించి రామన్నపేట, వలిగొండ, మోత్కూరు, అడ్డగూడూరు స్టేషన్ పరిధిలో క్రిమినల్ కేసులు 112, ప్రీలిటికేషన్ కేసులు 2, బ్యాంక్ కేసులు 9, ఇతర పిట్టి కేసులు 358 పరిష్కరించుకున్నారు. బ్యాంక్ కేసులు ద్వారా 595169 రూపాయలు అమౌంట్ రికవరి చేయబడినట్లు తెలిపారు. అనంతరం జడ్జి మాట్లాడుతూ క్షణికావేశాల్లో అప్పటి పరిస్థితుల్లో కేసులు పెట్టుకోని కోర్టుల చుట్టు తిరుగుతూ డబ్బులు, సమయం వృధా చేసుకోవడం బదులు రాజీమార్గమే యాజమార్గంగా కోర్టు పరిధిలో నిర్వహించే లోక్‌అదాలత్ వినియోగించుకోని సమస్యలు పరిష్కరించేకోవడానికి కక్షిదారులు ముందుకు రావాలని తెలిపారు. కార్యక్రమంలో అడ్వకేట్‌లు, పలు మండలాల ఎస్‌బీఐ బ్యాంక్ మేనేజర్లు, వివిధ పోలీస్‌స్టేషన్ల సిబ్బంది, కోర్టు సిబ్బంది, లీగల్ సర్వీసెస్ టీం సభ్యులు, బత్తుల గణేష్, కానుగంటి శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ వైద్యులపై చర్యలు తీసుకోవాలి

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: వైద్యాన్ని వ్యాపారంగా మార్చి పేద ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న నకిలీ వైద్యులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు ఎండి.మహబూబ్‌అలీ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మిర్యాలగూడ పట్టణంలో వైద్యం వ్యాపారంగా మార్చి ప్రజలను దోపిడి చేస్తున్నారని ఆరోపించారు. అర్హత లేకపోయినా నకిలీ వైద్యులు వైద్యం చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంపౌండర్లు, ఆర్‌ఎంపీలు వైద్యం చేస్తూ లక్షలాది రూపాయలు ఆర్జిస్తున్నారని విమర్శించారు. తెలంగాణ మెడికల్ కౌన్సిల్ అధికారులు విస్తృతంగా తనిఖీలు చేయడం వల్ల మిర్యాలగూడలో నకిలీ వైద్యం బయటపడిందని తెలిపారు. నకిలీ వైద్యులపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నకిలీ వైద్యులపై చర్యలు తీసుకునే విధంగా స్థానిక ఎమ్మెల్యే చొరవ చూపాలన్నారు. పట్టణంలో నకిలీ వైద్యులు వైద్యం చేయకుండా ఉన్నత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

## సిపిఐ నేతకు మాతృవియోగం



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్: సిపిఐ నల్లగొండ పట్టణ కార్యదర్శి కర్ర సైదిరెడ్డి మాతృమూర్తి కర్ర లక్ష్మమ్మ(90) పట్టణంలోని విటి కాలనీలో ఆదివారం ఉదయం 10గంటలకు స్వర్గస్తులయ్యారు. లక్ష్మమ్మ పార్థివ దేహంపై సిపిఐ సీనియర్ నాయకులు మల్లెపల్లి ఆదిరెడ్డి,జిల్లా సహాయ కార్యదర్శి లోడంగి శ్రవణ్ కుమార్ పూలమాలవేసి నివాళులర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం,సానుభూతిని తెలియజేశారు. నివాళులర్పించిన వారిలో జిల్లా కార్యవర్గం సభ్యులు పబ్బు వీరాస్వామి,ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బరిగెల వెంకటేష్,సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి వి.లెనిన్, నాయకులు ముండ్ల ముత్యాలు,కోమటిరెడ్డి ప్రద్యుమ్మ రెడ్డి,దోటి పాండరి,ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఎన్‌ఆర్‌సి రాజు నాయకులు ఉన్నారు.

## పేదల గుండెల్లో చిరస్థాయిగా గాంధీజీ

### ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

ప్రజాపక్షం/యాదాద్రి భువనగిరి : కేంద్ర ప్రభుత్వం పథకాల పేర్ల నుంచి మహాత్మా గాంధీ పేరును తొలగించవచ్చు కానీ, దేశంలోని పేద ప్రజల గుండెల్లో నుంచి ఆయనను ఎవరూ తొలగించలేరని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య స్పష్టం చేశారు. ఆదివారం ఉదయం భువనగిరి జిల్లా కేంద్రంలోని గాంధీ పార్క్ వద్ద భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అధ్యక్షతన భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీర్ల అయిలయ్య మాట్లాడుతూ 2005లో ఆనాటి యూపీఏ ప్రభుత్వం గ్రామీణ ప్రాంత పేదల జీవనోపాధి కోసం 'మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని' తీసుకువచ్చిందని గుర్తుచేశారు. అయితే, ప్రస్తుత మోదీ ప్రభుత్వం ఆ పథకం ఉద్దేశాన్ని దెబ్బతీస్తూ, గాంధీజీ పేరును తొలగించి' వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్ గార్ ఔర్ అజ్వీక మిషన్' పేరుతో కొత్త విధానాన్ని ప్రవేశపెట్టడం దురదృష్టకరమన్నారు. గతంలో ఉపాధి హామీ నిధులను 100 శాతం కేంద్రమే భరించేదని, ఇప్పుడు ఆ నిష్పత్తిని 60:40కి మార్చడం ద్వారా రాష్ట్రాలపై పెను భారం మోపుతున్నారని ఆయన మండిపడ్డారు. దీనివల్ల మన రాష్ట్రంపై ఏటా సుమారు రూ.1000 కోట్లు అదనపు భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ సంస్థలను గుప్పిట్లో పెట్టుకుని, గాంధీ కుటుంబంపై కక్ష సాధింపు చర్యలకు మోదీ, అమిత్ షా పూనుకుంటున్నారని ఆయన ధ్వజమెత్తారు. ముందుగా గాంధీ పార్కులో మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నాయకులు నివాళులర్పించారు. అనంతరం గాంధీ చిత్రపటాలను చేతబూని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో కార్పొరేషన్ చైర్మన్ బండ్రు శోభారాణి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అవైస్ చిస్తి, పిసిసి నాయకులు తంగేళ్లపల్లి రవికుమార్, ప్రమోద్ కుమార్, బర్రె జాంగిర్, పోతంశెట్టి వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు అంగడి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



## గ్రామాభివృద్ధికి కట్టుబడి పనిచేద్దాం

### సర్పంచ్‌ల సన్మాన కార్యక్రమంలో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి



ప్రజాపక్షం/కోదాడ రూరల్ : గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని పౌరసరఫరాల, భారీ నీటిపారుదల శాఖల మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని దేగబాబు ఫంక్షన్ హాల్‌లో నూతనంగా గెలుపొందిన నియోజకవర్గ వ్యాప్త సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, వార్డు మెంబర్లకు నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పాలనలో బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ శాంతిభద్రతలను కాపాడుతూ గ్రామాభివృద్ధికి కట్టుబడి పనిచేయాలన్నారు. ముందుగా గెలిచిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు అభినందనలు తెలిపిన ఆయన గ్రామంలో సర్పంచ్ మొదటి పౌరుడని గుర్తు చేశారు. అహంకారానికి తావివ్వకుండా ప్రజలతో కలిసిమెలిసి పనిచేస్తూ గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలకు చోటులేకుండా అందరూ ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. మోతె, మునగాల, నడిగూడెం మండలాల్లో ఎత్తిపోతల పథకం ద్వారా సుమారు 50వేల ఎకరాలకు సాగునీరు అందించనున్నట్లు తెలిపారు. ఈ పథకం రైతుల జీవితాల్లో గణనీయమైన మార్పు తీసుకవస్తుందని పేర్కొన్నారు. దేశంలోనే తొలిసారిగా రాష్ట్రంలో సన్నబియ్యం పథకాన్ని ప్రారంభించడం గర్వకారణమన్నారు. గత ప్రభుత్వం ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రేషన్ కార్డులు మంజూరు చేసి 3.20లక్షల మందికి 80 శాతం సన్నబియ్యం అందిస్తున్నామని వివరించారు. గతంలో రేషన్ బియ్యం రీసైకిలింగ్ ద్వారా వ్యాపారులకు లాభం చేకూరేదని, ప్రస్తుతం పేద ప్రజలు కడుపునిండా భోజనం చేస్తున్నారని తెలిపారు. నూతనంగా గెలిచిన సర్పంచ్‌లు గ్రామాలకు ఒక్కో గ్రామానికి 30 ఇండ్లు మంజూరు చేసేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని ప్రకటించారు. ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి మాట్లాడుతూ కోదాడ నియోజక వర్గాన్ని ఆదర్శ నియోజక వర్గంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంకర్ నాయక్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు గుడిపాటి నర్సయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు, టిపిసిసి డెలిగేట్ చింతకుంట్ల లక్ష్మి నారాయణ రెడ్డి, కెఎల్‌ఎన్ ప్రసాద్‌తోపాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రేవంత్‌తో కాదు.. మీతో రేవంతే ఫుట్‌బాల్ ఆడుకుంటున్నారు!

### కెటిఆర్‌కు భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి ఘాటు కౌంటర్



ప్రజాపక్షం/యాదాద్రి భువనగిరి : బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యలపై భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. కేటీఆర్ తనను తాను మెస్సీలా భావించుకుంటూ రేవంత్ రెడ్డితో ఫుట్బాల్ ఆడాలని తహతహలాడుతున్నారని, కానీ వాస్తవానికి రేవంత్ రెడ్డి ఇప్పటికే కేటీఆర్‌తో రాజకీయాల్లో ఫుట్బాల్ ఆడుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఆదివారం క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రాజకీయాల్లో ఎవరూ గాడ్ ఫాదర్లు లేరని, ఎలాంటి బ్యాగ్రౌండ్ లేకుండా స్వతంత్రంగా జెడ్పిటీసీగా గెలిచి, నేడు రాష్ట్ర ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగారని కిరణ్ రెడ్డి గుర్తుచేశారు. 'కేటీఆర్ లాగా అమెరికా నుంచి పారాచ్యూట్లో దిగి సిరిసిల్లకు రాలేదు. స్థానిక నాయకులను కాదని, తండ్రి పిలిచారని వచ్చి కేవలం వంద ఓట్ల మెజారిటీతో గెలిచిన కేటీఆర్.. రేవంత్ రెడ్డి గురించి మాట్లాడటం హాస్యాస్పదం' అని మండిపడ్డారు. కేటీఆర్ తన గురించి తాను శిఖరాగ్రాన ఉన్నానని గొప్పలు చెప్పుకుంటున్నారని, కానీ ఆయనో' ఐరన్ లెగ్'అని ఆయన బావ, చెల్లెలు, చివరికి పార్టీ కార్యకర్తలు కూడా బయట చర్చించుకుంటున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ పుణ్యమా అని కేటీఆర్ ప్రస్తుతం ఫామ్ హౌజ్‌కే పరిమితమయ్యారని, రాజకీయాల్లో క్రియాశీలత కోల్పోయారని విమర్శించారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ 'గుండు సున్నా' రావడానికి, కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఓడిపోవడానికి కేటీఆరే కారణమని ధ్వజమెత్తారు. రాష్ట్రానికి రావాల్సిన పన్నుల వాటాను తీసుకురావడానికే సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ వెళ్తున్నారని స్పష్టం చేశారు. 'మేము ఇచ్చిన గ్యారెంటీలను అమలు చేస్తున్నాం, భవిష్యత్తులోనూ చేస్తాం. ఇందుకోసం కేంద్ర మంత్రులను కలిసేందుకు 50 సార్లు అయినా ఢిల్లీ వెళ్తాం. మీ నాన్నలా నియంత పాలన చేసి, బీజేపీతో చేతులు కలిపి 8 లక్షల కోట్ల అప్పులు చేయలేదు' అని నిలదీశారు. తెలంగాణలో బీఆర్‌ఎస్ తన మనుగడను కోల్పోయిందని, టీఆర్‌ఎస్ పేరు మార్చిన తర్వాత రాష్ట్రంతో ఆ పార్టీకి సంబంధం లేకుండా పోయిందని ఎద్దేవా చేశారు. గ్రామ పంచాయతీ ఎన్నికల తర్వాత కేటీఆర్ రాజకీయ భవిష్యత్తు పూర్తిగా ఖతమవుతుందని జోస్యం చెప్పారు. కేటీఆర్ ఇకనైనా ప్రాక్టికల్‌గా ఆలోచించాలని, సొల్లు కబుర్లు చెబితే ప్రజలు నమ్మే స్థితిలో లేరని హితవు పలికారు.

## ప్రతీ ఒక్కరిని కలుపుకుంటూ గ్రామాభివృద్ధికి సహకరించాలి

### మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి



ప్రజాపక్షం/మునుగోడు: నియోజకవర్గ వ్యాప్తంగా గెలిచిన సర్పంచులు గ్రామ అభివృద్ధి కోసం పార్టీలకతీతంగా అందర్నీ కలుపుకుంటూ ప్రతి పేద వాడికి సంక్షేమ పథకాలు అందేలా సర్పంచులు పనిచేయాలని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సూచించారు.ఆదివారం మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా మొదటి విడత మూడో విడత గ్రామపంచాయతీ ఎన్నికల్లో గెలిచిన సర్పంచులు వార్డ్ మెంబర్లను మునుగోడు నియోజకవర్గ కేంద్రంలోని క్యాంపు కార్యాలయం లో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మునుగోడు, ఘట్టుప్పల్,చండూరు,నాంపల్లి,మర్రిగూడ మండలాల నూతన సర్పంచులు,యాదాద్రి భువనగిరి జిల్లా పరిధిలోని నారాయణ పూర్,చౌటుప్పల్ మండలాల గెలిచిన గ్రామ సర్పంచులను, వార్డ్ మెంబర్‌లను ప్రతి ఒక్కరికి శాలువాలు కప్పి సన్మానించి అభినందనలు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్పంచి పదవి అనేది గ్రామానికి చుక్కాని లాంటిదని తన పర బేధాలు లేకుండా ప్రతి ఒక్కరిని కలుపుకుంటూ గ్రామ అభివృద్ధికి గెలిచిన సర్పంచులు వార్డ్ మెంబర్లు తోడ్పడాలని సూచించారు.ఎన్నికల వరకే పార్టీలు అని ఎన్నికల్లో గెలిచిన తర్వాత పార్టీలకతీతంగా నిరుపేదలకు అండగా నిలవాలన్నారు.గ్రామ ప్రథమ పౌరుడిగా,పౌరురాలిగా ప్రతి ఒక్కరికి కష్టసుఖాలలో అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని సూచించారు.ఈకార్యక్రమంలో అన్ని మండలాల ముఖ్య నాయకులు ఆయా గ్రామాల ముఖ్య కార్యకర్తలతో పాటు నూతనంగా ఎన్నికైన సర్పంచులు, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

## 'బీర్ల' వ్యూహంతో- విపక్షం ఖల్లాస్

### ఆలేరులో తిరుగులేని అయిలయ్య మార్క్!





ప్రజాపక్షం/యాదాద్రి భువనగిరి : రెండో విడత పంచాయతీ ఎన్నికల ఫలితాలు రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య తిరుగులేని నాయకత్వాన్ని మరోసారి సుస్థిరం చేశాయి. ఆలేరు నియోజకవర్గ వ్యాప్తంగా వీచిన 'హస్తం' గాలికి విపక్షాలు కవురుమన్నాయి. గ్రామీణ ప్రజలు అయిలయ్య పనితీరుపై సంపూర్ణ విశ్వాసం వ్యక్తం చేస్తూ, క్షేత్రస్థాయిలో ఆయన చేసిన వ్యూహరచనతో మెజారిటీ గ్రామ పంచాయతీల్లో కాంగ్రెస్ మద్దతుదారులకు పట్టం కట్టారు. తనదైన శైలిలో పావులు కదిపి 117 గ్రామపంచాయతీను కైవసం చేసుకొని ఆలేరును కాంగ్రెస్ కిల్లాగా మార్చిన బీర్ల అయిలయ్యను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ప్రత్యేకంగా అభినందించారు. నూతనంగా ఎన్నికైన సర్పంచుల గౌరవార్థం అయిలయ్య ఈనెల 23న యాదగిరిగుట్టలో నిర్వహిస్తున్న భారీ అభినందన సత్కార కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ ముఖ్య అతిథులుగా హాజరై నూతన సర్పంచులను సన్మానించనున్నారు.

**అజేయ శక్తిగా కాంగ్రెస్ గణాంకాలే సాక్ష్యం!**

నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల పరిధిలో మొత్తం 193 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరగగా, కాంగ్రెస్ మద్దతుదారులు ఏకంగా 117 స్థానాల్లో విజయ దుందుభి మోగించారు. ఆలేరు, యాదగిరిగుట్ట, తుర్కపల్లి, రాజాపేట, బొమ్మలరామారం, ఆత్మకూర్ (ఎం), మోటకొండూర్, గుండాల మండలాల్లో హస్తం పార్టీ అభ్యర్థులు మెజారిటీ స్థానాలను గెలుచుకున్నారు. దాదాపు 14 గ్రామాల్లో ఎటువంటి పోటీ లేకుండా ఏకగ్రీవంగా సర్పంచ్లను ఎంపిక చేయించి, తన రాజకీయ పట్టును అయిలయ్య నిరూపించుకున్నారు.

**విపక్ష నేతల సొంత గడ్డపై 'హస్తం' గర్జన**

ఈ ఎన్నికల్లో అత్యంత ఆసక్తికరమైన అంశం ఏమిటంటే.. నియోజకవర్గంలో గత పదేళ్లుగా చక్రం తిప్పిన బిఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యేల సొంత గ్రామాల్లోనే వారు పరాజయం పాలవ్వడం. మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత స్వగ్రామం వంగపల్లిలో కాంగ్రెస్ అభ్యర్థి గెలవడం బీఆర్‌ఎస్ శ్రేణులకు కోలుకోలేని దెబ్బ అని చెప్పవచ్చు. టిఆర్‌ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్య గౌడ్ సొంత గ్రామమైన పొరుపల్లిలోనూ కాంగ్రెస్ జెండా ఎగిరింది. బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన పడాల శ్రీనివాస్ సొంత మండలం తుర్కపల్లిలో సైతం కాంగ్రెస్ బలమైన ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. దిగ్గజాల ఇలాకాలో అయిలయ్య మార్క్ సెన్సేషన్ కావడం రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా నిలిచింది.

**సర్పంచి స్థాయి నుండి.. ప్రజా నేత వరకు!**

బీర్ల అయిలయ్య రాజకీయ ప్రస్థానం తన స్వగ్రామమైన సైదాపురంలో సర్పంచిగా మొదలైంది. ఒక సామాన్య సర్పంచిగా ప్రస్థానాన్ని ప్రారంభించిన ఆయనకు గ్రామాల్లోని మూలమట్టం సమస్యలు, ప్రజల మనోభావాలపై అపారమైన అవగాహన ఉంది. ఎన్నికల నోటిఫికేషన్ రాక ముందే ప్రతి గ్రామాన్ని పర్యటించి, సామాజిక సమీకరణాలను అంచనా వేయడంలో ఆయన సఫలీకృతులయ్యారు. నాయకుడంటే కార్యకర్త వెనుక ఉండేవాడు కాదు.. కార్యకర్తను ముందుండి నడిపించేవాడని ఆయన మరోసారి నిరూపించారు.

**23న యాదగిరిగుట్టలో విజయోత్సవం...**

నూతనంగా ఎన్నికైన సర్పంచులను గౌరవించుకునేందుకు ఈ నెల23న యాదగిరిగుట్టలో భారీ అభినందన సత్కార కార్యక్రమాన్ని అయిలయ్య ఏర్పాటు చేశారు. ఈ వేడుకకు రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారు. ఈ కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలని కాంగ్రెస్ శ్రేణులు ఇప్పటికే సన్నాహాలు మొదలుపెట్టాయి. కాగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఆరు గ్యారెంటీలు' ప్రజల్లోకి బలంగా వెళ్లాయని ఈ ఫలితాలు చాటిచెబుతున్నాయి. ఈ విజయంతో స్థానిక సంస్థలపై కాంగ్రెస్ పూర్తి పట్టు సాధించింది. అటు బీఆర్‌ఎస్, ఇటు బీజేపీ పార్టీలకు ఈ ఫలితాలు గట్టి హెచ్చరికగా మారాయి.



## సాగర్‌లో పర్యాటకుల సందడి

ప్రజాపక్షం/నందికొండ: అంతర్జాతీయ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్ ఆదివారం పర్యాటకులతో కళకళలాడింది. ఆదివారం సెలవు రోజు కావడంతో విద్యార్థులు, కుటుంబ సభ్యులు, పర్యాటకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.ఉదయం నుంచి లాంచీ సేవల ద్వారా పర్యాటకులు నాగార్జునకొండకు చేరుకుని అక్కడి పురావస్తు శాఖ మ్యూజియాన్ని సందర్శించి. బుద్ధునికి సంబంధించిన పురాతశిల్పాలు,అవశేషాలు,చారిత్రక వస్తువులను వీక్షించి ఆకర్షితులయ్యారు. మ్యూజియంలో ప్రదర్శనలో ఉన్న బౌద్ధ సంస్కృతి ఆనవాళ్లు పర్యాటకులను విశేషంగా ఆకట్టుకున్నాయి.సాయంత్రం వేళలో పర్యాటకులు బుద్ధవనంను సందర్శించి,తర్వాత ఎత్తిపోతల జలపాతాన్ని తిలకించారు. ప్రకృతి అందాలు, చారిత్రక ప్రాధాన్యం కలిగిన నాగార్జునసాగర్ పర్యాటకులకు ఆకర్షణీయ కేంద్రంగా నిలిపాయి. పర్యాటకుల రాకతో,లాంచీ సేవలు కూడా రద్దీగా సాగాయి.అధికారులు తగిన ఏర్పాట్లు చేపట్టి పర్యాటకులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు.

## నీచ రాజకీయాలు చేస్తున్న కేంద్రం


### మహాత్మా గాంధీ పేరు తీసేసి జిరామ్ జి పేరు మార్చడం సిగ్గుచేటు: కైలాష్ నేత



ప్రజాపక్షం/నల్లగొండ :జాతీయ ఉపాధి హామీ చట్టం పథకంలో మహాత్మా గాంధీ పేరును తొలగించి వికసిత్ భారత్ జిరామ్‌జి పేరుతో కొత్త పథకాన్ని తెస్తూ బిజెపి చేస్తున్న కుట్రలను నిరసిస్తూ ఏఐసీసీ పిలుపు మేరకు ఆదివారం పట్టణంలోని రామగిరిలోని గాంధీ విగ్రహం వద్ద డిసిసి అధ్యక్షులు పున్న కైలాష్ నేత ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. నల్లగొండ క్లాక్ టవర్ నుండి రామగిరి మహాత్మా గాంధీ విగ్రహం వరకు పాదయాత్రగా వచ్చి గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి నిరసన తెలిపారు. అనంతరం కైలాష్ నేత మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో మహాత్మా గాంధీ పేరు తీసేసి జిరామ్ జి పేరు మార్చడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఇలాంటి నీచ రాజకీయాలు కేంద్ర ప్రభుత్వం చేయడం సరికాదని ఇలాంటి నీచ రాజకీయ చర్యలు మానుకోకపోతే జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున కేంద్ర బిజెపి ప్రభుత్వంపై వ్యతిరేక ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు అన్నెబోయిన సుధాకర్,ఓబిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి నూనె కోటి,నాయకులు పెరుమాండ్ల నరేష్,మంగదుడ్ల శ్రీనివాస్, కంపసాటి శ్రీనువాస్ యాదవ్,కత్తుల వీరన్న,నాని యాదవ్, పల్నాటి సుధాకర్ రెడ్డి, శ్రీనువాసులు కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


## గాంధీ పేరు తొలగింపు ఆక్షేపణీయం

ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : ఉపాధి హామీ పథకానికి ఉన్న మహాత్మా గాంధీ పేరును తొలగించి వికసిత్ భారత్ జీ రామ్ జీగా మార్చడం అత్యంత ఆక్షేపణీయమని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని మహాత్మాగాంధీ విగ్రహం ముందు డిసిసి అధ్యక్షుడు గుడిపాటి నర్సయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నిరసన కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా హాజరై వారు మాట్లాడారు. ఈ నిబంధనల వల్ల రాష్ట్రాలపై అదనపు ఆర్థిక భారం పడుతుందని ఇది పేదలకు పని కల్పించే పథకాన్ని దెబ్బతీయడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్దుల్ రహీం, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఎలిమినేటి అభినయ్, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కక్కిరేణి శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్లు చిన్న జహీర్, గండూరి రమేష్‌లు పాల్గొన్నారు.



## విద్యార్థులు కష్టపడి చదివి లక్ష్యాన్ని చేరుకోవాలి

ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : విద్యార్థులు జీవితంలో ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకొని కష్టపడి చదివి లక్ష్యాన్ని చేరుకునేందుకు కృషి చేయాలని సూర్యాపేట ప్రతిభ జూనియర్ కళాశాల కరస్పాండెంట్ కె వెంకట్‌రెడ్డి, డైరెక్టర్ సత్యంబాబులు అన్నారు. ఆదివారం స్థానిక త్రివేణి గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన కళాశాల 17వ వార్షికోత్సవ వేడుకల్లో వారు పాల్గొని మాట్లాడారు. కార్పోరేట్ కళాశాలలకు ధీటుగా తమ కళాశాలలో విద్యార్థిని విద్యార్థులకు విద్యాబోధన అందిస్తున్నట్లు తెలిపారు. తమ కళాశాలలో చదువుకున్న ఎంతో మంది విద్యార్థులు ఎంసెట్, నీట్‌లలో ర్యాంక్‌లు సాధించి నేడు ఉన్నత స్థాయిలో ఉద్యోగాలు చేస్తున్నారని గుర్తు చేశారు. తమ కళాశాలలో చదువుకున్న విద్యార్థులు ఏ రంగంలోనైనా ఎక్కడైనా రాణించగలరని అందుకు తమ పూర్వవిద్యార్థులు సాధించిన విజయాలే నిదర్శమన్నారు. పేద, మధ్య తరగతి విద్యార్థుల తల్లిదండ్రులను దృష్టిలో ఉంచుకొని వారి పిల్లలను అభివృద్ధిలోకి తేవాలనే సదాశయంతో తాము, కళాశాల అధ్యాపక బృందం విశేష కృషి చేస్తున్నట్లు వివరించారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేశారు. కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



# నకిలీ ధృవపత్రాలు

(మొదటి పేజీ తరువాయి)

తిరగడంతో పాటు వైకల్యానికి సంబంధించి వైకల్య శాతం వాస్తవ పరిస్థితి కంటే తక్కువ వేశారని అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం దక్కడం లేదని వాపోతున్నారు. నకిలీ దివ్యాంగులు మాత్రం ఏ సదరం కేంద్రానికి వెళ్లాల్సిన అవసరం లేకుండానే ధృవీకరణ పత్రాలు పింఛన్‌కు అర్హత పొందే రీతిలో ఇంటికి చేరుతున్నాయన్న ఆరోపణలు వస్తున్నాయి. వైరా, బోనకల్ మండలానికి చెందిన కొందరు వ్యక్తులు ఇతర మండలాలకు చెందిన మరి కొంత మందిని కలుపుకుని ఒక ముఠాగా ఏర్పడి పెద్ద మొత్తంలో వసూళ్లు చేస్తున్నట్లు సమాచారం. వికలాంగ ధృవీకరణ పత్రాలతో పింఛన్ కొరకు దరఖాస్తు చేయగానే గ్రామ పంచాయతీ కార్యదర్శులు, మండల అధికారులు కనీస పరిశీలన చేయకుండానే మంజూరు చేస్తున్నారు. కనీస వైకల్యం లేని వారికి ఈ ధృవీకరణ పత్రం ఎలా వచ్చిందన్న కనీస పరిశీలన లేకపోవడం పలు అనుమానాలకు తావిస్తుంది. జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే వందలాది మందికి నకిలీ పత్రాలు జారీ కాగా ఇందులో ఖమ్మం పెద్దాసుపత్రిలోని ఒకరిద్దరు ఉద్యోగుల పాత్ర కీలకంగా ఉందన్న ఆరోపణలు వినవస్తున్నాయి. సందట్లో సడేమియా అన్నట్లు కొందరు అధికార యంత్రాంగంతో సంబంధం లేకుండానే కొన్ని నకిలీ ధృవపత్రాలను తయారు చేసి పంచాయతీ కార్యదర్శులకు అందజేశారు. వందలాది మంది నకిలీ ధృవపత్రాలతో అసలు వైకల్యం లేని వారు ప్రతి నెల పింఛన్ పొందుతున్నారు. ఉన్నతాధికారులు ఈ విషయంపై పూర్తి స్థాయిలో విచారణ జరిపితే అనేక విషయాలు వెలుగు చూసే అవకాశం ఉంది. లంచాలకు అలవాటుపడి నకిలీ పత్రాలు జారీ చేసిన వారిపై విచారణ జరపడంతో పాటు నకిలీ వికలాంగ ధృవపత్రాలతో పింఛన్ పొందుతున్న వారిపై కేసులు నమోదు చేసి మొత్తం సొమ్మును రికవరీ చేయాలని నకిలీ ధృవపత్రాలు ఇప్పించే ముఠాను అదుపులోకి తీసుకోవాలని, భవిష్యత్తులో ఇటువంటివి పునరావృతం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.










# ఇన్నయ్య అరెస్టు

(మొదటి పేజీ తరువాయి)

అధికారులు, ఇన్నయ్యను అదుపులోకి తీసుకున్నారు. ఇటీవల మృతి చెందిన మావోయిస్టు నేత కాతా రామచంద్రారెడ్డి అలియాస్ వికల్ప్ అంత్యక్రియలకు ఇన్నయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా మావోయిస్టులకు అనుకూల వ్యాఖ్యలు చేసి ప్రజలను ప్రేరేపించారనే ఆరోపణలపై అరెస్ట్ చేసినట్లుగా తెలిసింది. నాంపల్లిలోని ఎన్ఐఎ న్యాయస్థానం గాదె ఇన్నయ్యకు 14 రోజుల రిమాండ్ విధించింది. 'ఓ యూట్యూబ్ ఛానెల్‌లో మావోయిస్టు పార్టీకి మద్ధతు తెలుపుతున్నట్లు, మావోయిజాన్ని ప్రోత్సహిస్తున్నట్లుగా గాదె ఇన్నయ్య మాట్లాడిన వీడియో ప్రకారం మేము అరెస్టు చేస్తున్నామని అధికారులు చెప్పారు. ఆ ఇంటర్వ్యూ ఇచ్చి రెండు మూడు నెలలైంది. 'ఈ రోజు ఆదివారం కావడంతో కోర్టు ఉండదనే కారణంతోనే అరెస్టు చేశారు. సుమారు నలభై యాభై మంది పదికార్లలో వచ్చి అతడు పారిపోతాడేమోనని చుట్టూ నిఘా పెట్టారు. ప్రజల మనిషి ఎటూ పోడూ. తల్లిలాంటి పార్టీపైన ఎంతో కొంత ప్రేమ ఉంటుందే తప్ప అతడు ఎటూ పోడు' అని గాదె ఇన్నయ్య కుమార్తె పేర్కొన్నారు.





































Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com